THE BOOK WAS DRENCHED

UNIVERSAL
LIBRARY
OU_204350
UNIVERSAL
LIBRARY

OUP—552—7-7-66—10,000

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T82/R16B Accession No. T1262

Author [illegible]

Title [illegible]

This book should be returned on or before the date last marked below.

# భీష్మబ్రహ్మచారి



గ్రంథకర్త:

సోమరాజు రామానుజరావు

శ్రీ మైలవరం బాలభారతీ సమాజమువారిచే ప్రదర్శింపబడుచున్నది.

# భీష్మబ్రహ్మచారి

అను

## (సంపూర్ణభీష్మచరిత్రము)

ఆఱంకముల నాటకము.

---

రాజ్యరథము, గంగావతరణము, సతీ అనసూయ, ధరణీకోట,
ంగూన్ రౌడీ, మొదలగు నాటకములు రచించిన దేశపాండ్య

**సోమరాజు రామానుజరావు**

రచియింపఁబడినది.

---

ప్రకటనకర్త:

**కురుకూరి సుబ్బారావు,**

సరస్వతీ బుక్కుడిపో

**బెజవాడ.**

మొదటికూర్పు 1000 ప్రతులు.

తెనాలి భారతీ ముద్రాక్షరశాలయందు ముద్రింపఁబడియె.

టు రిజిష్టర్డు] 1930. [వెల 1—0—0.

1-0-0

యీ నాటకము మైలవరం బాలభారతీసమాజమువారు తప్ప యితరసమాజములు లిఖితరూపకమైన మా యనుమతి లేకుండ ప్రదర్శింపగూడదు. అట్లు యతిక్రమించిన సివిల్ క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని యిందుమూలముగా తెలియపర్చడమైనది.

ఇట్లు,

కురుకూరి సుబ్బారావు,

బెజవాడ.

# ఇందలి పాత్రములు

### పురుషులు.

శంతనుఁడు
వ్యాసుఁడు
భీష్ముఁడు
కేశవుఁడు
దాశరాజు
దాశరాజు మంత్రి
కాశీరాజు
శబరబాలుఁడు
సుధానిధి
సాళ్వుఁడు
పరశురాముఁడు
విచిత్రవీర్యుఁడు
భటుఁడు
శ్రీకృష్ణుఁడు
ధృతరాష్ట్రుఁడు
దుర్యోధనుఁడు
శకుని
కర్ణుఁడు
ముగ్గురు త్రాగుబోతులు
అర్జునుఁడు
శిఖండి

### స్త్రీలు.

గంగ
సత్యవతి
దాశరాజు రాణి
అంబ
అంబాలిక
అంబిక
దాసి
మాధవి
ద్రౌపది

విదురాదులు, స్వయంవరము రాజులు, భటులు, మొదలగువారు వత్తురు.

పదిమందితో ప్రదర్శింపవచ్చును.

గంగా—శంతనులు



శిశువును చేతనుంచుకొని కోపముతో గంగ; బ్రతిమాలుచు శంతనుడు

# భీష్మబ్రహ్మచారి

అను

## సంపూర్ణభీష్మచరిత్రము

(౧)

## ప్రథమాంకము.

### ౧. వ దృశ్యము.

ప్రదేశము—హస్తినాపుర రాజప్రాసాదము.

(ప్రవేశము— శిశువును చేతనుంచుకొని కోపముతో గంగ; బ్రతిమాలుచు శంతనుఁడు.)

(అనుబంధము ౧)

గంగ— ప్రారంభమునందలి మన సమయము మఱచెదవా?

శంత— సమయ మను మిషచేఁ బుత్త్రుల సమయించుట నీకు న్యాయముగాదు.

గంగ— నామతమున కిదియే పరమన్యాయము.

శంత— ప్రకృతిభిన్నమైన నీన్యాయము నింద్యమైనది. నీవు రాక్షస జన్మమును గాంచితివి.

సీ. సర్వప్రపంచ మై ♦ సర్గికం బైనట్టి
మాతృవాత్సల్యంబు ♦ మంటఁ గలిపి
పశుపక్షితతికి స్వ ♦ భావమై వెలసిన
పుత్త్రేషణాత్మను ♦ బోనడంచి

ఈనినతోనె సం ♦ తానంబు దిగమ్రింగు
భయద శార్దూలభా ♦ వంబుఁదాల్చి
అతిదుష్టులగు దాన ♦ వాధముల్సేయని
లలితపుత్త్రివధాభి ♦ లాషఁగాంచి
గీ. పురుషుఁబాయనివారి నె ♦ త్తురుశిశువుల
నిప్పటికి దిగమ్రింగితి ♦ వేడుగురిని
సుతుని నష్టముఁ బొలియింపఁ ♦ జూతు వీవు
రాక్షసీ! యింతకన్న గొ ♦ డ్రాలు మేలు!

గంగ— మహారాజా! నీయాగ్రహ మెవ్వరిపైఁ బ్రయోగించెదవు? చాలుఁ జాలు. నీవాదమును జాలింపుము. స్వపుత్త్రిమృతి వీక్షణమే నాకానందము. అందుల కనుమతించితివా యిచ్చట నుందును. లేదా నాదారి నేను జూచుకొందును.

శంత— ఓ పుత్త్రిప్రాణహారిణీ! మూఢుఁడనై నీమోహమున మునింగి మినుమన్నుఁగానక పుత్త్రిసప్తకముం గోలుపోయి వెకలినైతిని. ఇఁక నిన్ను గౌరవింపను. నీయిష్టము.

(పాట 1)

గంగ— ఓ రాజా! ఏమి నీబుద్ధివైశద్యము! నీవు తొలుతనే మోహంబున మునుఁగనిచో నేనులేను. పుత్త్రిసప్తకములేదు. ఏటికీలేనిపోని శోకడలఁ బోయెదవు? నాతనయుని నాయిచ్చ వచ్చినరీతి గావించుకొనుటకు నీ యాక్షేపణమేమి?

శంత— అనర్థ మగు వాదమును నిరాఘాటముగఁ గావింపదొరకొంటివి. ఓమహామారీ! నీకిదేమి పోగాలము!

ఆ. శాంతమగుచు నవ్వు ♦ జాబిల్లి వెదఁజల్లు
మహితవదన చంద్ర ♦ మండలంబు
గనిన, నెట్టిచింత ♦ లును బాయు, సుకుమారుఁ
జంప నెటులుగల్గె ♦ సాహసంబు.

గంగ—నాకు నీ విన్ని మాటలు చెప్ప నక్కఱలేదు. నీవు చెప్పఁగోరఁ దగినదియు నేను వినఁ దగినదియు నగు మన సమయము మన సమాగమ ప్రథమదివసముననే యైనది.

(అనుబంధము. 2)

చరిత్రచర్వణమిప్పుడేల? నేను మహామారినే యగుదును. ఇట్టిదానికొఱకే గదా నీయిచ్చవచ్చిన పనికి నేనాటంకము చెప్పనని ప్రతినచేసితివి. నీవెట్టివాఁడవు గావలయును?

శంత—ఓ పలుగాకీ! నీయిచ్చవచ్చిన పనికి నేనాటంకము చెప్పనన్న మాటనిజమే, గాని యిష్టమువచ్చిన పనియనినఁ బుత్త్రసంహారమను నర్థముగలదా?

గంగ—ఆఁ! కలదు. పుత్త్రసంహారము నాకిష్టమైనప్పుడు దానికదే యర్థము.

శంత—ఆహాహా! అందులకై నీవెట్టివాఁడవు గావలయునని నన్నధిక్షేపించుచుంటివా? పుత్త్రసంహార మిష్టమైన పొలఁతి రాక్షసపిశాచజన్మము లందునులేదే? కాకిపిల్ల కాకికి స్వర్గలోకము. ఈసౌందర్యమునకు, ఈసౌజన్యమునకు నీకీ దురాకాంక్ష యెట్లుగలిగె — ప్రియా! నిన్ను మిగులఁ బ్రార్థించువాఁడ. నామాట వినుము.

(అనుబంధము. 3)

గంగ—రాజా! పుత్త్రుని విడువలేక నీవింత యాందోళనము పాలు గావలదు. నీవు పుత్త్రునితో క్షేమముగా నుండుము — నీకును నాకును నీనెత్తుటిగ్రుక్కమూలమున ఋణము తీరిన దను కొందును.

శంత—నీవు నన్ను విడువనైన సంకల్పించెదవుగాని పుత్త్రుని విడువ లేవా?

గంగ—విడువను —

శంత—ప్రాణప్రియా! తిన్నఁగా నాలోచించుకొనియే మాట లాడుచుంటివా?

గంగ—ఇప్పుడాలోచించునదేమున్నది?

(పాట 2)

రాజేంద్ర! ఆనాఁడు, మన యిరువురి కడగంటిచూపుల సంకెళ్లతో మరుఁడు మన హృదయముల రెంటిని ముడివైచిననాఁడు, విబుధస్రోతస్వినీతటంబున నాచేసిన సమయము, నీవొనర్చిన యంగీకారప్రమాణము నీవినాఁడాలోచించియే మాటాడుచుంటివా? నాయిష్టమునకీవెప్పుడడ్డుసెప్పిన నప్పుడు నేనిన్ను విడిచి పోదునన నీవట్లయని యంగీకరించితివిగదా? మీఁదు మిక్కిలి నన్నాలోచించియే మాటలాడుచుంటివా యని పృచ్ఛించుచుంటివా? ఆహా! ఏమి నీయనురాగబలము!

శంత—అనురాగబలమునఁగాదా యనుంగుబిడ్డల నేడుగురిని బలి యొసంగితిని?

గంగ—ఎనిమిదవవానిఁగూడ నొసంగరాదా?

శంత— ఛీ! కుమారహంత్రీ! కొంటెబాలురాటలకై నోరులేని మండూకముల గాలంగొట్టి చంపినట్లు, సొగసారు రింగిణీపురువుల మెడల కురులువోసి గిరగిరఁదిప్పి గడతేర్చినట్లు, నవనవలాడు పల్లవంబుల గిల్లివేసినట్లు, అమాయికులు సుందరాకారులు సుకుమారులు నగు నాబిడ్డల నేడుగురిని, ఇప్పటికి నాయంత వారు గాఁదగిన వంశోద్ధారకుల నీపొట్టఁ బెట్టుకొంటివి! "పున్నామ్నో నరకాత్త్రాయతే ఇతిపుత్త్రః" యను వేదవాక్యము గణింపక కామాంధకారమ్మునఁ గన్నుఁగానక ఇహపరమ్ములు నీవే యని విశ్వసించి పుట్టిన నందనులఁ బుట్టినట్లు సత్తికి బలి యిచ్చినట్లు నీకడుపునఁ బెట్టి నీళ్లువోసితి—ఎనిమిదవవానిఁగూడ నొసంగ నీమాయాంధకూపమున దరిఁగానక మునుకలు వెట్టుమనుచుంటివా? ఛీ! ఛీ!!

( అనుబంధము ౪. )

నాకుమారుని నాకిమ్ము—నీదారిని నీవుపొమ్ము. (కుమారుని లాగికొనుచున్నాఁడు.)

గంగ—(చేతులుజోడించి) వాణీధవా! శాపవిముక్తి దయసేయుము.

(విమానము వచ్చుచున్నది)

శంత—(ఆశ్చర్యముతో) ఆహా. వాణీధవుఁడేమి? శాపవిముక్తియేమి? యీవిమానమేమి? ఇదియంతయు నేమో మాయగా నున్నది. ఓదేవీ! నాసందేహముఁ దీర్పుము——

గంగ—శంతనుమహారాజా! మన యిరువురి పూర్వజన్మచరిత్రము నెఱింగినఁగాని నీసందియము తీరదు. దానివాకొనెద నాకర్ణింపుము. నేను గంగాదేవిని. పితామహుశాపంబున మనుష్యస్త్రీరూపంబున నిన్ను సేవింపవచ్చితి. నీవు పూర్వజన్మమున నిక్ష్వాకువంశమ్మున జనించి మహాభిషుండను పేర మహీతలంబుఁ బాలించి హయమేధసహస్రంబును రాజసూయశతంబును బొనరించి, తత్పుణ్యప్రభావంబున సత్యలోకంబునకుం జని దివ్యర్షిజనంబులతోఁ గొలువుదీర్చియున్న పితామహు సేవించుచుంటివి. అయ్యవసరంబున స్త్రీరూపధారిణినై యేనచ్చటకు విధాతృసందర్శనమునకు కరుగుదెంచితిని. ఆబ్రహ్మసభలో నేను దివ్యమునీంద్రులయు వాణీపంకజాసనులయు ప్రసంగముల నాలింపుచు నేమఱి నిల్చియుండ ననిలాహతింజేసి నాయూరుమూలము బయలుగా నావస్త్రముదొలఁగె. దేవర్షులు పరాఙ్ముఖులైరి. నేను తెలివిదెచ్చుకొని పుట్టము సవరించుకొను నంతలో నీవు సాభిలాషుండవై నాదెస నవలోకించుచుంటివి. అదిచూచి కమలభవుండు నీయెడఁ గరమ్ముగినిసి నిన్ను మర్త్యయోనింబుట్ట శపించె. అప్పుడు నేను నీమహానుభావంబునకు రూపసౌందర్యములకు, నీకు నావలనఁగలిగిన శాపంబునకుఁ బరితపింపఁజొచ్చితి. నాపరితాపము నెఱింగి కమలయోని నాయెడంగనిసి మర్త్యయోనింబుట్టిన మహా

భిషునకు నీవు కాంతారూపధారిణివై నీగర్భమ్మున నష్టవసువులు నందనులై జన్మించువఱకు భార్యవై యుండునది యని శపించె. మనకుఁ గల్గిన బిడ్డ లష్టవసువులే!

**శంత**— పరమపావనులగు నష్టవసువులు మర్త్యలోకంబున జన్మించుట కేమికారణము! మఱి పుట్టినవారి పుట్టినట్లు నీవుగంగం ద్రోయుట కేమి హేతువు?

**గంగ**— దానికిఁ గారణము వసిష్ఠశాపము—

**శంత**— వసిష్ఠుఁడేల శపించినాఁడు?

**గంగ**— బ్రహ్మర్షి శేఖరుండగు వసిష్ఠుని దర్శింప నష్టవసువులు భార్యాసహితులై యొకనాఁడరుదెంచి తదాశ్రమమున వసిష్ఠునకు నిచ్చకు వచ్చిన వస్తువు లాజ్ఞామాత్రమున నందిచ్చు నందిని యను నతని హోమధేనువును గని దురాశాపీడితులై దాని నపహరించిరి. మునియు యోగదృష్టిని నిజం బెఱింగి మానవయోనిఁ బుట్టు వారని శపించె— వా రాతని పదమ్ములం బడి మర్త్యంబున బెద్దకాలం బుండకుండునట్లుగా శాపవిముక్తి ననుగ్రహింప వేఁడ దయామయుండై యాబ్రహ్మముని మీయభిమతంబగు— నయిన మీ యగ్రజుండు ప్రభాసుండీ దురాలోచనకు మూలము గావున వాఁడు మాత్రము మానవలోకంబునఁ జిరకాలంబుండుఁగాక యని వచించె— ఆప్రభాసుఁడే యీశిశువు— వీఁడు మహా పరాక్రమవంతుఁడై యశోవంతుఁడై యొసంగఁగలఁడు— మఱి యొకమాట — వీఁడయిదేండ్లవాఁడయినంతట నేనరుదెంచి వీని సురలోకంబునకుఁ గొనిపోయి సమస్తశాస్త్రంబుల నేర్పించి పిమ్మట నీకప్పగించెద. అంతవఱకు వీఁడు నీచెంతఁ బెరుగుఁగాక— శంతనురాజేంద్రా! సెలవు.

(విమానము నధిరోహించును. విమాన మెగిరిపోవును.)

**శంత**— (ఆశ్చర్యముతోఁ జూచుచుండును)

(యవనిక వ్రాలును.)

## * 2. వ దృశ్యము.

ప్రదేశము—ఆశ్రమము.

ప్రవేశము—ఈశ్వరధ్యానము సేయుచు వ్యాసుఁడు.

( అనుబంధము. ౫)

(ప్రవేశము—కుమారభీష్ముఁడు)

కుమా—వ్యాసమునీంద్రా! నమస్కారము.

వ్యాసు—అద్వితీయోభవస్తు—గాంగేయా! కూరుచుండుము.

కుమా—(కూర్చుండి) మహానుభావా!

ఆ. పరశురామమూర్తి ♦ బాహ్యవైరులఁగెల్చు
శస్త్రవిద్య నాకొ ♦ సంగినట్లు
లంతరరులఁగెల్చు ♦ నట్టివిద్యను జాలి
నాకనుగ్రహింపు ♦ లోకమాన్య!

వ్యాసు—శాంతనవా! అంతర్వైరి నిర్మూలనమునకు ధర్మరహస్యము నెఱుంగవలయును.

కుమా—అది యగాధమని పెద్దలు వాకొందురు. నాబోటియల్ప—

వ్యాసు—ఆపగాతనయ! ఈప్రపంచమున నల్పమేమియులేదు. సర్వముసు జగదీశ్వరస్వరూపము— జగదీశ్వర స్వరూపమగు నీ ప్రపంచముకొఱకు స్వార్థమును బలియొసంగుటయే ధర్మరహస్యము నెఱుంగుట—

కుమా—బోధపడుచున్నది.

వ్యాసు—సురనదీనందన! నిరంతర మీస్వార్థత్యాగ మంత్రమునుజపించుచుండుము—ధన్యుండవయ్యెదవు—భారతవీరపితామహుండవయ్యెదవు. నిఖిల జగత్సృష్టిపాలనవిలయక్రియాసమర్థుండగు

* ఇట్టి గురుతుగల రంగములు, భాగములు శ్రీశైలవరము బాలభారతీ నాటక సమాజకర్త, ము. వేం. చెన్నకేశవులుగారు వ్రాసినవి.

సర్వేశ్వరుఁడు శ్రీకృష్ణుఁడు త్యాగవీరుండవగు నిన్ను లయ మొనరింప సమర్థుండై నీమరణమునకు నిన్ను భిక్షింపఁగలఁడు.

( అనుబంధము ౬. )

**కుమా**— మహాత్మా! ధన్యోస్మి—

చ. నిరవధికంబు నిర్మలము ♦ నీయుపదేశ మిదే ధరించితిన్
శిరమునయందు భక్తిఁ దుల♦సీదళముంబలెఁ గాని, క్షుద్రుఁడన్
నరుఁడ భవత్సుబోధల న ♦ నారత మాచరణమ్ము సేయఁగా
స్థిరమతి నాకుఁ గల్గుటకు ♦ దీవన లీయవె శిష్యవత్సలా!

**వ్యాసు**—శంతనుతనూజ! నిన్నాశీర్వదించుచున్నాఁడ. పరమాత్మ నీకు హృదయస్థైర్యము ననుగ్రహించుఁగాక.

**కుమా**—అనుగ్రహింపఁబడితిని.

(యవనిక వ్రాలును.)

ఇదిప్రథమాంకము.

శ్రీ

# భీష్మబ్రహ్మచారి

(సంపూర్ణ భీష్మచరిత్రము.)

---

## ద్వితీయాంకము.

---

### ౧ వ దృశ్యము.

ప్రదేశము — యమునాతీరము.

ప్రవేశము — శంతనుఁడు — కేశవుఁడు.

శంత — కేశవా! ఇదియొక యనాగరిక ప్రదేశమని నాకుఁ దోఁచుచున్నది. చూడు.

సీ. చేపలపోలసును ♦ జేర్చిన కసవుపై
మూఁజూచి దోమలు ♦ ముసురుచుండ
గంగాలహరినుండి ♦ గడలఁదెచ్చిన వల
లంచితమ్ముగ నెండ ♦ నాఱుచుండ
ఎండిన చేపల ♦ మెండైనవాసన
లఖిల దిశావళి ♦ నలముచుండ
లవణంబురాఁచి య ♦ ల్లన నెండవేసిన
వరమత్స్యతతు లెండ ♦ మెఱయుచుండఁ

గీ. కృష్ణవర్ణదేహములతోఁ ♦ గ్రింద జాను
వులనుమీఱని లఘుచేల ♦ ములనుదాల్చి
జడు లనాగరికప్రజల్ ♦ సంచరించు
నిది శబరవాటమని తోఁచు ♦ మదికి హితుఁడ!

కేశ—మిత్రమా! శంతనుమహారాజా! ఈ మత్స్యములు పెండ్లివారి విందులకుఁ దేఁబడిన కూరగాయలవలె నిందు సమకూర్పఁబడి యున్నవిసుమా!

శంత—కేశవా! పెండ్లికూఁతురు కనఁబడకయే నీవొనర్చిన యుపమాన రీతి యుక్తముగా లేదుసుమా!

కేశ—శంతనుమహారాజా! అటుచూడుము. చూపుమేరదూరమున నాఁ వ్రేలికి సూటిగా యమునానదీమధ్యమున నొక నావను గడ పుచు వచ్చుచున్న యంగన ముసిముసి నవ్వులు నవ్వుచు నచ్చ ముగఁ బెండ్లికూఁతురులాగుననే కనఁబడుచున్నదికాదా?

శంత—ఔనుజుమా! కేశవా! ఎంతటి సౌందర్యశాలిని యీమానిని.


(అనుబంధము. 2) (పాట 4)

గీ. ధరకు డిగ్గిన వరతటి ♦ త్కాంతియేమొ?
తనువుఁదాల్చినయట్టి సౌం ♦ దర్యమేమొ?
బ్రహ్మజ ననుగ్రహించిన ♦ గంగయేమొ?
కానుపించుచున్నయది దృ ♦ క్పర్వముగను.

సఖుఁడా! యీ శబరపల్లిలో సహజముగ మనకుఁ దోఁపవలసిన మత్స్యదుర్గంధమునకు మారుగ నొకవిధమగు సుగంధము ఘ్రాణ పరిచితంబగుచున్నది. చూడు—ఈ పరిమళము తప్పక యీ యొప్పులకుప్పనుండియే వచ్చుచున్నదని నానమ్మకము.

చ. తుములముగా బెడఁగుఁ జను ♦ దోయిని మూసినయట్టి చేలమే క్రమముగ జానుయుగ్మమును ♦ గప్పెడునంతకు డిగ్గఁ, గానదే హము సగపాలు షోడశక ♦ శాన్వితమైన పసిండియుంబలెౝ సుమహితమై వెలింగెడు వ ♦ సుంధర నీ సతి జాతి యెద్దియో!

కేశ—కుమ్మరావమున నిత్తడిముంతలాగున నీ శబరాలయమున వేఱు జాతి స్త్రీ యెక్కడినుండి వచ్చును?



పడవనడుపుచున్న సత్యవతిని శంతనుడుచూచి మోహించుట.

శంత—ఆహా! విధాత నిజరచనాచాతుర్యము నంతయు నీయలివేణిని సృజించుటలోఁ గనఁబఱచుకొన్నాఁడు! ఏమి యీ కాంతా సౌందర్యము?

కేశ—రాజా! నీవేమియో వర్ణించుచుంటివిగాని నాకంటికీ కాంత యీకాంత యననేల? ఆడువారందఱు నందముగానే యుందురు.

శంత—కేశవా! ఈ మదిరాక్షిని మాటాడింతము.

(యమునలో నావఁద్రోసికొనుచు సత్యవతి ప్రవేశించుచున్నది)

శంత—(సమీపించి)

చ. ఎవని తనూజ వీవు జల ♦ జేక్షణ! యీజలమధ్యమందు నీ
వవిరళరీతి నావను బ్ర ♦ యాణము సల్పఁగ హేతువేమి? నీ
ప్రవిమలనామమెయ్యది? భ ♦ వన్మృదుకంఠరవంబుతోడ నా
చెవినిడు త్వత్కథానకము ♦ శీఘ్రమె మత్తగజేంద్రగామినీ!

సత్య—నన్ను సత్యవతియందురు – నాతండ్రి యీ శబరాలయమునకు ఱేఁడు. మత్స్యాకర్షణమునకై నేనిందుఁ దిరుగుచుందును. ఇదియే నావృత్తి.

శంత—నీవు మత్స్యాకర్షణ వ్యాపారవనికదా వచించెదవు. నీకడ వృత్తిసహజమగు దుర్గంధమునకు మాఱుగ నీసుగంధ మెట నుండివచ్చెను – అదిగాక

గీ. శబరవంశజాతము ♦ నీదు ♦ జన్మమరయ
మేని సౌందర్యమా యని ♦ మిషులనైన
నలరఁ బోసది కడు విస్మ ♦ యంబు గలిగె
నవిలాసంబు విభ్రమా ♦ న్వితము సూవె!

సత్య—కొన్నాళ్ళకుఁ బూర్వము పరాశరమహర్షి యీనావయందే యెక్కి యమునానదిని దాటుచు నన్నుఁగాంచి – (అని లజ్జించుచున్నది)

శంత—తెలిసినది – తరువాత జరిగినసంగతి నెఱింగింపుము.

సత్య—కన్యాత్వమునసే నాకు పరాశరు ననుగ్రహమున వ్యాసుఁడను బాలుఁడు జన్మించెను. దైవచిత్రగతిచే నాబాలకుఁడు జన్మించిన తోడనే తపంబు సలుప నరిగెను. అప్పుడు పరాశరు ననుగ్రహమున మత్స్యగంధి నగు నేను యోజనగంధిగా మారితిని. మఱియు, మహానుభావుండగు నమ్మహర్షి తన తపఃప్రభావమున నా కన్యాత్వము భంగముగాకుండను, నింకననేకవరంబులనొసంగి నిజేచ్ఛంజనియె.

(ప్రవేశము — శబరబాలుఁడు)

శబ—అక్కో! సత్తెవాతీ! సత్తెవాతీ'

సత్య—మాతమ్ముఁడు వచ్చినాఁడు. నేనరుగవలెను.

శబ—అక్కోయ్ బద్దబద్దగుల్లాలు, ఆటిమూఁతులకు కల్లేలు – ఆటిమీఁద బల్లేలు. (రాజునజూచి భయముతో) అక్కోయ్! బూచి. బూఛి. కలుత్తాలు— కలుత్తాలు—పాలిపోదాం పాలిపోదాం.

(సత్యవతి నీడ్చుకొనుచు నిష్క్రమించును.)

శంత—(విస్మితుఁడై చూచుచుండును)

కేశ—మిత్రమా! అమాయికయగు నీబాలిక యెంత నిష్కపటముగ సత్యమును వెల్లడించినది – నాగరికు లందిట్టి వర్తనము గానము సుమా!

శంత—కేశవా! నడుమ నీబాలుఁడొకఁడు వచ్చి సత్యవతి నీడ్చుకొనిపోయెనే? ఏమిసేయుదము?

కేశ—నీహృదయ మీశబరకన్యక యందు లగ్నమైనట్లున్నది.

శంత—కేశవా! నీవు నిజము గ్రహించితివి. కర్తవ్యమేమి?

కేశ—దీనికింత యోచనయేల? చక్రవర్తివగు నీకాటంకమేమి? పల్లియ కరిగి యీబాల జనకు నడుగుదము రమ్ము.

శంత—మంచిది. పోదము. (ఇరువురు నిష్క్రమింతురు)

## దృశ్యము ౨.

### ప్రదేశము — దాశరాజుగృహము.

(ప్రవే — కోపముతో నటునిటుదిరుగుచు దాశరాజు.)

(పాట 5. అనుబంధసంఖ్యలో ౮.)

దాశ — అందఱికిదే పోయేకాలం పుట్టాలా? ఒకళ్లూ నామాట యినడంలేదు. నామాట గడ్డిపరకనుకున్నారు. నేసచ్చిమోతా.

మంత్రి — (ప్రవేశించి) మారాజా! చాణా కోపమ్మీదుండారు?

దాశ — మంతిరీ! నేసచ్చిమోతా!

మంత్రి — మారాజా! మీరు —

దాశ — మారాజా గీరాజా మాటలు నాకఖ్ఖర్లేదు. తిన్నగా పన్జేత్తే సెయ్యాల్సింది. లేకుంటే తోఁక మడతెట్టాల్సిందే!

మంత్రి — పనిసేత్తూనే వుండానుగా!

దాశ — నువ్వు — మంతిరీ! ఇగో. యిఁటుండావా?

మంత్రి — సిత్తం —

దాశ — సిత్తం గిత్తం. అనాల్సినపన్లేదు. దొంగనాయాళ్లనేమాటలు నాదగ్గెర కట్టిపెట్టు.

మంత్రి — కట్టిపెట్టాను.

దాశ — నేసచ్చిమోతా!

మంత్రి — ఇప్పుడంత గాసారమేమొచ్చిందీ!

దాశ — వొఖ్ఖళ్లూనామాటినడంలేదు. అందరికి పెద్దరోగమొచ్చిందీ-రాణీకి నాకు యియ్యాలిటితో చరిపోయింది. అందుకని సచ్చిమోతా —

మంత్రి — అప్పుడే సచ్చిమోతే రాజ్జెకారమో మరి?

దాశ — ఆఁ! అవును. ఆమాటా నిబద్ధికమే — కాని రాజ్జెకారానికి నువ్వుండావుగా!

మంత్రి—మంతిరెక్కడైన రాజ్జెకారంచేత్తాడా మారాజా!

దాశ— అవును- ఆమాటా నిబద్దీకమే. ఐతే యేం చెయ్యమంటావు?

మంత్రి—నామాటిని యిప్పుడు సచ్చిమోకండి! తరాత చావకాచంగా సచ్చిపోవొచ్చును!

దాశ—నాకంతా అదోకయిదంగావుంది. మంతిరీ! నే నిప్పుడు చత్తే రాజ్జెకారం ఆగిపోవాల్సిందే అంటావా!

మంత్రి—తప్పకుండా ఆగిమోతుంది. నిలబడిమోతుంది.

దాశ—అయితే యిప్పుడు సచ్చిమోను.

(దాశరాజురాణి కోపముతోఁ బ్రవేశించుచున్నది.)

రాణి—సచ్చిమోతా- సచ్చిమోతానని పెతాపాలేడవకుంటే సచ్చిమోరాదూ?

దాశ—సచ్చిపోమని చెప్పడానికి నువ్వోసెవు! నాయిట్టమొచ్చినప్పుడు చచ్చిమోతా- నువ్వన్నప్పుడల్లా సచ్చిమోతానేంటి! ఏం మంతిరీ!

మంత్రి—అంతే!

రాణి—నేనీరాజ్జానికి రాణిని. నామాట చాగాల్సిందే. నేను సెప్పింతరాత వోడైన చశే చావాల్సిందే. ఏంమంతిరీ!

మంత్రి—అంతే

దాశ—నువ్వు రాణివైతే నేను రాజుని- నామాటా చాగాల్సిందే. ఏం మంతిరీ!

మంత్రి—అంతే!

రాణి—సచ్చునాయాలా! మంతిరిదగ్గిర పెతాపం సూపెతుండావా! మంతిరీ! నిన్నియ్యాలనించి పనిలోంచి తీసేశా పో. పో.

మంత్రి—సిత్తం.

దాశ—మంతిర్ని పనిలోంచి తీచేత్తే రాజ్జెకారం సాగడమెట్టా?

రాణి—అబ్బ! మాగొప్ప రాజ్జెకారం తగలమడ్డది. మీాయిద్దరూ సచ్చి పోండ్రా! రాజ్జెకారం నేనడుపుకుంటా-

రాజు—ఏం మంతిరీ!

మంత్రి—రాణి సెపితే సచ్చిమోయిన రాజు నెక్కడైనా సుశారా మారాజా!

దాశ—అవును- ఎక్కడనైన సూశామా! నే సచ్చిమోను. నాయిట్ట మొచ్చినప్పుడు సత్తాను- ఏం మంతిరీ!

మంత్రి—అంతే!

రాణి—మొదవకొడుకుల్లారా! మీారిద్దరూకలిచి నామాట సాక్కుండా సేత్తుండారా! మీాకు పొరకపూజ కావాల్సిందే-వుండండి. (నిష్క్రమించును)

(పాట-6)

దాశ—ఏం మంతిరీ!

మంత్రి—మన మెక్కడికైన పారిపోదాం రాజా!

దాశ—ఎందుక...

మంత్రి—రాణి మా సెడ్డది—సీపురకట్ట తెత్తానని పోయిందిగా—

దాశ— తెత్యే తేనియ్యి.

మంత్రి—యీాపు పెట్లగొడుతుందిగా.

దాశ—కొడితే కొట్టనియ్యి—మల్లీ కొడదాము.

మంత్రి— మనంకొట్టలేం మారాజా! నామాటవిని పారిపోదాం రాండి.

దాశ—ఏరాజైన రాణీకి జడిచి పారిపోయినోడున్నాడా మంతిరీ!

మంత్రి—మా రాజా! మీారున్నారుగా!

దాశ—ఎవ్వడూలేకుంటే నేనూపోను.
మంత్రి—అయితే మీాసిత్తం. } (కూర్చుందురు)

(శంతనుఁడు కేశవుఁడు ప్రవేశించుచున్నారు)

కేశ—(పరికించి) శంతనుమహారాజా! ఆకారవ్యవహారాదులను విమర్శించిచూడ దాశరాజా యిరువురిలోఁ బొట్టవాఁడని నాకుఁ దోఁచుచున్నది.

శంత—ఆహా! ఎంతవిపరీతము.

ఆ. తుమ్మవనమునందుఁ ♦ దులసీకుజముఁవోలె
పంకగర్భమందుఁ ♦ బద్మమట్లు
శూక్తిమధ్యమందు ♦ మౌక్తికమట్టు లా
సత్యవతి జనించె ♦ జడునియింట.

కేశవా! సమీపమునకుఁబోయి మాటాడుదము. రమ్ము.

మంత్రి—రాజా! ఓరో వొత్తుండారు. టీకుగా గూకోండి.

కేశ—దాశరాజవు నీవేనా?

దాశ—నీవేనా అని అడుగుతుండావా? నేను గాకుంటే యింకెవఁడు? నువ్వోడవు? ఈనెవఁడు? మెవఁడానువ్వు?

కేశ—ఇతఁడు నామిత్రుఁడు. నాపేరు కేశవుఁడు!

దాశ—మనేద క్రేకుండా లోపలికి రావడమే! ఏంమంతిరీ!

మంత్రి—అంతే --

కేశ—అపరాధమే జగినదే! మేమిక్కడిమర్యాదలనెఱుంగనివారము. క్షమింపుఁడు.

దాశ—ఎరగనోళ్లచలు రాఁనేకూడదు — మామనేద లెరక్కుంటే సెపుతానినండి—

కేశ—వినుచున్నాము.

దాశ—నన్ను సూడాల్సిందనుకొనేవోళ్లు ముందర్తిగా మాబావమరిది గారికి నజరానా పంపాల్చింది.

కేశ—ఓహో — మీబావమరిదిగారికా?

దాశ—ఏంమంతిరీ?

మంత్రి—అంతే—

దాశ — అంతే—

కేశ — చిత్తము—తరువాత

దాశ — తరాత, మామంత్రి మేనల్లుడికి కొంచెం దెగ్గరగా నిలబడి చలాంకెయ్యాల

కేశ — అబ్బో — చాలాయున్నదే — తరువాత—

దాశ — తరాత, మారాణికాడికెల్లితే యెంటమనిసిని పంపి నాకాడి కంపుద్ది—అప్పుడు దరిశెనం సేసుకోవాల—

కేశ — మాకిన్ని తెలియకపోవుటచేత నిట్లు వచ్చితిమి. క్షమింపుఁడు.

దాశ — మీరచ లెందుకొచ్చినట్టు?

కేశ — ఈనామిత్రుని మన్మథుఁడు తనబాణములతోఁ గొట్టినాఁడు.

దాశ — ఆడెవఁడూ?

కేశ — వాఁడొకరికిఁ గనఁబడఁడు. వయస్సునందున్న స్త్రీపురుషులలొకరి నొకరు చూచుకొనిరేని వారిపై తనబాణములను వేయుచుండును.

దాశ — ఇప్పుడీయ నెవర్ని సూశాడూ?

కేశ — నీ కుమార్తెయగు సత్యవతి నీయన చూచినక్షణమున, మన్మథ బాణములచే నీయన బాధింపఁబడెను—

దాశ — నాకొమారితె నీయనసూత్తే — నేనేకొట్టాల్సిందేకాని — ఆడెవఁడూ కొట్టడానికి? ఏమంటిరి!

మంత్రి — అంతేమరి!—

కేశ — వానికి వృత్తియే యదిగనుక — నామిత్రునిపై బాణములను వదలెను—

దాశ — అయితే — యీడిట్టా అందరిమీదా బాణాలేసుకుంటా — తిరుగుతుంటాడేం?

కేశ — ఔను—

దాశ — అయితే ఆడిచంగతీ — ఆడిచుందరబాం కొంచెం కనుక్కోవాలిచిందే — ఏమంటిరి?

మంత్రి—అంతే_

కేశ — వాఁడొక్కరికి చిక్కువాఁడు కాఁడు. ఎవ్వరికిని కనబడఁడు. అందువలననే మీదగ్గఱకు రావలసివచ్చినది.

దాశ —మరెట్లా!

కేశ—ఆబాధ తీరుటకొక యుపాయమున్నది.

దాశ —ఏంటది?

కేశ —మీకుమారైయగు సత్యవతిని నామిత్రునకు వివాహము చేసినచో, నీబాధతీరును.

దాశ —ఓహోహో! సిక్కెక్కినమాటే_

కేశ—చిక్కేమియునులేదు. నామిత్రునివంటి యల్లుఁడు మీకు దొరుకుట కష్టసాధ్యము.

దాశ —అంతగా సెపుతుండారుగనక, ఆడగాల్సొచ్చింది. ఈయన చంగతంతా మాకు తెలియసెప్పండి.

కేశ — ఈయన హస్తినాపురాధీశ్వరుఁడు రూపసౌభాగ్యసంపన్నుఁడు.

మంత్రి—(అదరిపడి) ఏంటి?—

కేశ —శంతనమహారాజు

దాశ—ఏంటీ మాంతిగి?—

మంత్రి—లెగండి

దాశ —ఎందుకనీ?

మంత్రి — ముందు లెగండీ?—

దాశ —చంగ తేంటోయ్?

మంత్రి—ముందు లెగమంటేను?- మల్లీమాత్తాడతమెందుకనీ- లెగండి?

దాశ — నేనురాజుని. నా దిమ్మాచనాని మీంచి లెమ్మనేవోళ్లెవళ్లూ?- నేను లెగను-అంతే-

మంత్రి—మీరురాజైతే మీకంటే యీాయన పెద్దరాజు- అందరికంటే పెద్దరాజు.

దాశ — అంటే-

మంత్రి — అయ్యో! ముందు లెగండి — ఈయన చెకరవరితి-

దాశ — అయితే లెగాలిచిందే అంటావా?

మంత్రి — ఇంకా కూకుండారా?

దాశ — (లేచును.)

మంత్రి — సెకరవరితిగారి నెరక్కపోయినాం బాబయ్యా-! కురిసీమీద కూకోండి-

కేశ — అక్కరలేదు. నిలువఁబడియే మాటలాడెదము. ముందు మేము వచ్చినసంగతి విచారింపుఁడు-

దాశ — ఏంమంతిరీ!

మంత్రి — (అప) ఇది రాణిగారికాడ తీరుమానం గావాల్సినచంగతే-

దాశ — మల్లీ రాణినడగమంటుండావా? ఏరాజైన కోపమొచ్చినరాణిని బతిమాలుకోవడం సూశావా మంతిరీ?

మంత్రి — నీబద్దీకమే కాని — అమ్మాయిగారి పెల్లి మాటలొచ్చినప్పుడు రాణికి కోపంరాదు మారాజా!

దాశ — ఐతే — యెల్లమంటావా?

మంత్రి — ఎల్లాలిచిందే —

దాశ — (నిష్క్రమించును.)

కేశ — మహాప్రభూ! ఈమర్యాదల నెన్నఁడైనఁ దిలకించితిరా?

శంత — కేశవా! విస్మితుండనై నిలువఁబడియున్నాఁడను.

కేశ — ఈనాగరకుని పుత్త్రికనేకదా తమరు వివాహమాడఁదలఁచినది

శంత — మిత్త్రమా! అదేమిచిత్రమోకాని, రూపభాషావివేకాదుల యందాజగన్మోహనాంగికిని వీరికినిఁ బోలికయే లేదుసుమా!

సీ. బిసరుహావిభ్రాంతి • మసరుతుమ్మెదలట్లు,
నెరికురుల్ మొగమందు • విరిసియాడ,

చాలిచాలని జీర్ణ ♦ చేలాంతరమునుండి,
మొనగబ్బిగుబ్బలు ♦ ముసిసియాడ,
డాకేలఁగొన్న యా ♦ తాఁకులబుట్టలోఁ
గడకొన్న చేపలు ♦ కదలియాడ,
అనువుగా నడచేతు ♦ లను రెంటఁగూర్చిన
చిన్ని మోమున నవ్వు ♦ చిందులాడ,
గీ. వెస పదారువుటంబుల ♦ మిసిమిచాయ –
తో శరీరంబు వితకాం ♦ తులనుగూడ –
నిత్యసౌభాగ్యవతియైన ♦ సత్యవతికి –
నాటవికులగు పేరికి ♦ సాటిగలదె?—

కేశ—ఆకారాంతఃకరణములెటులున్నను - వీరికడనేకదా యీమెకు నాగరికశిక్ష యలవడినది!

(తరువాత దాశరాజు — రాణిప్రవేశము.)

రాణి—(దూరముగ సిగ్గుతో నిలువఁబడియుండును.)

దాశ—మంతిరీ!

మంత్రి—చిత్తం—

దాశ—(చెవిలో నేమోచెప్పును.)

మంత్రి—(కేశవునిఁజూచి) ఈ విసయంలో మా రాణిగారి వుద్దేచం ఏమిటంటే — వుద్దేచంకాదు— పసినె ఏమిటంటే — మన చెక రోత్తిరిగారికి యిదొరకు వొవ్వరైనా పెళ్లాలుండారా అని –

కేశ—ఇప్పుడెవ్వరునులేరు — కాని,

దాశ—మంతిరీ! ఈ "కానిక్" నీకేమైనా అర్ధం తెలిచింది—

మంత్రి—ఊహుఁ! నాకిడిపోయిందిగాదు—

దాశ—నాకూ యిడ్డదిగాదు -

కేశ — కాని, అనఁగా– యిప్పుడు లేరుగాని, పూర్వమున గంగాదేవిని వివాహమాడిరి. ఆకథ ముగిసిపోయినది–

రాణి — ఇగో! – ఇట్లారా–

దాశ — (రాణిదగ్గఱకు పోవును.)

రాణి — (దాశరాజు చెవిలో నేమో చెప్పును.)

దాశ — మంత్రిరీ! (మంత్రిచెవిలో నేమో చెప్పును.)

మంత్రి — (కేశవునితో) ఆ చమందంపిల్లలెవరైనా వున్నారా?

కేశ — ఆఁ ఉన్నాఁడు! మహాపరాక్రమ నిధియగు గాంగేయుఁడున్నాఁడు.

మంత్రి — అట్లాగయితే – యీలుగానిపనే –

కేశ — ఎందుచేత?

మంత్రి — రాణీగారి ఆశ నేంటంటే – "మాసత్యవతి నేమన చక్రవర్తిగారు పెళ్లాడేట్టుంటే – ఆమెకొడుకే రాజ్యానికి రావాలిచింది" – అని.

కేశ — ఇదియా! మీకోరిక? – మహారాజా! వింటిరా?

శంత — (నిట్టూర్పువిడిచి) మిత్రమా! వింటిని! అసాధ్యమగు కోరిక కోరఁబడినది! నేనేమి చేయుదును. స్త్రీవాంఛందగిలి – వంశపరంపరాగతంబగు రాజ్యాధికారమును భీష్మునకు గాకుండఁజేసి పెద్దల శాపంబులకుఁ దలయొగ్గలేను – నావిధి యెటులున్న నటులగును. వెనుకకు మరలుదము.

కేశ — దాశరాజా! ఇంకేమియు తిరుగులేదా?

దాశ — ఇది రాణి యిష్టంలేని పనిగనుక తిరుగులేదన్నమాటేనా! ఏ మంత్రిరీ –

మంత్రి — అంతే–

కేశ — రాజేంద్రా! ఇంక వెళ్లుదము!

శంత — ఆలస్యమెందులకు? — (ఇద్దఱును నిష్క్రమింతురు)

రాణి — కోపలమ్మోయమ్మన్నట్టు పిల్లనమ్మోయమ్మంటాడు గామాలు — చెకరవరితై తే మన కేం గొప్ప. నేనురాణిని — నాబిడ్డరాణీగారి బిడ్డ — ఏమంతిరీ —

మంత్రి — అంతే -

దాశ — రాణీ మామంచి పెసినేసిందిగాదు? ఏమంతిరీ —

మంత్రి — అంతే —

రాణి — ఆడితే చెకరవరితినే పెళ్లాడాల — లేకుంటే మామేనల్లుడు బాసెన్ననే పెల్లాడాల — ఏంమంతిరీ -

మంత్రి — అంతే - (అందఱు నిష్క్రమింతురు)

## దృశ్యము — 3

ప్రదేశము — హస్తినాపురము —

ప్రవేశము — అటునిటు దిరుగుచు కేశవుఁడు.

కేశ — గంగ తన్ను విసర్జించినప్పుడు నన్నుఁజూచి "కేశవా! ఇఁకస్త్రీపరి గ్రహణమున కొకవందనము. నాజీవితాంతము కళత్రస్పర్శ లేకుండఁగడచునుగాక" యని పలికిన, శంతను మహారాజేకదా యిప్పుడు సత్యవతీ వ్యామోహమున విరహాతుఁడై శయ్యఁ జేరినాఁడు — ఛీ ఈమానవునికి బుద్ధిలేదుగదా! నేఁడు హితమైనది రేపహితము — నేడహితమైనది రేపుహితము — అనుభవమైనవు డతివైరాగ్యము — మఱునాఁడు మఱపు — సగము వెంట్రుకలు తెల్లఁబడినవి — దంతములును, కాయమును గూడ స్వల్పముగఁ జలించుచున్నవి — పదునాలు గేండ్లు పడుచుకొఱకుఁ దత్తఱపడుచు నది లభింపకున్నఁజత్తు ననుచున్నాఁడు! — (ఇంచుకనవ్వి) తనవెట్టియేకాని కుమార భీష్ముఁడుండఁగా - సత్యవతిని తాను వివాహమాడి యామె కొమరుల నెట్లు గద్దెకెక్కించును?

భీష్మ — (ప॥) కేశవా! ఏమిసీలో నీవు గొణుగుకొను చుంటివి?

కేశ — ఏమియులేదు.

భీష్మ — కుమారా భీష్ముఁడని నాపేరెత్తితి వదియేమి?

కేశ — నీపేరలి తినా? — జ్ఞప్తిలేదే.

భీష్మ — కొంటెబాపఁడా. జ్ఞప్తిలేదని యబద్ధము లాడఁదలంచితివా! సత్యవతియనియు, వివాహమనియు ననుకొనుచుంటివి గాదా?

కేశ — ఆఁ! అనుకొనినట్లు జ్ఞాపకము.

భీష్మ — చెప్పెదవా లేదా?

కేశ — అబ్బా! వదలకున్నాఁడే పుత్రకా. విన్నకొలఁదియు నీకు విచారహేతువేకాని సంతోషము మాత్రముగాదు.

భీష్మ — ఏదైనసేమి? ఆర్యా! మోద ఖేదములను రెంటిని మానవుఁడు సమానముగ ననుభవింప వలయును. చూడుము.

గీ. భీకరముగా — ఘనాతపవేళలందు —
నీళలఁ బవనాప్తి చల్లని నిదురగాంచి —
వేఁడిగాడ్పులకయి పవల్ భీతిఁగొన్నఁ
దప్పునే యది ప్రకృతి తత్వంబుగాక. —

కేశ — అటులైన — నీతండ్రికొఱకై — నీపేరెత్తితిని.

భీష్మ — ఆర్యా! ఈయర్థమునే మరింత విపులముగ నెఱిఁగింపగలవా?

కేశ — ఆహా — నీతండ్రి యానందమునకు నీవాటంకముగ నుంటివి గావున, నింతగా ననుకొనవలసి వచ్చినది.

భీష్మ — హరిహరీ! — గురుమిత్రా! ఎంతదారుణమైనమాట చెవిని వేసితివి?

గీ. పిన్నఁట — నెఱుంగకేమిసల్పితినో కాని —
బుద్ధివచ్చిన పిదప నాపుణ్యమూర్తి —

కహితమగు కార్యమొకటైన ♦ నాచరింప,
నిపుడు కేశవా! యుపచార ♦ మెటుఘటించె॥ —

బుద్ధి పూర్వకముగఁగాక — ప్రమాదవశమున నిప్పుడు నేను, తండ్రిగారియెడల నేమైనద్రోహము గావించి యుఁదును. తద్దోషమును — అందులకు పరిహారమును సైతము నీవే దయామతివై నాకెఱింగింతువేని — ఆయపరాధము నుపసంహరించుకొనిన యనంతరమే — క్షమింపుమని పితృపాదుల పాదకమలములం బడెదను.

సీ. విలయ స్ఫులింగ ప్ర ♦ చలితోగ్ర దావాగ్ను
లం దిశరీరంబు ♦ నైనఁ గాల్తు
ఆర్ణవ కల్లోల ♦ ఘూర్ణమానానూన,
వీచీతతికి సమ ♦ ర్పింతుఁ దనువు -
శార్దూల పంచాస్య ♦ శరభ దంష్ట్రాంతర,
మున దేహమర్పింప ♦ ననుమతింతు —
సమదపిశాచర♦క్షస్సమూహములకు,
నీశరీరము గోసి♦ యిచ్చువాఁడ.

తండ్రిగారికి నాత్మ హి ♦ తంబుఁగూర్ప,
నమరవైభవమప్రాజ్య రా ♦ జ్యానుభూతిఁ
దృణముగంద్రోసి, నిష్ఠుర ♦ దీక్షఁబూని,
బ్రహ్మచర్యము—సన్యాస ♦ వ్రతము దాల్తు.

కేశ — యువరాజా!_శాంతినఁదుము

భీష్మ — విప్రోత్తమా! జనక హృదయభేదకంబగు మదపరాధం బేదియో_వచింపుము_దానిందీర్చిన పిమ్మట శాంతించెదను.

కేశ — కటకటా! నీదోషమేమియున్నది?

భీష్మ — ఉన్నదని మీరంటిరిగదా మహాత్మా!

కేశ — విధివశంబున — కాదు — నీతండ్రి స్త్రీలోలతావశంబునఁ గలిగిన విక్కృతియేగాని — నీయపరాధమేమియును లేదు.

భీష్మ — ఆర్యా! పూజ్యులగు తండ్రిగారిని మీరు దూషింపవలదు. నా కారణముననైననేమి? మఱి యేకారణముననైననేమి? నావలనఁ దీర్పఁబడఁదగిన తండ్రిగారికోరిక లేవియున్నం దీర్చి కృతార్థుఁడనగుదును. నన్నుఁగన్నందులకు నాతండ్రికింతకన్న నేనేమి చేయుదును?

కేశ — అయ్యయ్యో! కుమారా! నీకింతపట్టుదలకూడదు. నీచవంశ సంభవయగు నొకస్త్రీమూలమున వంశవర్ధనుఁడవగు నీవు పూజ్యసామ్రాజ్యాధికారమును వదలుకొనవలదు.

భీష్మ — (నవ్వి) కేశవా! ఛాందసము వదలవైతివిగదా! తండ్రిగారి యానందమునకై — ప్రాణములనే వదలెదనంటినే! తృణప్రాయమగు నీరాజ్యమేమిలెక్క?

కేశ — అటులైన నొక్కక్షణము నీవిందు నిలువఁబడుము — నీ తండ్రి దగ్గఱకుఁ బోయివచ్చెదను.

భీష్మ — ఎందులకు?

కేశ — నీకెందులకు? మరలివచ్చి చెప్పెదనుగాదా!

భీష్మ — సంగతియేమో తొలుత నాకెఱిఁగింపుము. తరువాత నీయిచ్ఛ వచ్చిన చోటికిఁబొమ్మ —

కేశ — మరలవచ్చి చెప్పెదను.

భీష్మ — కాదు కేశవా. చెప్పియే వెడలవలయు.

కేశ — నీతండ్రిని రెండుమాటలడిగి వచ్చెదను.

భీష్మ — ఏమియడిగెదవు?

కేశ — నీకుమారుఁడగు గాంగేయుఁడు దృఢతరప్రతిజ్ఞుఁడై యున్నవాఁ డనియు, నీకిదికూడదనియు మందలించి వచ్చెదను.

భీష్మ—ఓహెూ! ఇదియా. నీవు మాకుఁజేయు నుపకారము!

ఆ. జనకహితముసేయఁ ♦ జాలుసమర్థత—
నాకులేనియపుడు ♦ నామనమునఁ—
దండ్రియందు భక్తి ♦ దప్పినయపుడు నీ
వలననైన మేలు ♦ సలుపవచ్చు—

ఇప్పుడట్టి బ్రహ్మచారి మర్కటచేష్టలు చేయనక్కఱలేదు. ప్రాణము విసిగింపక చెప్పెదవాలేదా?

కేశ—(తనలో) ఇతనికిఁ గోపము వచ్చుచున్నది. చెప్పకతీరదు. (ప్ర॥) చిరంజీవీ! నామాటవలన నేమియగుఁనోయని భయపడు చుంటిని.

భీష్మ—ఏమియగుఁడినను సంతోషమే—

కేశ—అట్లయిన వినుము. దాశరాజు పుత్త్రికయగు సత్యవతిని నీజన కుఁడు ప్రేమించెను.—దాశరాజు సత్యవతీసంతానమే రాజ్యము నధిష్టింపవలయునని కోరెనందున నిర్చుఁదలంచి నీజనకుఁడు తనకోరికను మానసమునందణంచి వేసి, దుఃఖాక్రాంతచిత్తుఁడై యున్నవాఁడు.

భీష్మ—నేనుసయితమటులే యూహించితిని. కేశవా! నావెంటరమ్ము. నాకు దాశరాజనిలయముంజూపుము.

( అనుబంధము-౮. )

(ఆకాశమువంకఁజూచి)

శా—ఆశాబంధముఁద్రెంచి, సంతతసస ♦ ద్గాకాంక్షలంద్రుంచి, యు
ద్భ్యాసస్వార్థపరత్వ దుర్గుణ, దురం ♦ తాశాతతిం జంపి, సం
కాశోదంచిత నిశ్చలత్వమును, సం ♦ కల్పంబులంగూర్చి, యో
శ్రీశా! పైతృకకార్యనిర్వహణకీ ♦ ర్తిన్నాకుఁ గల్గింపవే॥—

(కేశవునితో నిష్క్ర॥)

## దృశ్యము—౨.

ప్రదేశము—దాశరాజు గృహము.

ప్రవేశము—దాశరాజు, మంత్రి.

దాశ—మంతిరీ—

మంత్రి—శిత్తం -

దాశ—ఆడుమల్లీ రాడే అంటావా?

మంత్రి—వొత్తాడో రాడో కాని, అమ్మాయిగారు బెంగెట్టుకుందంటగా?

దాశ—యిగో — మంతిరీ! ఈబెంగ నేమాటకు యేంటోయ్ అత్థం?

మంత్రి—అదోకమాదిరి రోగమనుకుంటుండాను—

దాశ—నీకుబుద్ధిలేదు మంతిరీ!

మంత్రి—శిత్తం—

దాశ—శిత్తం యేంటోయ్—? నేనన్నమాట నీబద్ధీకమే అంటావా?

మంత్రి—కామాల్సును? ఐతే - మారాజా! బెంగనేవొత్తువు అచ లేంటంటారు?

దాశ—ఇగో — యిన్నావూ? — ఆయాల చంతనమారాజెంటొచ్చిన కేచెవులు చెప్పినమాటలు నిజమనుకుంటుండా—

మంత్రి—ఏమ్మాటలూ?

దాశ—ఆదేవడో సాటుసాటుగా బాణాలేసుకుంటా తిరుగుతాడంటగా—ఆడిబాణాలేమైనా మనమ్మాయికి తగలలేదుగదా అని—

మంత్రి—మనమదుడా?

దాశ—ఆడే కామాల్చును. ఇగో — సూడు — ఆణ్ణిసంపే వుపాయం సూత్తే — అమ్మాయికి బెంగొదిలిపోవును.

మంత్రి—ఆడు కనపడని మనిషిగనక కనపడనిమణుసులే ఆణ్ణి సంపాల్చిందిగాని, మనకు శాతగాదు.

దాశ—అదీకాదు. అచలు మూడుకళ్లొచ్చిన వోడైనా ఆణ్ణి పూరి తిగా సంపలేడన్నమాటే—

(తరువాత ప్రవేశము—కేశవ, భీష్ములు)

కేశ—యువరాజా! దాశరా జాయిరువురిలో పెద్దపొట్టవాఁడు.

భీష్మ—(స్వగ) తండ్రిగారికి మోహము గలిగించిన సత్యవతి జనకుఁడగు నీతఁడెంతయనాగరికుఁడు! ఏమో — పెద్దలమానసము లిచ్ఛాధీనములుగదా! (ప్రకా) కేశవా! మనము వారికెదు రేఁగుదము రమ్ము.

(ఇద్దఱు పరిక్రమింతురు.)

మంత్రి—మా రాజా! ఎవరో వొత్తుం డట్టుండారు.

దాశ—ఇగో! మంతిరీ! సూడు — అందులో వొకఁడు కేచవుఁడు గాఁడంటావా?

మంత్రి—కేచవులే - కేచవులే!

దాశ—మనం మనమఁదేదలన్నీ సెప్పినాగానీ యీళ్లంతా దుడుంగు దుడుంగున సిమద్దవారం దాటిరావటం.........

మంత్రి—ఊరుకోండి — ఆళ్లు చెక్కరవతిరిగారి చమందం.

దాశ—ఐతే ఊరుకోవాలిచిందే అంటావా?

మంత్రి—చరేగాని ముందు మీరు లెగండి—

దాశ—(లేచును.)

మంత్రి—కేచవులూ — (పెదవి కఱచుకొని) కేచవులుగారూ! ఈరెవ్వరెనట్టు?

కేశ—ఈయనయే మాయువరాజగారగు గాంగేయుఁడు.

మంత్రి—మా రాజా? చిమాంచనానిమీద కూకోండి.

భీష్మ—కూర్చుండుట కేమి? మావిషయము నాకర్ణింపుఁడు.

మంత్రి—చిత్తం—

భీష్మ— కేశవుఁడా! తెలియఁజేయుము.

కేశ—కొలదిదినములక్రిందట_శంతనుమహారాజు మీరాజపుత్త్రికం గోరుటయు మీరు నిరాకరించి దుస్సాధ్యవరంబుల నర్థించుటయు జ్ఞప్తియందున్నదిగదా!

మంత్రి—ఆ.

కేశ—తండ్రిగారి కోరికం బరిపాలించుటకును, మీవరములఁ దీర్చుటకును మాయువరాజుగారి సంకల్పము. అందులకే వీరి యీరాక.

మంత్రి—మా రాజా!—

దాశ—ఏంమంతిరీ! ఏంటది?

మంత్రి—అమ్మాయిగారి పెళ్ళిచమందానికి మళ్లీ వొచ్చారుగనుక ఈ యవారం రాణీగారికాడ తీరుమానం గావాలిచిందే-

దాశ—ఐతే_రాణీని తీసుకొనిరావలిచిందే అంటావా!

మంత్రి—రావాలిచిందే-

దాశ—(కొంతదూరముపోయి మరలివచ్చి) ఐతే_ మంతిరీ!-

మంత్రి—ఏం మారాజా?

దాశ—మనం-మనమ్మాయికొడుకే రాజ్జెకారానికి, రావాల్చిందని పెసినేశాంగా

మంత్రి—ఔను.

దాశ—ఇప్పుడు మల్లీ- యీాల్లెందుకొచ్చినట్టూ?

మంత్రి—మనమాటపెకారంగా జరిగించటానికే అన్నారుగా—

దాశ—మరి యీానొకఁడు బతికేవుండాడుగా-

మంత్రి—ఆచంగతే రాణీగారొత్తే మాట్టాడుకో వొచ్చును.

దాశ—అంతే అంటావా?

మంత్రి—అంతే-

దాశ—(ప్రస్థానము.)

కేశ—ఆయుష్మంతుఁడా! బురదలోని, నత్తగుల్లలను బట్టుటకై పురోడాశముల నెగురవేయుచున్నాఁడవు.

భీష్మ—కేశవా! ఎంతమాటాడితివి!

గీ. కాలగతి మనదేహంబు ♦ గాలిపోవ
మఱలనొకదేహమిచ్చి, జ ♦ న్మంబునందఁ
గారణంబయి, మనపూర్వ ♦ కర్మమునను,
గలుగురోగాది బాధల ♦ గాసిఁదీర్చి
పిదపఁ దనయంతవానిగా ♦ వించి, మన మ
హోముదంబె బ్రహ్మానంద ♦ మై వెలుంగ,
కంటికగు ఱెప్పపోలికఁ ♦ గాచునట్టి
తండ్రిగారి ఋణము దీర్పఁ ♦ దరమె మనకు?
వారితనువున జనియించి ♦ వారికోర్కు-
లను విమరిరంచుకన్న ఖ ♦ లప్రవృత్తి
మఱియొకటిలేదు జనకుని ♦ మాట-వేద
వాక్యమటు నిర్వహింపఁగ ♦ వలయుమనకు॥

(ప్రవే. దాశరాజు — రాణి.)

దాశ—(అప) మంతిరీ!

మంత్రి—(అప) శిత్రం—

దాశ—(చెవిలో ఏమోచెప్పును)

మంత్రి—(కేశవునితో) ఐతే — ఈ యిసయంలో మీాకేమాలోశించినట్టూ?

భీష్మ—మీాయిష్టమెట్లో యట్లే సలుపువాఁడను.

(అనుబంధము, ౧౦)



భీష్మప్రతిజ్ఞ.

గీ. అవనిసత్యవతీ సహా ♦ ఖ్యనుజెలంగు
తావకాత్మజఁదెచ్చి నా ♦ తండ్రిగారి
కిత్తువేని మీయిష్టము ♦ నెట్టిదైనఁ
గాదనక తీర్తు సాక్షి! యా ♦ కర్మసాక్షి!

దాశ—మంతిరీ! (చెవిలో చెప్పును)

మంత్రి—మా సత్తెవ్వాతికి గలగబొయ్యే కొడుకే రాజైకారానికి రావాల్సిందని చెప్పాంగా! — అంతే!

భీష్మ—ఆహా! నేనిందులకు మనస్ఫూర్తిగా నంగీకరించుచున్నాఁడను.

రాణి—నీకొడుకు లోకైనా వొచ్చి తగూలాడితే గతేంటీ?

భీష్మ—అమ్మా! అట్లయిన నిదే యాకర్ణింపుఁడు.

గీ. కాశ్యపీ పరిపాలనా ♦ కాంక్షమాని
దివ్యపదవిని సాత్యవ ♦ తేయునకు నొ
సంగితిని సూర్యచంద్రులు ♦ సాక్షులుగను
బ్రదుకు నన్నాళ్లు దాల్చెద ♦ బ్రహ్మచర్య.

గీ. ఆత్మసౌఖ్యము నాశింప ♦ హరుఁడుసాక్షి!
పెండిలియె మానియుండు న ♦ జుఁడుసాక్షి!
సత్యవతివల్ల నాప్రియ ♦ జనకపాదు
లందుఁదనయుండె పాలించు ♦ నవనియెల్ల.

గీ. వితగఁబల్కు నీప్రతినఁ ద ♦ ప్పితినయేని
ఆత్మగురుపాదములు దప్పు ♦ నఘముగాంతు
ఘోరపాపాత్ముఁడు నరక ♦ కూపమందుఁ
బొందు శిక్షనుగాంతు వి ♦ నిందితముగ.

ఆ. జన్మమొసఁగినట్టి ♦ జనకుని వాంఛను
దీర్చుకన్న నొకు ♦ దివ్యఫలముఁ
గూర్చుకార్యమేది? ♦ ఘోరప్రతిజ్ఞను
దాల్చినాఁడ మాటఁ ♦ దప్పఁజాల.

(యవనికవ్రాలును)

దృశ్యము—౫

ప్రదేశము--శంతనుని మందిరద్వారము.

ప్రవేశము --- కేశవుఁడు.

కేశ—(తనలో) భగవద్విలాసము వర్ణింప నలవిగానిదిగదా! ఎక్కడి దాశరాజు! ఎక్కడిసత్యవతి! ఎక్కడిసంబంధము! కలనైనఁదలంచియుంటిమా? ఈమాయసంబంధమంతయు భీష్ముని భ్రష్టునిఁ జేయుటకేకాని మఱియెందులకక్కఱకువచ్చినట్లు? సత్యవతికి ముగ్వురు సంతానము గల్గిరనుమాటయేకాని దక్కినవాఁడొక్క విచిత్రవీర్యుఁడు!-ఆతనికైనను పుట్టిననాఁటనుండియును, రుగ్మతయేగదా! ఏమాటయైనను నోటితో ననుకొనుటతప్పు! మహారాజు పెత్తనమున శయ్యపైఁబడిదొరలుచు ఆరవంతప్రాణమును గుటుకుగుటుకుమనుచు - నేఁడో రేపోయనుచున్నాఁడు. ఆవిచిత్రవీర్యుఁడైనను శూరలక్షణములుగలవాఁడుగాఁడు; భీష్మునకు పెండ్లియైనయెడల శూరలక్షణములుగల కుమారుఁడుదయించియుండునుగదా! దిక్కుమాలినదాశరాజు - భరతవంశమునకు ఉప్పలివలె దాపురమైనాఁడు—

( ప్రవేశము – భీష్ముఁడు. )

భీష్మ—కేశవా? నాయనగారికి శరీరమున నేమియు క్షేమముగలేదా యేమి?

కేశ—ఎందులకై నీవిట్లు ప్రశ్నించుచుంటివి?

భీష్మ—నేఁడెందులకో నన్నతిరయమునఁ దమ సన్నిధికి రమ్మనివార్త నంపినారు.

కేశ—నేను! గతరాత్రి వారిని సందర్శించితిని. అప్పటికి శరీరము మిగుల నీరసస్థితియందున్నది.........అనరామగాని, నిన్ను పిలువనంపుటకేమి హేతువో—

భీష్మ—అనఁగా!—నాకర్థముకా లేదు.

కేశ—అప్పగింతల కొఱకగునా యని—

భీష్మ—(నవ్వి) వెఱ్ఱివాఁడా! అనఁగూడ కేమి? ఇదియేమంత యమంగళ విషయము?

గీ. కడుపు చల్లఁగ బిడ్డలఁ ♦ గన్నవాఁడు;
మించిన మహేంద్రభోగము ♦ ల్గాంచినాఁడు
పృథ్వీబహువత్సరములుజీ ♦ వించినాఁడు
ఈమహాత్మునికిఁకమీఁద ♦ నేదికొఱఁత!

విచారింపక తండ్రిగారిని దర్శింతమురమ్మ. (ఇద్దఱుప్రస్థానము)

---

దృశ్యము. ౬

ప్రదేశము—శంతనుని శయ్యామందిరము.

ప్రవేశము- శయ్యపై దొరలుచు శంతనుఁడు పాదములకడఁ గూర్చుండి దుఃఖించుచు సత్యవతి.

(అనుబంధము-౧౧)

సత్య—నాకేమిగతి చెప్పిపోయెదరు! కన్నకొడుకులందా నిలిచినవాఁ డొక్కఁడు! వాఁడును తల్లిని సంరక్షింప నశక్తుఁడు భీష్ముఁడా సవతికొడుకు! ఈమందిరమిఁక నాకు స్మశానప్రాయమేగదా!

శంత—ఇటురా! కన్నీరు తుడుచుకొమ్ము. స్త్రీవ్యామోహమున నేను ముసలితనమున నిన్నుఁ బెండ్లియాడి సిగొంతుకోసితిని. ఇఁక భీష్ముని పేరెత్తితివి. ఇటుచూడు. భీష్ముఁడు సామాన్యవ్యక్తి గాఁడుసుమా? అమరులకు సయితమాచరింప నసాధ్యమైన దివ్యవ్రతముఁ బూనియున్నాఁడు. నాకొఱకు, నాసౌఖ్యము కొఱకు, దాను సకలపురుషవాంఛనీయమగు కల్యాణమును గూడఁ బరిత్యజించినాఁడు. ఇట్టియస్ఖలితుఁడగు నిత్యబ్రహ్మ

చారిని నీవెన్నఁడైనఁ జూడఁగలవా? ఆతని ఋణమును నేనీతనువునఁ దీర్చుకొనఁగలనా? నిన్నాతఁడు చిన్నచూపునఁ జూచునని యేల యధైర్యపడెదవు? భీష్ముఁడు పితృవాక్యము నెట్లుపాలించెనో మాతవైన నీశాసనమును గూడఁదప్పక పాలిం పఁగలఁడు. వెఱ్ఱిదానా! ఊరడిల్లుము. నేనింక జీవించియున్న మాత్రము నావలన నీవేమి సుఖముల నొందఁగలవు.

సత్య—అయ్యయ్యో! అట్లాడెదరేమి? మీవలన ననుభవింపవలసిన సుఖముల నెల్ల ననుభవించితిని గాక! మఱియిప్పుడు నామాం గల్యమును నాపసుపుఁగుంకుమయునిల్చుటకొఱకైన మీసేమ ముఁగోరఁ దగనా?

శంత—ఎన్నాళ్ళని వృద్ధుఁడనైన నాక్షేమము నరసి కాపాడఁగలవు ముదిమితనమున వివాహమాడితిని గావున నీకెట్లును విధవా త్వము తప్పదు. ఇంకేమనుకొన్నను లాభములేదు. విచారింప కుము.

సత్య—(ప్రక్కకుఁజూచి) భీష్మకేశవు లిట్లు వచ్చుచున్నారు.

(లేచి నిలువఁబడును)

శంత— ఏఁడీ! నాతండ్రి వచ్చుచున్నాఁడా?

(కేశవునితో భీష్ముఁడు ప్రవేశించును.)

భీష్మ—తండ్రిగారికి నమస్కారము – అమ్మగారికి వందనము.

శంత—నాయనా! నాతండ్రీ! ఇటురమ్ము. నాకింక నెంతోకాల మాయు ష్యములేదు. అపారమైన, నీ స్వార్థత్యాగమునకు నేనేమిప్రతి లాభము చేయఁగలను?

భీష్మ—నేను మీవలనఁ బ్రతిలాభము నపేక్షించి యే పనియుఁ జేయ లేదు. మీరీసమయమునందట్టి విచారములను, మనస్సునందుం చుకొని, కష్టపడఁగూడదు

శంత—నిజమే! నీవు ప్రతిలాభవాంఛావిదూరుఁడవే! ఐనను— తండ్రీ!- నామనస్సున నొకకోరికయున్నది; వచింతునా? -

భీష్మ—సావధానుఁడనైయున్నాఁడను.

శంత—నాయనంతరమునఁ దనకేదియో తీరనిలోటు గలుగనున్నదని మీయమ్మ విచారపడుచున్నది. నీ ప్రాణములున్నంతవఱకా మెకేలోటును గలుగనీయవని నానమ్మకము. నీవు కోరినప్పుడు మరణముగల్గునట్లు వరమిచ్చుచున్నాఁడను. నాకొఱకై నీవు బ్రహ్మచారివైనందులకు నేను నీకింతకన్న నేమియుఁ జేయలేను.

భీష్మ—మహాభాగ్యము. ఈవరదానమును, నేను హృదయపూర్వకముగ స్వీకరించి, తలఁదాల్చుచున్నాఁడను.

(పాట 8.)

గీ. కౌరవులకును బాంధవవర్గంబులకును!
భీకరాహవమిక సంభవించుఁ నంచు।
వ్యాసముని నాకుఁదెల్పె నప్పటికి, నీవ
రంబు నా కుపకృతిసల్పెఁ బ్రాకటముగ

(తెర వ్రాలును)

ద్వి తీ యా ం క ము

శ్రీ

# భీష్మబ్రహ్మచారి.

(సంపూర్ణ భీష్మచరిత్రము.)

---

## తృతీయాంకము

---

దృశ్యము—౧.

ప్రదేశము—(స్వయంవరమంటపము)

ప్రవేశము—స్వయంవరరాజలోకము – దాశరాజు ఆతనిమంత్రి.

దాశ—మంతిరీ!

(అనుబంధము ౧౨)

మంత్రి—శిత్థం—

దాశ—ఈళ్లంతా, సోయింవోరానికొచ్చి, కూకుండారుగదా యీళ్లుద్దేశమేంటో తెలుసుకుండావా?

మంత్రి—ఈ కాశీరాజు కూతుళ్లని పెళ్లాడటానికే, అనుకుంటూండాను.

దాశ—మనం, మాత్తరం పెళ్లాడలేమా?

మంత్రి—ఆమాటన్నోడెవ్వడూ?

దాశ—మరి, మనకి సాటుసూపించి, యెదురుగ్గా వొచ్చి వొక్క నాయాలయినా – కూకుండబెట్టాడేమో – సూశావా?

మంత్రి—లేదు; వొక్కడైనా – యెదురుగ్గా రాలేదు;

దాశ—ఐతే – ఇది మనకొమానమే అంటావా? కాదా?

మంత్రి—తప్పకుండా – అవమానమే మారాజా!

దాశ—దీనికి మనమిప్పుడేంజెయ్యాల్సిందంటావు?

మంత్రి—మీరుగూడా వొకాసనంమీద మాట్లాడకుండా కూకోండి

దాశ—అంతే నంటావా?

మంత్రి—అంతే –

దాశ—(ఒక యాసనమునం గూర్చుండును)

(ప్రవేశము—కాశీరాజును, సుధానిధి యను మంత్రియు.)

కాశీ—మంత్రీ! సుధానిధీ! యీస్వయంవర రాజలోకమును గనుటచే ధన్యుండనైతిని.

చ. కనులు తరించె భూమిపతికాండమునుం బొడగాంచ, నిందు– నా
జననము సత్ఫలంబుగనె; సాగసలోచనలైన నా సుతల్,
మనమున మెచ్చి, యొక్కసుకు మారునిమారసమానరూపుఁగో
రినవరపాణిఁదాల్చిననుఁ బ్రీతివహించెదు మన్మనంబిఁకన్.

భర్తృదారికలు వచ్చుట కింకను జాలమేల?

సుధా—సుముహూర్తము సయితము సమీపించినది; (తెరవంకఁ జూచి) మాధవీ! రాజపుత్రికల వస్త్రాలంకారపరికరములతోఁ బ్రవేశపెట్టుము–

(తెరలో)– భాగ్యము.

దాశ—మీసత్కారానికి, అర్థంయేంటి? ఒక్కనాయాలయినా వొచ్చి, మాకు మరేదచేసిన పాపాన్ని పోయాడా?

కాశీ—సుధానిధీ! ఈవికృతాకారుఁడెవ్వఁడు?

సుధా—నీవెవ్వఁడవు?

దాశ—మంతిరీ! "నువ్వావడవ్వా?" అన్నమాటకు అర్థంయేంటి'—

మంత్రి మారాజా! యిదికూడా తప్పకుండా—అవమానాల్లో చేరినట్టే!

దాశ—అంతే అంటావా?

మంత్రి—అంతే—

సుధా—మీ యనాగరిక ప్రస్తావన కిది యర్హప్రదేశముకాదు; కావున తొలఁగిపొండు—

దాశ—మేం-వొవళ్లమనుకొంటుండావు? కేచెవులంతటావొచ్చి-మాకు నజర్లుదెచ్చుండాఁడు. నేను గొప్ప చక్కరవరితికి మావఁని. ఏంమంతిరీ?

మంత్రి—అంతే-

సుధా—అతిక్రాంతమర్యాదులై ప్రవర్తించితిరా-సభనుండి, యీవలకు గెంటింపఁబడుదురు.

దాశ—ఏందోయి, యిది—మంతిరీ!

మంత్రి—సెక్కరవొరితిగారి మావఁని, యీళ్లంతా యింకొకపాలి, ఔమానించినట్లే—

దాశ—అంతే అంటావా?

మంత్రి—అంతే-

దాశ—మరిప్పుడు మనం సెయ్యాల్సినపనేందోయి?

మంత్రి—ఈయాల బాగుండదిగాదు; మారాజా! లెగండి పోదాం—

దాశ—నేనెందుకు లెగటం? నేనులెగను; నేను రాజబందుగుణ్ణి—సెక్కరవరితిమావఁని—

మంత్రి—ఐతే—మీసిత్తం—

కాశీ-సుధానిధీ! ఎంతసే పీయనాగరికులతో ప్రసంగించుట? తొలుత వీరికి మందిరప్రవేశ మెట్లుగలిగినది? భటులచే నావలకు గెంటిం పుము-

సుధా—భటులారా! శీఘ్రముగ నీజానపదుల నావలకు గెంటి వేయుఁడు.

భటు—చిత్తము – (దాశరాజును జూచి) ఓపల్లెకులపువాఁడా; బయటికి మీాయంతట నడచెదరా? మమ్ము వెడలఁగొట్టమందురా?

దాశ— మంతిరీ! ఏందీగందరగోళం.

మంత్రి—ఆళ్లు కత్తులూ, కటార్లు, సూపుతుండారు. ఇఁక లెగండి— మనకు సమయం యీాలుగా లేదంటినిగా—

దాశ—ఎల్లి పోవాల్సిందే అంటావా ?

మంత్రి—యింకా ఆశ నెందుకనీ!

దాశ—ఎట్టాగోయ్యిదీ! నేను సెకరవాత్తిరి మావఁనోయ్.

మంత్రి — సెకరొత్తిరి మాౝైఁతే_సంగతి తరోత ఫీసుమఃడితో సెవుకో వచ్చును. ముందు లెగండి.

భటు—మీాయాలోచన లెంతసేపు ? కదలెదరా? లేదా ?

(కత్తులు చూపుదురు)

మంత్రి—(భయముతో) బాబో! కత్తులు-కత్తులు-పాఱిపోదాంరాండి.

( ఇద్దరు పాఱిపోవుదురు – అందఱు నవ్వుదురు. )

సుధా—రాజేంద్రా! పీడవదలినది. ఇఁక స్వయంవరారంభము సేయ వచ్చును.

కాశీ—కానిమ్ము.

సుధా—మాధవీ! ఆలస్యమేల?

(ప్రవేశము—మాధవియు పుష్పహారములఁ జేతులఁబట్టికొని అంబయు నంబికయు నంబాలికయు.)

మాధ—భర్తృదారికలారా! ఈ స్వయంవరసభనున్న రాజనందనుల

సందఱ నేను వేర్వేఱ వర్ణించెదను. మీమీ యిష్టమువచ్చిన వారి గళముల సుమమాల్యముల వేయుఁడు.

( అనుబంధము ౧౩ )

( మత్తకోకిల వృత్తము )

ఇతఁడు మాళవభూమిపాలుఁడ ♦ హీనసత్త్వుఁడు,గాంచుమీ
సతతమంజుల భాషణుండుప్ర ♦ శాంతరూపుఁడు కోమలీ!
క్షితితలంబున నమితయశుఁడీ ♦ చేదిరాట్సుతుఁ జూడుమీ
ప్రతిహత క్షితినాథవైరియ ♦ పారసత్త్వుఁడు మానినీ!
సుందరీ! నేపాళనాథుని ♦ శుద్ధవర్తనుఁ గంటివే
వందితాఖిలయాచకుఁడు సౌ ♦ భాగ్యశీలుఁడు భామినీ!
వంగదేశనృపాలుఁడీతఁడు ♦ భవ్యతేజుఁడు చూచితే!
సంగదూర్జిత సుగుణచయుఁడై ♦ శ్వర్యవంతుఁడు కామినీ!
కాంతరో! వరధనదతుల్యునిఁ ♦ గామిని జనమాన్యుఁగా
శాంతవర్తనుఁగాంచితే పాం ♦ చాలనాథుని శ్రీధవున్
కమలనయన! పరాక్రమాఢ్యునిఁ ♦ గాంచుమాంధ్రధరాధిపున్
సుమహిత ప్రతిభావిశారదు ♦ సుందరాంగు ననంగునిన్
ఓసతీ! విదిశాపురీశ్వరు ♦ నుదధి భీషణుఁ గంటివే?
భాసమానదయావిలాసుఁడు ♦ పాపదూరుఁడు భామినీ
శ్రీలతాంగి! యీవిభుఁడు కా ♦ శ్మీరనాథుఁడు గాంచుమా!
పాలితాఖిలదివ్యబాహుఁడు ♦ భండనస్థలరుద్రుఁడే!
ఘూర్జరేశ్వరు, సుందరాంగుని ♦ క్రూరభంజనుఁ గాంచుమీ
నిర్జితారిధరాధినాథుఁడు ♦ నిర్మలుండితఁడంగనా!

( తెరలో కలకలానంతరమున, )

ఉ। ఓరిదురాత్ములార! వినుఁ ♦ డోరిపరాక్రమహీనులార. యే
తీరునఁ గాశికాపురప ♦ తీవతికూఁతులఁ బెండ్లియాడ, మీ
రారసి, తత్సభాతలము ♦ నందుమ జేరితి? రింకపిరులై
పోరఁగ రండు-గెల్చికొని ♦ పొండు; తదీయకుమారికాతతిన్॥

కాశి—ఏమి యీమహాభీలభీషణంబగు కంఠరవము! ఎవ్వఁడో దురాత్ముఁడు శుభకార్యవిఘ్నం బాపాదింపఁదలంచి వచ్చినట్లు తోఁచుచున్నది. వలయునెడల ఖడ్గాఖడ్గిం బోరిగెలువ, రాజలోకంబెల్ల సంసిద్ధమైయున్నదిగదా!—

అందఱు—రానిండు; ఆ దురాసంధుఁ డెవ్వఁడైననసరియే - కృతాంతావాసంబునఁ బ్రాఁతకాఁపుగాఁ జేసెదము.

(దాశరాజు, దర్పముతో ప్ర॥)

దాశ—రాండి, నాయాళ్లారా! నేను సెకరవత్తిరిమావఁద్రా-వొద్దురావొద్దురా అంటే యిన్నోఁడేఁడి! సావండి-నాకొండెల్లారా! భీసుముడి సేతుల్లోబడి సావండి; బతక దలిసి నోళ్లయితే పారిపోండి —

సుధా—రాజేంద్రా! అనాగరికుఁడై చక్రవర్తిమామనని చెప్పుకొనుచుండిన యీతఁడే యీకల్లోలమునకు హేతువు; ఇప్పుడీతఁడు శంతనుపుత్రుఁడును బ్రహ్మచారియునగు భీష్ము నిందుఁ గొనివచ్చినాఁడు. ముందుగా వీనిని చంపవలయును.

దాశ—మీరంతా సచ్చే రోజులు రానే వచ్చెగా! నాకొండెల్లారా సచ్చినట్టుండక పోరుసాలాడత మెందుకనీ—

సుధా—(కోపముతో కత్తి లాగి,) ఓరీ! దుర్మతీ! నీచవంశసంభూత! ఈకల్లోలమున కంతకును మూలకారణము నీవే! కావున, నిన్ను చంపకమానను; రమ్ము—

దాశ (కేకలు వేయుచు) ఓబీసమయ్యోఁవ్! బీసమయ్యోఁవ్! నన్నీడు సంపోత్తుండాడు—రావయ్యోవ్ !

(తరువాత ఖడ్గహస్తుఁడై భీష్ముఁడు ప్రవేశించును.)

భీష్మ—(సుధానిధి కత్తిని లాగివేసి,) తుచ్ఛుఁడా ! ఆమహాత్ము నెవ్వనిగాఁదలంచి, విజృంభింప సాహసించితివి? నీశిరం బిదె యూడి ధరఁబడును. కాచుకొమ్ము. (సభ్యులనుఁజూచి) ఓసభ్యులారా! నాప్రతిజ్ఞ నిదె యాలకింపుఁడు.

గీ. రాక్షసంబునఁ గాశికా • రాజసుతల,
ముగ్వురినిఁ గొని, నాదు త • మ్మునకు పెరిఁ
శెండ్లి యొనరింతు; మీరలు ♦ వీరులైనఁ
గయ్యమొనరించి పిరిని ♦ గాచుకొనుఁడు—

(కత్తి త్రిప్పును; రాజులందఱు తిరుగఁబడుదురు.)

(భీష్ము డందఱను గెలిచి రాజపుత్త్రికలతో నిష్క్రమించును)

(తెర వ్రాలును)

## దృశ్యము—౨

ప్రదేశము—ఒక బయలు ప్రదేశము.

ప్రవేశము—(ఆయాసపడుచు, దాశరాజు.)

దాశ —(ఆయాసముతో) అమ్మయ్యమ్మయ్య ! అబ్బయ్యబ్బయ్య!! ఏందీ ప్రాణసంకటం ? ఇంత సులుగుత దని రాణే సెప్పనే సెప్పింది; బొంకులాడి పెల్లొచ్చి, సడాల్సిన పాట్లన్నీ పడ్డా-మంతిరి ముండాకొడుకిగంతరగోళంతో, సూయ పోయిండే! ఎట్టా? ఇగెట్టా ? — ఇగెట్టాగూ అంటూ ? నా రాజ్జెకార మంతా మంతిరి తోటే వుంటె గదా—యిగెట్టా? (స్మృతిసభినయించి,) ఉండస్సి' నీ రాజ్జెకారం నీట గలవా ? రాణే ? రాణే నెట్టా తప్పించుకుండేదీ ? కొత్తరాణే వొస్తే పాతరాణేని వొగ్గేతా మనుకుంటిగాని, కొత్తరాణి గోదాల్లో గలిసె ! పాత రాణే శేత వాతలూ తప్పవాయె—

(పాట. ౯ )

(రాణి కోపముతో ప్రవేశము.)

రాణి— వొస్తుండావా? రా ! రా ! నాయనాలా ; రా! ఇయ్యాల నీకు తప్పవులే పూజలు; రా,

దాశ—(భీతిల్లి) నాపెట్ట రానేవచ్చిందే! ఇంకేందిదారి? మంతిరుంటే ఆలోసె నయినా సెప్పును గందా!—ఆడూలేఁడు. కనక నేనిప్పు డాడదాని సేతుల్లో పడ్డానన్న మాటే! సావో బతుకో-యెదటఁ బడితేనే మంచిది.

రాణి—పెళ్లాడ దావఁనే పోతివా! నీసిగ్గుసితక!

(అనుబాధము ౧౪)

నీకొచ్చి నన్నేళ్లు వొవరికొచ్చినై రా! తలంతా నెరిసె. ముస లోడి వైతివి; నీకెందుకురా పెళ్లి; ఏదీ నీకొత్త పెళ్లికూఁతురు? దాన్నీ, నిన్నూ కలిపి మంచాని కిరిసికట్టి కొట్టేను— జాగ్గరత!— ఏమనుకుంటుండావో? మణుసులో—

దాశ—ఇగో! యింటుండావా? అన్నేల మ్మాటలు నామీఁ దెయ్యమోకు. నారాణుండంగ మల్లీనాకు పెళ్లికూఁతు రెందుకనీ?—

రాణి—"ఎందుకనీ" నేనే అడుగుతుండా?

దాశ—నేను పెళ్లాడతాని కెల్లినట్టు నీకు సెప్పిం దోరూ అంటా?

రాణి—అచలు, నువ్వాడి కెల్లత మెందుకని అంటా —

దాశ—బీసుముఁడు రమ్మన్నప్పా డెల్లొద్దంటూవా యేందే!

రాణి—అబ్బ! మాదొడ్డరాజువు దొరికావని, బీసుముఁడు రమ్మనతం నువెల్లడం-ఎంతసాగుచో సాగుచు. ఉండుండు; నీకిట్టాగాదు. నాయాలా! పొరకపూజ సెయ్యాల్సిందే! (ప్రస్థానము.)

(తరువాత మంత్రి భయముతో ప్రవేశము)

మంత్రి—మారాజా! నిస్సారనంగా సచ్చిపోమును గందా! వొల్లంతా పంపరం బుట్టింది.

దాశ—రాణొచ్చె యాల్లైంది. ఇఁగ నోరు మూసుకో! పొరక దెబ్బాన నెల్లింది.

మంత్రి—మారాజా! ఏందయితేనేంగాని, పిల్లని దేవరోరికియ్యానందు కని, బీసుముఁడు......

దాశ—ఉశ్శ్! 'రాణొచ్చే యాళైందని సెపితినిగా! నీకు బుద్ధిలేదు మంతిరీ! –

[ రాణి-చీపురకట్టతో ప్రవేశము. ]

రాణి-(మంత్రి చెవిపట్టకొని కొట్టుచు) నేనింటుండాలే! నీఆబద్ధీకాలన్నీ యింటుండాలే! మంతిరీ! సెండాలుఁడా! మీ రాజు పెల్లికెల్లతం పెల్లాడ తాని కేనా?

దాశ—[చెప్పవలదని సైగచేయును.]

రాణి—(రాజు చెవికూడపట్టుకొని) నీసిగ్గుసితక! సెప్పొద్దంటుండావా? ఉండండి; మీయిద్దరికి పొరక పూజ సేత్తా రండి—

(పాట – 10)

(ఇద్దఱిని కొట్టుచు నీడ్చుకొని ప్రస్థానము)

(తెరవ్రాలును.)

దృశ్యము—3.

(ప్రదేశము-హస్తినాపురోద్యానము)

(ప్రవేశము—అంబ ఒంటరిగ.)

అంబ—(స్వగ.) ఈపుష్పసుగంధఘ్రాణముచేత నాకు పూర్వ విషయములు స్మృతికి వచ్చుచున్నవి'.........ఆహా! విధిఘటనము! ఒకక్షణములోన, నామనోహరుఁడగు సాళ్వుని వరింపనున్న, నాకీమరవస్థంగూర్చిన, యీభీష్ముని సాహసమేమని చెప్పవచ్చును?...... ఔరా! ఏమిది? – రాక్షస వివాహము క్షత్త్రియకులోక్తమైనదను హేతువొక్కటియే యీబలాత్కృతికి, మూలకారణమా? కన్య యభిమతం

బరయ నక్కఱలేదా? భీష్ముని పెద్దగాఁబోగడుదురే? ఆతఁడింత చింతింపఁజాలకపోయెనా? .........కానిమ్ము, అరసెదఁగాక! ఎవరక్కడ!

( ప్రవేశము—దాసి. )

దాసి—ఏమి సెలవు?

అంబ—మీ రాజెక్కడ?

దాసి—మా రాజనఁగా?

అంబ—భీష్ముఁడు—

దాసి—భీష్ముఁడు మా రాజు కాఁడు; రాజునీమగఁడే—

అంబ—ఛీ! అదేమి? అట్లు మాటాడెదవు?

దాసి—ఔనమ్మా ! — విచిత్రవీర్యునకు నిన్నిచ్చి......

అంబ—పలువా! నాయెదుట నధికప్రసంగములు చేయకుము. మా రాడక — మీభీష్మునితో నేను తన దర్శనము నభిలషించితినని చెప్పుము.

దాసి—నిన్ను పెండ్లి కూఁతుంజేయుటకు నీచెల్లెండ్రతో పాటు—

అంబ—ఆమాట లిఁక వలదు, పొమ్ము—

దాసి—(తనలో) ఇట్టి బింకము లనేకములు మగఁడురాఁగనే దారి లోనికి వచ్చినవి. (ప్రస్థానము.)

అంబ—నన్ను విచిత్రవీర్యుని కిచ్చి పెండ్లి చేయుటకు సంకల్పించిన వీరి చందము తెలిసెను; బలవంతముగ, భీష్ము డెట్లు నాకీ వివాహమును సల్పఁగలఁడో — తెలిసికొందును; ఇప్పట్టున నేను ధైర్యమునే వహింపవలయును — అదుగో! భీష్ముఁడు......

(ప్రవేశము—భీష్ముఁడు.)

భీష్మ—అమ్మా ! — తమ సెలవేమి?

అంబ—మహాత్మా! నన్నుమీరు బలాత్కారముగ, స్వయంవరము నుండి, నాసహ జన్మలతోఁ గొని వచ్చితిరి. ఇందులకు హేతువు నే నడుగ వచ్చునా?

భీష్మ—అమ్మా! వేఱుగా హేతు వేమున్నది?

గీ. బ్రాహ్మ్యముఖవివాహంబుల ♦ రాక్షసంబు
క్షత్రియోచిత మాట నా ♦ సభను మిమ్ము
దేవిరో. బలాత్కృతిఁ గొని ♦ తెచ్చినాఁడ;
సతులఁగావింప నా యను ♦ జన్మునకును

అంబ—అందులకు బాలికాంగీకృతి వలదా! రాక్షసవివాహధర్మమున రాక్షసధర్మమే, యవలంబనీయమని తలంచితిరా? ఇది యార్య లక్షణమేనా? బలవదంగీకృతకార్యఘటనములయం దాకన్యక, ఆత్మవధంబు సల్పిన, నా పాపం బెవ్వరి దని తలంచితిరి?

భీష్మ—అమ్మా! ప్రమాదవశంబునఁ దమ యనంగీకారము నెఱుంగక, తెచ్చినమాటనిజమే! అందులకు మీ కే ప్రతిబంధకమును లేదు; నావలన మీ కేయుపాయంబును గలుగనీయను; తమ యిచ్చ వచ్చినయెడకు క్షేమముగఁ జేర్చువాఁడను; ఈ ప్రమాదమును క్షమింపుఁడు.

అంబ—సాళ్వమహీపాలుని తత్స్వయంవరంబున, నేను వరింపనుంటిని? అందుల కవరోధముఁ గల్పించి మీ రిట్లు నా యాశాలతికను ఛేదించితిరి. నన్నిపుడు సాళ్వసన్నిధికిఁ జేర్పుఁడు.

భీష్మ—అనుజ్ఞ......మాతృసమానలగు మీ సిగపూవువాడకుండ, నేఁడే ప్రయాణసన్నాహము చేయించెదను.

( పాట 11. )

(తెరవాలును).

* (దృశ్యము—౪.)

(మధుపాన మొనర్చుచు సాళ్వుఁడు, ముగ్గురు మిత్రులు ప్రవేశించుచున్నారు.)

సాళ్వు — ఓ మధురసమా! ఆమధురాధరాధరసుధారసమవై, నా హృదయ తాపము నడఁగింపుము. (త్రాగుచున్నాఁడు)

1. మి — అడియేఁ దాసుణ్ణి. (త్రాగుచున్నాఁడు)

2. మి - అడియేఁ దాసానుదాసుణ్ణి (త్రాగుచున్నాఁడు)

3. మి — అడియేఁ దాసదాసానుదాసుణ్ణి. (త్రాగుచున్నాఁడు)

సాళ్వు—ఆహా! ఆహా! యీ దివ్యామృతరసమున నా ముద్దులగుమ్మయగు నంబ ప్రతిఫలించుచున్నది ఓయమృతస్వరూపిణీ! ఓకాశీరాజనందినీ! ముసి ముసి నగవులతో నాకౌఁగిటం జేరుకొని యీ ద్రాక్షారసమును నీయధరామృతరసస్పర్శనమున మఱింత మధురము గావించి నీమృదులపాణిపల్లవముతో నీపానపాత్రము నా పెదవుల కందించి నన్ను - బ్రహ్మానందతరంగిణీతరంగముల నోలలాడింప వచ్చితివా? ఎంత సుదినము! ఎంతటిభాగ్యము!

1. ఏహ్వా! ఏహ్వా! నా దేహస్థితి యిప్పుడేలాగున్నదంటే_సముద్రం కెరటాల మీఁది డింగీ లావున్నది.

2. ఓ! ఓ! ముల్లోకాలు తల్లక్రిందులుగా గోత్రా పద్ధానికి సిద్ధంగా వున్నాయి

3. ఛీ! ఛీ! త్రాగుబోతు నాయాళ్లారా! సాళ్వరాజుకు సంతోషం కలిగించే మాటలు మాటాడాలె కాని తైతక్కలతో తప్పుడు కూంతలతో ప్రొద్దుపుచ్చుకుంటున్నారా? ఎగిరితంతే యేడు లోకాలు దాటి యెన్నిదో లోకాన బడాలె_కబడ్దార్!

సాళ్వు—సాళ్వరాజునకు సంతోషమా! ఈ జన్మమున కింక సంతోషమెక్కడిది? నాసంతోషము నా మోహంపు మొలకయగు నంబతో, భీష్మచండాలునిచే నపహృతంబైనది - హా దుర్భరము!

---

* ఈరంగము శ్రీ మైలవరము బాలభారతీసమాజమువారి వెంకట చెన్నకేశవులుగారిది.

కురువంశపాంసనకృతపరాభవము దుర్భరము! కాశీశ్వర తనయా విరహవేదన దుర్భరము! అమ్మో! స్నేహితులారా!

గీ. మైకముననైన మదిరాక్షి ♦ మఱతునంచు
మధువుఁ ద్రావ మనోవ్యధ ♦ మఱియు హెచ్చె
నీరు దప్పిని దీర్చుకో ♦ నేయిఁ ద్రావ
దాహబాధ యధికమైన ♦ దారిగాఁగ.

3. మి.(స్వ) ఆమాట నిజం -నాకు సారా కొంచెమెక్కువైతే చచ్చినోళ్లంతా జ్ఞాపకంవచ్చి పెగిలిపెగిలి యేడుపొస్తాది—ఇఁక బ్రదికున్నోళ్లు జ్ఞప్తిరావటానికేం? (ప్ర) మహారాజా! ఇంకో గిన్నెడు మధువు సేవించండి అంబ మరపొస్తుంది—దానిఁగన్నమ్మ మరపొస్తుందీ. ఊఁ! సందేహించకండి—

సాళ్వ— మీరును ద్రావుఁడు.

(అందఱు త్రాగుచున్నారు)

2. మి — ఓ ఓ' ఏఁవిమజా! ఏఁవిమజా! దేవతోత్తుకొడుకులకు దీని రుచి తెలియక పోమట్టి కాని తెలిస్తే వెధవ అమృతభాండం సీతమ్మ కొడుకు సుగ్రీవుఁ డెత్తుకపోతే దానికోసం యేడుస్తారా యేఁటి?

1- మి- ఏహే! అమృతభాండం ఎత్తుకెల్లినోఁడు సీతమ్మ కొడుకు సుగ్రీవుఁడు కాఁహోయ్—యినతకొడుకు యిబీసనుఁడు—

3_మి° వొంగము–గరుత్మంతుఁడురా?

సాళ్వ—అవును – గరుత్మంతుఁడు సుధాకలశము నపహరించినట్లే గాంగేయుఁడు నా ప్రియురాలి నపహరించినాఁడు! వాఁడు దానిని పెండ్లియాడెనేమో' ఆఁ! ఆత్మహత్యయైనఁ జేసుకొనునుగాని యంబ యెందుల కంగీకరించునో! ఏమో? చంచలకన్నఁ జంచలయగు మించుఁబోఁడిని విశ్వసించుటయెట్లు? ఆహా! నిశ్చయముగఁ బరిణయమే జరిగియున్నయెడల నీచల్లని రేయి వారిరువురు శయ్యాగృహముఁ బ్రవేశించి యుందురు. ఆ! ఆ! అదుగో!

[illegible] (...) [illegible] పరుక
టెంటిలో హంసతూలికా [illegible] కా శా
దృష్టుల నవలోకించుచున్నాఁడు. ఆహా! ఆహా! ఇదిగో!
ఇదిగో! గాశీ రాజహంశీ వారాశి బడబాగ్నిజ్వాల — కృతఘ్నతా
[illegible];
[illegible] హారుఁడగు
భీష్ముని సన్నిధానమున కరుగు మన్మథ [illegible] దరస్మితసుం
దర వదనారవిందుఁడే దీనిఁజేరఁ బిలుచున్నాఁడు — ఇది లేని
లజ్జం దెచ్చిపెట్టుకొని యెమ్మెయు [illegible] చివలె
నటించుచుఁ దలవంచికొని నిలుచున్నది! హా! వాఁడు చేతులు
చాఁచుచున్నాఁడు — ఇది వాని కౌఁగిటఁ జేరుకొనుచున్నది? హా!
ఏమి మధుర మందహాసములు? ఏమి మనోహర చేష్టావిలాస
ములు? ఏమి లలితలజ్జానటనములు, హా! హా! బింబోష్ఠచుంబన
ములు [illegible] బంధస్పర్శనములు నఖక్షత దంతక్షత వ్యాపారములు?
హా హా! ఓ నూతన దంపతులారా! సంతతస్వర్గ సౌఖ్యసాధారో
[illegible]!
కాశీ [illegible] చండాలా! భీష్మా! అంబా! అంబా!
[illegible] (క్రిందఁబడిపోవుచున్నాఁడు.)

1. ఓరీ! మహారాజు పడిపోయినాఁడు. ఏమిటి కర్తవ్యం.
2. కర్తవ్యమేమిటి! మనముకూడా పడిపోయేటట్లు తప్పతాగడమే.
యథా రాజా తథా ప్రజా అన్నాఁడు.

[illegible] చుక్కలు
[illegible]
[illegible] (అట్లు చేయును.)

[illegible] హా! చండాలా! భీష్మా! [illegible] అంబా! [illegible]
అంబ — (తప్పతాగి [illegible]) [illegible] చుంటిని.
[illegible] పారి

ణులగు దుష్టులంగూడి మధుపాన మొనర్చుచున్నాఁడు! అక్కటా! ఎట్టి కర్మము తటస్థించినది?

సాళ్వ—ఛీ! ఛీ! యెవ్వతెవు నీవు? ఇక్కడ కేందులకు వచ్చితివి?

అంబ—(స్వగతము) ఆహా! నాయభాగ్యదేవత నన్నింకను విడువనట్లున్నది! కానిచో నీమహానీయుఁ డిట్లు పృచ్ఛించుచున్నాఁడేమి ? (ప్ర) ప్రాణనాథా!

సాళ్వ—ఛీ! ఛీ! యెవ్వఁడు నీ ప్రాణనాథుఁడు ? అధమాధముఁడు భీష్ముఁడు! ఓసీ! పుంశ్చలీ! ఆకురుకులాపశదునిఁ జేపట్టి వానితో ననుభవింపవలసిన సుఖము లనుభవించి హృదయమునకుఁ దృప్తిగలుగక నన్ను వలతో వేసికొననెంచి ఎగ్గుసిగ్గులు విడిచి నాసన్నిధికరుదెంచి నన్ను ప్రాణనాథా! యనిపిల్చుచుంటివా? వీనివిడిచివానికడకు వానివిడిచివీనికడకు వచ్చుటకుఁ బోవుటకు నీవు బోగపుఁబుట్టుకఁ బుట్టితివా యేమి?

అంబ—సాళ్వరాజేంద్రా! అన్యాయమన్యాయము ! నన్నిట్లునోనాడుటన్యాయము ! (అనుబంధము ౧౫.)

ఓ ప్రభూ నీ హృదయ మెంతలో మాఱిపోయినది ? నన్నుగూర్చియిట్లు శంకింప నీకు మన సెటుగలిగె? పుంశ్చలీ! యనినన్ను సంబోధింప నీకునోరెటులాడె? ఎట్టి కఠినోక్తులాడితివి? యెట్టియన్యాయమున కొడిగట్టితివి?

చం. వలఁబడినట్టిపక్షిగతి ♦ వ్యాఘ్రమునోటికిఁజిక్కుజింకయుఁ
బలె,నలభీష్ముచేతఁబడి ♦ ప్రాణముమానమువాయ కాకృపా
నిలయుని వేఁడి వీడి చెలి, ♦ నీపదసన్నిధి కేఁగుదేరఁగా
నలఁపురిలోన, నన్నిటులు ♦ నవ్వులపాలొనరించెదే ప్రభూ!

సాళ్వ— ఏమేమి? ఆకృపానిలయుఁడు భీష్మచండాలుఁడు నీవు వేఁడినంతనే హృదయము గరిగి నిన్నువిడిచిపుచ్చినాఁడా? అబలవయ్యు నన్యుని చేతఁజిక్కి మానప్రాణములఁ గాపాడికొని మరలివచ్చిన

నిన్నెంతని కొనియాడఁ దలయు? ఆహా! ఆడుదిబొంకిన గోడఁగట్టి నట్లుండు నందు రిందుల కేకాఁగోలు! ఓసూనృతభాషిణీ!

సీ. తేనెటీఁగల దోలి ♦ తెట్టెనపహరించి,
తేనెఁద్రావక మాను ♦ దేబెయెవఁడు?
మొగ్గఁజేయిందూర్చి ♦ పుష్పమ్ముఁద్రెంచి వా
సనచూడకయె పోవు ♦ జడుఁడెవండు,
చెట్టుపై కెక్కి కో ♦ సినయట్టిఫలమును,
చవిచూడకే వీడు ♦ జాల్ముడెవఁడు?
దారులఁగొట్టిన ♦ ద్రవ్యంబు గొనకయే
వీథిఁబాఱఁగవేయు ♦ వెట్టియెవఁడు?
కత్తిఁబట్టి ఘోరాజిరం ♦ గమ్మునెట్టి
రక్తముంగార్చి వైరి రా ♦ ద్రాజినోర్చి
బల్మిఁదాగొనిచన్నట్టి ♦ పద్మనేత్ర
ననుభవింప కూరకపంపు ♦ ననదయెవఁడు?

3–మి — కష్టపడికాచుకొన్న సారా త్రాగకుండా పాఱబోసుకు 'దద్దమ్మ యెవఁడు? త్రాగ్గాయెక్కువైతే నిషావల్ల మిగిలినదాన్ని పాఱబోసుకొన్నాఁడన్నా నమ్మొచ్చు అసలే యంటకుండా పాఱబోసుకున్నాడంటే యెలానమ్మడం—

అంబ — ఓసాళ్వరాజేంద్రా! నీ విషమపరీక్ష యింకను మానకుంటివా! మహాప్రభూ! నీచరణ దాసినగు నాహృదయ మచలమునుబోలె నిశ్చలమైనదిసుమా? నాప్రేమము శరజ్జ్యోత్స్నాస్వచ్ఛము సుమా? చిన్ననాఁటంగోలె నాహృదయముగాని నాప్రేమము గాని నీకుఁదక్క నన్యునకు లేశమైన నర్పింపఁ బడియుండలేదు. నాదైవమవగు నీచరణసాక్షిగాఁ బ్రమాణము సేసిచెప్పుచుంటిని. ఆభీష్మునివలన నాకన్యాత్వమునకు నెట్టి భంగమును గలుగ లేదు— ఆదయామయుఁడు నాహృదయము నెఱిఁగిన వెంటనే "అమ్మా! నీమనమన్యాధీనమగుటెఱుంగక పొరపాటున నిన్నుం గొనివచ్చితిని. నీవు నిరాటంకముగ నీవలచిన మనోహరునిఁ

జేరఁబొమ్మని సగౌరవమ్ముగ స్యందనమ్ము నెక్కించి పదువుర పూఁబోడులఁ దోడొసంగి నీసాన్నిధ్యమున కంపినాఁడు. ఆ సారథియు నాకుఁదోడువచ్చిన యంగనలును నీయాజ్ఞంగొని తమపురంబున కరుగుటకింకను ద్వారముకడ గాచుకొనియున్నారు - వారినడిగి యిందలి సత్యాసత్యములఁ దెలిసికొనిమైన నన్నుఁ బరిగ్రహింపుము—

3 — త్రాగుఁబోతునకు గంజాయిదమ్ముగాఁడును నల్లమందుభాయిగాఁడును సాక్షులైనట్లు నీకు వారుసాక్షులా? వాఁసాక్ష్యము పాచికల్లువలె పరిగ్రహణయోగ్యంకాదు -

సాళ్వ — కన్నులకుఁ గనఁబడుచున్న విషయమును వీనులతో విని తెలిసికొనట యెందులకు? అక్కఱలేదు—ఎంతటి విచిత్రోదంతము? ఓకాశీరాజకుమారీ!

ఉ. అంగడిలోని బొమ్మఁ గొనుఁ,నంతకు నాత్రము నంది, కొన్నమీఁ
దంగడకూరకే విడిచి ♦ దానిఁదలంపని పాలపాపఁ డ
ట్లంగన నిల్లుసేర్చవఁట ♦ కారటముంగని, యిల్లుసేర్చపై
నింగృపముట్టకేవిడిచె ♦ నే? యతఁడంతనపుంసకుడఁటే?

ఇదియే సత్యమైనచో భీష్ముని నిర్భరకృపాధురీణత్వమునకు వెఱ్ఱిబాగులతనమునకు నాశ్చర్యపడవలసినదే !

అంబ — సత్యము. మహాప్రభూ! ముమ్మాటికిసత్యము -

సాళ్వ — సత్యమా? ఓసీ! అనృతస్వరూపిణీ! అసందర్భప్రలాపినీ! సంగరమొనర్చి బల్మిని నిన్నుఁ గొనిపోయినవాఁడు నిన్నంటకుండ ముట్టకుండ "పో మాయమ్మాపో"యని పంపినాఁడా? పాపము?

గీ. అర్ధరాత్రమ్మునందుఁ బ్రా ♦ ణాశవీడి
కన్నముంద్రవ్వి యింటఁగ్రై ♦ కొన్నధనముఁ
దిరుగఁదద్దనస్వామికిఁ ♦ దెచ్చియిచ్చు
వింతవెఱ్ఱిబాగులవాఁగ ♦ భీష్ముఁ డహహా.

3— పెండ్లాలతో కాపురంజేసే ముండాకొడుకులే చక్కని స్త్రీ చేఁ జిక్కితే కక్కుఱితిపడకుండా మానరు– ఇఁకఘోటకబ్రహ్మచారి నాయాలవ్వూరకేవదుల్తాడంటె నేను సాగా మాన్తానన్నమాట.

అంబ— మహారాజా! ఆ దేవవ్రతుని పవిత్రచరిత్రము నీవువినియుండవు. ఆ మహానుభావుఁడు తండ్రికొఱకు రాజ్యమును, వివాహమును విసర్జించిన నిష్కలంకచరిత్రుఁడు– బ్రహ్మచారి —

సాళ్వ— అతఁడస్ఖలిత బ్రహ్మచారి. నీవపూర్వకన్యాశిరోరత్నమవు - సరిపోయినది– మీరిరువురు కట్టఁగట్టుకొని భగ్గుభగ్గునమండు నగ్గిగుండమునం బడిభ్రుగ్గిమాడిబూడిదయై పొండు– ఛీకులటా! పాపాత్మురాలా ! నాయెదుటనుండి తొలఁగి పొమ్ము - చవితి చందమామవలె నీమోము చూడఁదగనిది–

అంబ— ఓదయానిధీ! నేను నీకొఱకు నామనోహరుండవగు నీకొఱకు జగదేకవీరుండగు భీష్మునంతటివాని నలక్ష్యము సేసితిని. దివ్యసామ్రాజ్యపీఠముఁ బోని కురురాజ్య సింహాసనమును నెడమకాలితోఁదన్నివైచితిని. ఇట్టినన్ను నిన్నె ప్రాణముగ సర్వస్వముగ సర్వేశ్వరునిగ నమ్మికొనియున్న నీపాదకింకరినగు నన్నుఁ బరిగ్రహింపక తిరస్కరించుట ధర్మముగాదు. న్యాయముగాదు. ఈశ్వరసాక్షిగ ఆభీష్ముఁడు నాకన్యాత్వమును జెఱుపలేదు. నాయెడల జాలిగలిగియే నీసాన్నిధ్యమున కంపినాఁడు. ఇందు లేశమైన నసత్యము లేదు.

సాళ్వ— లేకపోవుఁగాక-నీకన్యాత్వమునకుభంగముకలుగకపోవుఁగాక నిన్ను నేనెట్లు పరిగ్రహింతును?

ఉ. అక్కఱఁ దీఱిపోవుటనొ? ♦ యక్కటికంబుననో? యెడంద నీ
చక్కదనంబు నచ్చమినొ? ♦ షండుఁడు గావుటనో? యతండు ని
న్నిక్కడ కంపుఁగాక? యిట ♦ నెవ్వఁడు నిన్నుఁ బరిగ్రహించుఁ జీ
కక్కినకూటికాసపడఁ ♦ గామిని? సాళ్వుఁడు జాగిలంబఁటే?

3 ఓతొత్తుకూఁతురా! ఏమనుకొనుచుంటివి– మా మారాజు

పురుష సింహముగాని గ్రామసింహముగాఁడు- తెలిసినదా? పో. పో.

అం—(ఆత్మ) పశువులు జోరీఁగ లేగాని తేనెటీఁగ లాశ్రయించునా? తగినస్నేహితులు- ఈమూర్ఖుఁడు తాను నన్నరాని మాట లనుటయేగాక యీ త్రాగుఁబోతులతోఁగూడ దిట్టించు చున్నాఁడు-నరాధముండగు వీని మ్రోలనాకింక దైన్యమెందులకు? నాగతితుద కెట్లు కాఁగలదో యట్లుకాఁగలదు. (ప్ర) ఓసాళ్వ రాజసఖుఁడా! మీమహారాజు గ్రామసింహమో - పురుషసింహమోనిర్ధారింప నిన్నుబోఁటి త్రాగుఁబోతుపెద్దలే తగిన వారు సుమా!

ఉ. తనయెడ మక్కువం గలుగఁ ♦ తామరసాక్షిని బల్మి నెవ్వఁడో గొనిచనఁగన్నులంగనియు ♦ గొంకునఁ బ్రాణముతోడఁ బాటి, ఆ వనిత యెదోవిధిఁ జెలఁగ ♦ బాసి తనుంగనరాఁగఁ బౌరుషమ్మున బ్రకటించు ధీరమణి ♦ పూరుషసింహమొ గ్రామసింహమో? ఓసాళ్వరాజా! నే నిదే వెడలుచుంటిని—

సాళ్వ—ఆఁగుమాఁగుము. మావలన సమ్మానింపఁబడకయే పోదువా? ఓరీ! మిత్రులారా. ఇది సిగ్గువిడిచినది-సిగ్గువిడిచిన చేడెకుఁజీర మాత్ర మెందులకు? మీరుదీని వివస్త్రంగావింపుఁడు-ఊఁ చూచెద రేమిరా?

1—నీవు రా—

2—నీవురా—

3—రాకుని పాళ్తో పాటు సారవ తగినదిరా? ఇంకొక కాయము సారా వుంటే - నాసామిరం

అంబ—ఓరీ! అధమాధమ! నీచాత్మ! వీరు నీతోఁ బాటు త్రాగుటకే గాని యిట్టి సాహసమునకు సమర్థులుగారు — వారేల? మగ వాఁడవైనచో నీవు కావింపుము ననువివస్త్రను - పరమశుంఠా గ్రేసరా! ఇదిగో! మహోగ్ర కాలాహిం వాలమునుబోని మచ్చేలాంచలము ను నీవు స్పృశింపుమురా! ఉత్తర క్షణ

అంబ సాళ్వునిఁ బొడుచుట.



"పాతివ్రత్య ప్రభావమునఁ గాదు ఇదిగో! ఈశాతఖడ్గాంచలమున"

ముననే దురభిమాన వార్ధకపరికంపమానమగు నీశిరము నీమొడలినుండి నేలంబడి ధూళి ధూసరితమై పోవఁగలదు. ఓ స్పృశింపుమురా! పాతుఁకోఁతా! ఈప్రజ్వల దగ్నిజ్వాలను స్పృశింపుమురా?

సాళ్వ—నీపాతివ్రత్య ప్రభావమున నన్నుఁ జంపెదవుగాఁబోలు? ఏది చూతము—

(పైటచెంగు పట్టుకొనును)

అంబ—పాతివ్రత్యప్రభామునఁగాదు ఇదిగో. ఈశాత ఖడ్గాంచలమున- (మొలనుండి కత్తిదూసి సాళ్వనిబొడిచి నిష్క్రమించుచున్నది.)

(యవనిక వ్రాలును.)

శ్రీ

[illegible]

[illegible]

# చతుర్థాంకము

[illegible]

[illegible]

ప్రదేశము—భీష్ముని మందిరము.

ప్రవేశము—కేశవుఁడు, భీష్ముఁడు.

కేశ—ఆయుష్మంతుఁడా! నీవు, మంచిపనిఁ జేసితివి; ఏమనిన—

గీ. లేమలకు నాత్మ సంప్రీతి ♦ లేకయున్న—
పెండ్లి కన్నను, మృత్యువే ♦ ప్రియము గాదె?
కాన, వారలమానసా ♦ కాంక్ష నెఱిఁగి,
మసలుటయె మేలు జగమున ♦ మనుజ పతికి—

భీష్మ—నీవనినమాట నిజమే కాని, అంబతప్పఁ దక్కిన యిరువురును, నాసోదరుఁడగు విచిత్రవీర్యుని వివాహమాడిరి. కాని, అంబమాత్రము, సాళ్వుని కడకరిగెను. సాళ్వుఁడామె నేమి పరాభవించునో యని నాహృదయము శంకాసంకులమగుచున్నది.

కేశ—అతఁ డామెయందు ప్రేమనిల్పిన వాఁడేయగుటవలన, నట్లు జరుగకుండుఁ గాక!

భీష్మ—కేశవుఁడా! నీవు ప్రపంచధర్మమును మాత్రమే తెల్పితివి; గాని – సాళ్వుని యెడల మాత్రము, నీయనుభవ వచనములు సాగవుసుమా! ఏమనిన—

ఆ. మధురసంబుచేఁ బ్ర ♦ మత్తుఁడౌ సాళ్వున
కేమిఁ బ్రణయ మహిమ ♦ మెఱుక పడునె?
అందు, దుష్టజన మ ♦ యస్సుఁడౌ నాతని,
వర్తనంబు దెలియ ♦ వలెనె? యెందు—

కేశ—ఔను; అదియును, నిక్కమే -

భీష్మ—ఉండుండుము; ఎక్కడిదో భీషణధ్వని—

(తెరలో)

ఓహో. పరిజనులారా! మీప్రభుఁడగు భీష్మనాముఁ డెక్కడ? మీప్రభుఁడగు భీష్మనాముఁ డెక్కడ?

భీష్మ—(తెరవంకఁజూచి) ఆర్యమిత్ర! కేశవ! ఆవచ్చు భీకరవిగ్రహ ముం దిలకింపుము.

గీ. కన్నుదోయిని జ్వాలదగ్ని ♦ కణము లురల,
ము కగతి కేశతతి భుజ ♦ మ్ములనుఁ జెదర,
నూర్పుగాలికి చన్దోయి ♦ యూరకెగుర,
నేఁగుదెంచెడు నీదిశ ♦ కేలతాంగి -

ఈసతి నిక్కముగ సాళ్వరాజుచేఁ భరిభవింపఁబడిన యంబ వలె నాకుఁదోఁచుచున్నది.

కేశ—నాకును. అట్లె తోఁచుచున్నది.

(తరువాత, అంబ వికృతాంగియై ప్ర॥)

అంబ—(శోకముతో భీష్ముని పాదములపైఁబడి,) ఓదయాస్వరూపా! నేను వెండియు నీపాలఁబడినందులకు మిగుల లజ్జావతినగుచున్నాను. సాళ్వభూపతి, నేనిచ్ఛాపూర్వకంబుగనే నీవెనువెంటఁ దవిలివచ్చితినని శంకించి - పదువురలోన నన్ను పరాభవము పాలుగావించెను -తత్పరాభవమును నేను భరింపనోపక యాతని మత్కరవాలాహతుల పాలుగావించితిని. ఇప్పుడు నేను నీమూలమున, సన్యరక్షణము లేనిదాననైతిని. నాకింక నీవే రక్షకుఁడవు; నన్ను పరిణయంబై కీర్తినిలుపుకొమ్ము—

భీష్మ—(చెవులుమూసికొని,) హరిహరీ! — ఎట్టివ్రతభంగాపాదకము లగు కటువాక్యములు నాశ్రవణ పుటంబులఁ జొచ్చుచున్నవి. ఓయమ్మా! నన్నుమన్నింపుము -

గీ. నేను, జనకసంప్రీతికై ♦ నూనుకొనుచుఁ
బరిణయంబుఁద్యజించిన ♦ వాఁడనమ్మ!
అట్టినే నెట్లువెండియు ♦ నఘమొనర్తు?
బ్రహ్మచర్యమెచాలు; నీ ♦ బ్రతుకునందు॥ -

గీ. నేనుపరిణయమైన, సం ♦ తానలాభ
మందుదునటంచు,రాజ్యార్హు ♦ డౌనుసుతుఁడ
టంచు,భీతుఁడై నాతాత ♦ యానతిచ్చెఁ
గా ననువివాదూగని ♦ గమ్మటంచు.

గీ. ఈభవంబుననాజన్మ ♦ కింకనొక్క-
గతిగలుగదమ్మ! తల్లిరో! ♦ కమలభవుఁడు
బ్రహ్మచారివిగమ్మని ♦ వ్రాసియుండ,
నెట్లునీకోర్కనునిర్వ ♦ హింప గలను?॥ -

ఆ. అవనిజనులు నన్ను ♦ నామరణాంతము
బ్రహ్మచారినంచుఁ ♦ బలుకుచుండఁ
దండ్రికై త్యజించెఁ ♦ దనలాభమనిపల్కఁ
దనువుగడచుఁ,గీర్తిఁ ♦ దాల్తునమ్మ॥—

కావున నీకోర్కిమాని, నీయిచ్చవచ్చిన రాజకుమారునెవ్వని కని వరింపుము పొమ్ము.

అంబ—(దుఃఖించుచు) అయ్యయ్యో! ఇంకనాగతియేమి? బలిమిఁగొని తెచ్చిన నీవే భరింపఁజాలనని పరిత్యజించినప్పుడు, ప్రేమపాచు ర్యమొనరించిన మహారాజే నాప్రవర్తనమును శంకించినప్పుడు- నేనింక నొరులనెవ్వరినర్థింతును? ఎవ్వాకడ కరుగుదును? నాయంతటనేను, లజ్జాపరిత్యాగ మొనరించి, యెవ్వరిపాదము లం బడిదీననై — పరిణయమూడుమని వేడుకొందును? నాథు,

నాథుఁడెవ్వఁడు? హా! విధీ! — ఈ లోకమున నొక్క యనాథను సృష్టించి విడిచితివా! రాజా! నాకెందఱు బాంధవులున్నను, మీమీ పాదములపాలిటం బడి ప్రాధేయపడి, నిరాశ్రితనై - దుఃఖింప నలువ నా మొగంబున లిఖించెనా? నాగతి యింతేనా? యింతేనా?

(అనుబంధము ౧౬)

భీష్మ అమ్మా! నేనేమి చేయుదును? విధి నీయందు ప్రతికూలసంకల్పుఁడై యుండెనని తోఁచుచున్నది.

గీ. చెలులచే వ్రాఁత దోఁతె ♦ చ్చితిని, నిన్న
విడచె సాల్వుఁడు మధుపాన ♦ వివశుఁడగుచుఁ
గాంచ నిదియెల్ల దైవసం ♦ కల్పమమ్మ!
మనుజయత్నంబు లేదింక ♦ మానవతిరో!

కాన, నేనిందసహాయుఁడను; నీవు సాల్వునిఁ గోరితి నన్నంతనే నేనెంత ప్రతిబంధకమును వచింపక, నిన్ను విడిచితిని; త్వదీయ నాశనమునకు హేతుభూతుండగు వాఁడా దుష్టసాల్వుఁడే! అందులకా నరపశువునకుఁ దగిన ప్రాయశ్చిత్తమయ్యెనుగాదా! కావున, నింక క్రోధముడిగి పితృమందిరమున కరుగుము; ఆందోళికా పరివారాదులనిప్పుడే సిద్ధపరిచెదను. (పాట. 13.)

అంబ (క్రోధపరవశయయి) ఓదుష్టరాజా! ఏమి నీ లజ్జావిహీనత! ఇందు నీ దోషము లేదనుచుంటివా? కాదు; స్వలాభాపేక్షచే మదభిమతం బెఱుంగక — బలాత్కార రాక్షసవివాహంబునకుఁ గొనివచ్చిన నీ యదియే ప్రథమాపరాధంబగును. మధుపానమత్తుఁడై యున్న సాల్వుని లెక్కయేమి? శాశ్వత బ్రహ్మచారిననియును, దేవవ్రతుండననియును, కీర్తిశాలివైననీవు, యొక్క యబలను శరణాగతయైన యనాథను, నిరాకరించిన నీకేమున్నది? ఛీ! నీకిది యొక యశమేయని గర్వించుచుంటివా? ఓషండుఁడా! మానినీపరాభవ మహావాంఛానువర్తీ! రాజలోకాపయ

శో పాదకా! నీదుష్టమానసము నెఱుంగక — కాంతా జనంబు పేరువిన్నమాత్రంబున, గడగడవణంకు - ననమర్థుండ వని తెలియక — నీసన్నిధికి మరలవచ్చిన నేనే, కడుంగడు నిందార్హురాలను. నిన్నుదూషింప నేమిటికి? (కేశములను వివృతములను గాంజేసికొని) కటకటా! ఇంక నాకెవ్వరు రక్షకులు? ఓమృత్యుదేవతా! నన్నేల నీవింకను జీవింపఁజేసెదవు? శీఘ్రముగ నీలోఁగలుపుకొనుము -

భీష్మ — అమ్మా శాంతినందుము — శాంతినందుము -

అంబ — (పండ్లుపటపటఁ గొఱుకుచు) శాంతి— శాంతి - ఇంకను, నాకీ జన్మమునకు శాంతియెక్కడిది? నన్నింతటి పరాభవమునకుఁ బాల్పఱచిన నిన్ను, నిన్నువధింపవలయు నేనాత్మశాంతి నందవలయును; గాంగేయ కృతపరాభూత శుష్కమానసకాసారమా! వెండియుఁ బరిపూరిత ప్రతీకారవిషరాసులచే సముద్వేలితవుగమ్ము — క్రోధమా! భీషణాగ్నిహోత్రజాజ్వల్యమాన ప్రపూరితవై ప్రకాశించుము; ఓనిరాధారవగునంబా! ప్రళయసమయమున భీషణమహాకృతినందినక్రోధనికురంబయగునంబ ననుకరింపుము- ప్రతీకారము ప్రతీకారము

—♦భీష్మకృత మహావమాన ప్రతీకారము♦—

(కేకలు వేయుచు ప్రస్థానము.)

(భీష్మ కేశవులు వెఱగందిచూచుచుందురు.)

(తెర వ్రాలును.

దృశ్యము—౨

ప్రదేశము—అరణ్యభూమి.

ప్రవేశము — వికృతాంగి యగునంబ -

(అనుబంధము౧౭) పాట-15

అంబ—(ఆయసముతో,) కటకటా! ఈనిబిడ గహనాంతరమున, నెంతదూరము నడతును? తీక్ష్ణమగు, నీయాతపంబున నాకా

హారములేక, మూఁడుదినంబులయ్యె — ఇంకెంతని తాళుదును!

సీ కడుదీన గతిమీఱ ♦ నడలించు వడగాడ్పు
విశ్వంబునం దెల్ల ♦ వీవఁ దొడఁగె
గడు భయంకరమైన ♦ ఘనచండ కరతాప
మఖిల దిక్తటముల ♦ నలము కొనియె —
భీమదావాన లా ♦ భీలమా దావాగ్ని
గహనాంతరంబును ♦ గాల్పనయ్యె —
జల శూన్యతకు నార్తిఁ ♦ జలియించు వృకములు,
వనవీథులనుఁ బడి ♦ పఱవ సాఁగె

గీ నాల్క తడియారె; మదిని సం ♦ తసము దీఱె,
నవయవంబులు బలహైన్య ♦ మంద సాఁగె
పాదముల యందు సత్త్వ ♦ వాసిపోయె.
నడువఁగా నోప; నీ గహ ♦ నాంతరమున —

ప్రతీ కారమునందలి పట్టుదలచే నెట్టులో, యింతదూరము — వచ్చితిని, ఇంకముందు నాకు గతియేమి? నాదుర్ఘట యత్నం బున కడ్డుపడి నాప్రతిజ్ఞం దీర్పువారెవ్వరు!

సీ. క్రోధమా! నీకింకఁ ♦ గుదురేది నావంక,
ప్రతినఁ దీర్పఁగలారి ♦ వెతకఁబొమ్ము —
మాత్సర్యమా! నన్ను ♦ మతిమాలి చేరితి,
వరుగుమా! నీకుది ♦ క్కైనయెడకు
రోషమా! శాత్రవ ♦ శేషంబుఁదీర్పని
నన్నేలమదిఁ గోరి ♦ నావునీవు
మత్ప్రతీకారమా? ♦ మదిలోననీవొక్క —
దాన వేటికినీవు ♦ దరలిపొమ్ము
ప్రాణమా! నీవునాకుదు ♦ ర్భరముగాన,
వట్టికట్టెనుధరపైన ♦ వదలిపొమ్ము
శోకమా! నీవునాకుఁజ ♦ రాకుసుమ్ము
నిన్ను నాయంతవదలుచు ♦ నున్నదాన.

ఓదురదృష్టవంతురాలవగుజననీ! నీవు నిన్నే దుర్మహూర్తమున,
నీపృథివికి భారముగాఁగంటివి!

మ. దశమాసంబులు మోసి గర్భమున, ను ♦ ద్యత్ప్రీతిఁ జెన్నారఁ బెం
చి, శరీరామయపాళిఁ బ్రేమమున శా ♦ న్తిం బొందగాఁ ద్రోసి, స
ద్యశముం గాంచెదనంచు నెంచితివిగా ♦ తల్లీ! యిట్టుల్నీకు, దు
ర్యశముం గూర్చెదనంచు, నెంచవుగదా! ♦ హా! దైవచిత్తంబెటో

బలహీనతచే నవయవంబులు గుడ్డప్రేలికలవలె వ్రేలాడుచున్నవి
నాలుక తడియారె! కన్నులువశంబులై భారంబున, మూతలు
పడుచున్నది శ్రీమన్నారాయణా. ఆపద్బాంధవుఁడవగు నీవు
దక్క నాకిప్పట్టున దిక్కెవ్వరు?

(మూర్ఛిల్లును.)

(తరువాతఁ బరశురాముఁడు ప్రవేశము)

పర—(స్వగతము.) నేను తపోనిష్ఠయందుండ, శ్రీమన్నారాయణా." యను నబలాకంఠరోదనశబ్దంబు వినవచ్చెను పాపమీమహార ణ్యంబున, నట్టి ప్రాణభీతయగు నార్తురాలెవ్వరో విచారించి, నాతోఁచిన త సహాయంబు సలిపెదఁగాక! (నాల్గడుగులు ముం దునకు నడచి,) ఓహో. ఎంతభీభత్సాకారము —

గీ. రాజవంశప్రభూతయై ♦ రాజవదన
గాఁగఁదోఁచెడు, రోషవి ♦ కారమైన
వదనపద్మంబుకసువసి ♦ వాడియుండె,
వివృతమై కేశబంధంబు ♦ వికలమగుచు
సంసతలమెల్లనట్టిట్టు ♦ లావరించెఁ
శివునితో వివాదంబాడి ♦ భువికిఁవచ్చి
నట్టిశర్వాణిగాఁదోఁచు ♦ నంబుజాక్షి॥

ఈమెయేమో పెదవులు కదల్చుచున్నది; ఆలకింతము -

అంబ—(మూర్ఛయందే తనలో) ఓరీ భీష్మచండాలా. నీప్రతాపముం జూపుటకొక్క యబలయాలక్షించె. ఛీ! నపుంసకుఁడా! నీవని,

నన్నిట్లు పాదము లంటబడిన తరుణిని గాదని వెడలనడిపింతువా?
నీబ్రహ్మచర్యము పాడుగాను! — నిర్వేదము — నిర్వేదము
(శైలిని పడిలేచి పరశురాముని జూచి నిర్విణ్ణురాలగును.)

పర — తల్లీ! భీతినందకు; నేనన్యుండనుగాను క్షత్రియ కాంతారదం
దహ్యమాన విలయానల ప్రతిమానుండనగు పరశురాముడ -

అంబ — స్వామీ! నమస్కారము - తమదర్శనము చే నీదీనురాలు
కృతార్థురాలయ్యెను; శుష్కసస్యంబులకు గంగాలహరి లభ్య
మైన తెఱంగున నున్నయది.

పర — తల్లీ! ఇప్పుడు నీవునిద్దురలోన, భీష్ముని, నిందించితి వదియేమి?

అంబ — దేవా! దేవరవారితో లజ్జాసంయుతమగు నాదీనచరిత్రము
నేమని మనవి చేయుదును?

పర — ఆవిషయంబున, నీవేమియు లజ్జింపవలదు; వెఱువవలదు, వెను
దీయవలదు — ఏమనిన,

చ. పరశువుఁదాల్చి, యీకరము ♦ పారధరావరకోటిఁగూల్చెఁదా
నిరువది యొక్కమాఱులు; మ ♦ హిన్ వెలయించెను క్షత్రరక్తసా
గరముల, దాని వెండియును ♦ జ్ఞప్తికిఁదెచ్చెద నొక్కసారి, నీ
వరమరలేక తెల్పఁదగు ♦ నమ్మ! త్వదీయవిచార హేతువున్

అంబ — (ఊరడిల్లి,) తండ్రీ! అనాథనై — అగతికనై దిక్కులేక—
యీయడవి నొంటినై, సంచరించుచున్న, నాచరిత్రము నడిగి,
నన్నూరడించి — నాశ్రవణయుగళంబున, నాశామృతముం
బోసిన, మీకన్న నాకుఁబరమబాంధవులు వేఱెవ్వరు? నాచరి
త్రము నాలకింపుడు — వచియించెద—

పర — అమ్మా! శాంతచిత్తవై — వచింతువుగాక రమ్ము — నాయాశ్ర
మమున కరుగుదము. (పాట ౧౬)

అంబ — భాగ్యము (ఇరువురు ప్రస్థానము.)

## దృశ్యము— 3

### ప్రదేశము— గంగాతీరము.

ప్రవేశము—ధనుర్ధరులగు భీష్మపరశురాములు,
(అనుబంధము. 18)

భీష్మ—మహాత్మా!

ఆ. పెద్దవారుమీరు ♦ పిన్నవాఁడ నేను, సం
గ్రామకేళియందు ♦ ఘనులుమీరు
నేనుసుంతయైన ♦ నెఱుఁగనివాఁడనో
యార్య! యిట్టులాడ ♦ న్యాయమగునె?

పర—గాంగేయా! అట్లనుట భావ్యముగాదు పరాక్రమమునకుఁ బిన్నపెద్దతనములతో నేమిపని? నెలదినముల నుండియు మన మాచరించుచుండిన యీసంగరముకతంబున నీశౌర్య ధైర్యాదులు నాకుఁ బరిపూర్ణముగ నెఱుకవడియెను. ఈదినము సయితము నేనోడితినేని, పరమేశ్వరసాక్షిగా-రణధర్మమునకొక యంజలిచేసి యాపథంబును ద్రొక్కకుందును.

భీష్మ—స్వామీ! నామనవి యొక్కటిగలదు; మన్నింపవేఁడెదను.

పర—వత్సా! వచింపుము.

భీష్మ—దేవా?

ఆ. తమకు నే వచింపఁ ♦ దగువాఁడఁగాను, మీ
రార్యులగుటఁ గోర ♦ వార్ధ్వపదవిఁ
గాంచినారు తొల్లి, ♦ గతియించె నాకాల
మిపుడు రాదు; విజయ ♦ మెసఁగఁబోదు॥

గీ. ఎట్టులో తొల్లి-మీరంది ♦ నట్టియశము
తోడఁద్రృప్తివహింపుఁడు ♦ దురమువలదు;
ఇమ్మహిని రాముఁడే మీయ ♦ శమ్ముఁగొంత
నలువుఁగావించె, నేనట్లు ♦ నలుపనోప॥

ఆ. అంబపలుకు మీర ♦ లాలించి యీసంగ
రమ్మొనర్చినారు ♦ క్రమముఁదప్పి
కాలగతులుమాత్ర, ♦ గాకున్న మీబాహు
బలమదేడ? నేను ♦ గెలుచుటేడ?॥

గీ. వత్సపలుకులయెడ గౌర ♦ వమున నైన
నింతతో మీరు సంగర ♦ వృత్తిమాని
తపముసల్పుట శ్రేయస ♦ ద్ధర్మమగును,
గానఁ బ్రార్థింతుమిమ్ము న ♦ క్కరణిసేయ॥

పర—(పౌరుషముతో) ఓరీ! వదరుఁబోఁతా! మేము నీపరాక్రమము నొకింత స్తుతించినంతనే కన్నులునెత్తికెక్కి పిన్నపెద్దలనుమాట మాని మాకు నీతులనుపదేశింప నెంతదీర్ఘోపన్యాసమును వ్రాసికొనివచ్చితివి. జయాపజయంబులు దైవాయత్తంబులుగాని తొలుతనూహింపఁ దగినవిగావు— రాముఁడు నారాయణావతారియగుటనేనే యోడితిని. అంతమాత్రమున కాతనితో నీవు సాటియగుదువా? గోవెక్కడ? గోమాయువెక్కడ? నీమానసం బిట్లు గర్వభూయిష్టంబని యెఱుంగనైతిని. నిన్నుపేక్షసేయరాదు. రమ్మిఁక నీపొగరణంచెద!

భీష్మ—(స్వగ) ఔరా! ఈతఁడు నాపలుకుల వేఱుగాఁదలంచి, యాగ్రహించుచున్నవాఁడు; నామాటల తెఱంగు గ్రహింపఁడయ్యె— ఎంతవిక్రమమున్ననేమి? వైదికులు జడబుద్ధులుగదా! (ప్రకా) స్వామీ! నేను తమ్ము దూషింపఁదలంచికాని, గర్వబుద్ధిచేఁగాని పలుకలేదు. నిజమారసి, యుభయులకును బ్రయాసము తప్పింతురేమో యని పలికితిని.

పర—ఓరీ! యల్పమతీ! గ్రుడ్డువచ్చి, పిల్లను వెక్కిఱించినట్లు నీవా నాకు నీతుల నుపదేశింపవచ్చితివి?

ఉ. క్షత్త్రియులన్న మండిపడు ♦ సంగరకోవిదబుద్ధినయ్యు నిన్
స్తోత్రముఁ జేసినాఁడ! ఘన ♦ శూరతఁగాంచి ప్రహర్షమంది; ఛీ

పాత్రుఁడవీవు గావు; స్తుతి వాక్యములన్నినిపొంగి, యల్పమా
నాత్రముఁజూపుకొంటి, వహ హా! యనిపెద్దలు గేలిసేయఁగన్॥

(శరమును సంధించి) ఇఁకరమ్ము; యథావిధముగా మనకు సంగరము తప్పదు; నీవు బాలుఁడవైచూపిన విక్రమమునకు హర్షించి స్తుతిచేసితినేగాని నీకుఁ బరాజితుఁడనైకాదు. సంశయము గలవాఁడవేని నావలనఁ బూర్ణపరాభవము నిప్పుడే పొందఁగలవు రమ్ము.

భీష్మ—(రోషముతో) స్వామీ! పెద్దలకీర్తి నిలుప నేనాడిన హితంబున కిదియాఫలము! అట్లయిన నేను మాత్రమేల వెనుదీయుదును? రండు సంగరమునకు

పర—అట్లయిన నొకవివిక్తస్థలాంతరమున కరుగుదము; రమ్ము.

భీష్మ—ఈసారి మాటమిగిలినచో నిటుపై రణమొనర్పనని పల్కితిరి సుఁడీ! జ్ఞప్తియందున్నదిగదా! ఆర్యు లాడితప్పనివారు.


పర—ఆడినమాటను సూర్యచంద్రులు గతులుతప్పినను దప్పువాఁడను గాను రమ్ము.

(పాట 17)

(ఇద్దఱును ప్రస్థానము)

(తరువాత—అంబప్రవేశము.)

అంబ—కటకటా! పరశురామునంతటి మహావీరుఁడు సయితము భీష్మునిచే పరాజితుండగుచున్నాఁడుగదా! ఇంక నన్ను రక్షింప దిక్కెవ్వరు? ఈదినంబునఁగూడ వెనుకటివలెనే తా నోటమినందిన యెడల పరమేశ్వరసాక్షిగా రణక్రీడనే విసర్జింతునని ఘోరమగు ప్రతినఁదాల్చియున్నాఁడే యీపరశురాముఁడు! నేఁడు మాత్రమీతనికి వెనుకటికన్న నధికశౌర్యమెటనుండి వచ్చును? అందును వృద్ధుఁడు!......ఓపరమేశ్వరా! పరశురాముఁడు నీభక్తుఁడుగదా? నేను నీదాసురాలను గావున నేఁడీ బ్రాహ్మణవీరునకు విజయముంగూర్పుము. (ప్రక్కకుఁజూచి)



భీష్మ; పరశురాముల యుద్ధము.

హా! హా! ఇంకేమున్నది? పరశురాముఁడు భీష్మునిశౌర్యమునకుఁ దాళలేక పరశువుతోఁగూడ శరచాపంబులను నేలఁబాఱవైచి యిటేవచ్చుచున్నాఁడు. పరమేశ్వరా! ఎంతలో నాయాశాంకూరములను సమూలముగా గిల్లివేసితివి?

(తరువాత పరశురామ భీష్ములు ప్రవేశము.)

పర—వత్సా! గంగానందన!

ఉ. మెచ్చితి; నీసమర్థతకు ♦ మెచ్చితి నీభుజశౌర్యలక్ష్మికిన్
మెచ్చితి; రాజలోకమున ♦ మేటివటంచును నిన్నుమిన్నఁగా
నిచ్చెదఁగోరుకొమ్ము; భువి ♦ నేవరమైననునీకుఁగాన్కగా
సచ్చరితుండవీవు, జయ ♦ సంపదఁగాంచఁగదయ్యబాలకా!॥

భీష్మ—దేవా! తమకృపారసంబున ననన్యవీరసాధ్యంబులగు నాశీస్సులనందితింజాలదే! వేఱుగ నాకు వరంబులేల స్వామీ!

పర—ఆనందమున నే నొసంగెదనన—నీవు నన్నుఁ జిన్నబుచ్చుట భావ్యముగాదు;

భీష్మ—దేవా! అట్లయినఁ గోరెదను దయచేయుఁడు.

ఆ. అనఘ! మీదురాగ్ర ♦ హంబునఁగొల్లి న
శించె; క్షత్త్రికోటు ♦ లెంచరాని
వింకమీఁదవారి ♦ హింసింపనివరంబు
నాకొసంగుమయ్య! ♦ లోకమాన్య! ॥

పర—ఇది నీకిదివఱకేయొసంగఁబడినది--సంగరమే యొనరింపననికదా పలికితిని. అందులకుఁ దార్కాణముగా -నే నిప్పుడే బాలేందుమౌళినిఁగూర్చి తపమాచరింప హిమాలయంబునకరుగువాఁడ; బాలకా! చిరంజీవివగు బ్రహ్మచారివయ్యెదవుగాక!.

భీష్మ—కృతార్థుఁడను.

పర—(ప్రస్థానము)

అంబ—(భీష్మునకెదురుగావచ్చి) ఓ భీష్ముఁడా! నీకడుపుమంట యిప్పటికిఁ బరిపూర్ణముగ చల్లారినట్లేకదా!.

భీష్మ—(ప్రకాశముగా) అమ్మా! నాకిందుకడుపుమంటయేమున్నది? తొలుత- నా బ్రహ్మచర్యమునకుఁ బ్రతిబంధకమగుఁగావున నిన్నుఁ బరిణయము గాఁజాలనని పలికితిని. ఇప్పుడు నీప్రేరణమునఁ బరశురాముఁడే నన్ను రణమొనర్ప బలాత్కరించెఁగదా!,

అంబ—పరశురాముని నీవు జయించినంతమాత్రమున నా ప్రతీకారానలము చల్లారెనని గర్వింపకుము. చచ్చియైనసరియే నిన్నియంబ సాధించితీరును. చూచితివా! హుతాశనుండెట్లు వెలుంగుచున్నాఁడో! ఇప్పుడు—నేనందు భస్మమై మృతినిఁ గాంచి మరుజన్మమున, నీప్రాణములను హరింప సిద్ధమయ్యెదను. జాగ్రత్త! ఇవి యనృతవాక్కులు కావు— నే నిదే యగ్నిం బ్రవేశించుచున్నాను.

(అనుబంధము ౧౯.)

జయా! గోలోకనిలయా! శ్రీకృష్ణా!

(అగ్నిలోఁబడి కాలిపోవును.)

భీష్మ—హరిహరీ!

* ఉ. చండ పరీభవంబునకు ♦ సైపక యీపికవాణి యీశ్వరా!
మండెను నగ్నిలోనఁబడి ♦ మ్రగ్గుచునున్నది యిట్టివేళ నా
గుండెయు దేహముం గరగి ♦ కూడి కృపారసవారిరాశియై
యుండినఁ దజ్జలంబుల మ ♦ హోగ్రకృశానుని నార్పుదుంగదా.

* ఉ. ఈయలివేణి వహ్నిఁబడి ♦ యీవిధి మ్రందఁగఁగారణంబు నే
నో! మెలనాగవ్రాఁతయగు ♦ నో? ప్రతినన్ద్యజియింపలేక య
న్యాయమటంచెఱింగియు న ♦ నాథనొకర్తుఁ దృణీకరించితిన్
నాయఘముం సహింపవె య ♦ నాథజనావన! లోకపావనా!

(నిష్క్రమించును. తెరపడును.)

చతుర్థాంకము.

శ్రీ

# భీష్మబ్రహ్మచారి

## పంచమాంకము.*

### ౧ దృశ్యము.

ప్రదేశము — అంతఃపురము.

ప్రవేశము — విచారముతో సత్యవతి.

(అనుబంధము ౨౦.)

సత్య — (ప్రక్కకుఁ జూచి) అదుగో! నంబికాంబాలికలతో నాతండి యిటువచ్చుచున్నాఁడు. (చాటున నిలుచుచున్నది.)

(ప్రవేశము — అంబికాంబాలికల బుజములమీఁదఁ జేతులు వైచుకొని యాయాసపడుచు విచిత్రవీర్యుఁడు.)

(మఱియొక ప్రక్కనుండి భీష్ముఁడు ప్రవేశించును. సత్యవతి చేసన్నచే భీష్ముని తనచెంతకుఁ బిలువ నతఁడు వచ్చును.)

సత్య — (అపవారించి) నాయనా! నాతోఁబాటు వీరి దాంపత్యవిధానముఁ బరికింపుము.

భీష్మ — (అపవారించి) చిత్తము.

విచి — (వికటముగ నవ్వుచు) ఆవైపు భూదేవి — ఈవైపు శ్రీదేవి — నడుమ నారాయణమూర్తి! నారాయణ! నారాయణ!

అంబిక —
అంబాలిక —
} నారాయణ! నారాయణ! (విచిత్రవీర్యునిఁ గూర్చుండఁ బెట్టుదురు.)

---

* ఈయంకములో 2, 3, 4, పద్యములు దక్క దక్కిన యీయంకమంతయు వెం॥ వె॥ కే॥ గారిది.

విచి—మీరిరువురు చెఱియొకపక్క నిలువవలయును (అట్లు సేయుదురు.) గంగా గౌరులు కుడియెడమల నడుమ—(ఆయాసము)

అంబా—"స్థాణూరుద్ర ఉమాపతిః".

అంబిక—(అపవారించి) ఆవంక నొకనక్క. యీవంక నొకనక్క నడుమ దిక్కుమాలిన శవము! చెల్లెలా! భుజించుట కాలస్య మెందులకు? (ఒకరి నొకరు చూచుకొని నవ్వుకొందురు.)

విచి—నేను మీభర్తను—మీరు నాభార్యలు—అవునా!

అంబిక—మామెడకుఁ దాడు గట్టితివి. (మెల్లఁగ "ఉరిత్రాడు") గనుక—చెల్లెలా! అవునా?

అంబాలి—అవునక్కయ్యా!

అంబిక—కాని యీతిగ్మానమున కొకింత మార్పవసరము—ఏమన; భరించువాఁడు భర్త భరింపఁబడునది భార్య—కాని యిపుడు భరించువారము (బుజములమీఁదఁ జేతులువైచుకొని నడిపించుట మొదలగు పనుల—)భరించువారము మేముగుటవలన మేము భర్తలము నీవేభార్యవు. చెల్లెలా! అవునా!

అంబా—అవు నక్కయ్యా!

విచి—అటులన్నను మాకు సంతోషమే? ఏమంతమార్పు—! మీరు నాభర్తలు నేను మీభార్యను - హీ! హీ! హీ! ఆడమగలు, మగయిల్లాలు! బలే! ఇదే బాగుగానున్నది—

అంబిక—ఇదే బాగుగానున్నది—అవునా! చెల్లెలా!

అంబా—అవు నక్కయ్యా!

విచి—వీవనలఁగొని నాకు మీరు విసరవలయును—

(వీవనలఁగొని యిరువు రొకరికొకరు విసురుకొనుచుందురు.)

సత్య—(అపవారించి) నాయనా! గాంగేయా! చూచుచుంటివా! వీరి దాంపత్య మెంత నిష్పచ్ఛరముగా నున్నదో!

భీష్మ—అననుకూల దాంపత్యము—తమ్మునికి మతిగూడఁ బోయిన ట్లున్నది.

గీ. గేస్తులకు స్వర్గనరకముల్ ♦ క్షితితలంబు
నందయున్నవి యనుట త ♦ థ్యంబచూవె!
సకియ యనుకూలవతియైన ♦ స్వర్గపదవి
తరుణి యననుకూలయైన ♦ నరకసీమ.

విచి—మీరు నావలన క్షేమిసుఖము లందుచున్నారు?

అంబిక—మంత్రసాని సుఖము—అవునా చెల్లెలా!

అంబాలి—అవు నక్కయ్యా!

విచి—(దగ్గుచు) నారాయణ! నారాయణ!

భీష్మ—వీరి యవినయమువలన తమ్మునికి వ్యాధియు, మనోవ్యాధియు నధికము లగుచున్నవి.

సత్య—నాయనా! ఇంక వీఁడు బ్రదుకుటయు దుర్లభమనియే నా యుద్దేశము— నాతండ్రీ! కురువంశరక్షణమునకు నీకృపాభిక్ష నభిలషించుచుంటిని....... నాదుఃఖనాదమునకుఁ జెవినిమ్ము. దేవవ్రతుండవగు నీపవిత్రహృదయము నెఱుంగలేక నాతండ్రి స్వార్థపరత్వమున నీజీవితము నిస్సారమొనరించి,—

భీష్మ—అమ్మా! అకారణముగ తాతయ్యగారిని మీరేల నిందింతురు? నాజీవితము నిస్సారమైన దనుమాట కేవలభ్రాంతి మూలకము చూడుఁడు—

సీ. పాపసంసార సం ♦ బంధబంధము రోసి
స్వేచ్ఛమై నరుఁడు జీ ♦ వింపఁదగదె?
అవని నశాశ్వతం ♦ బైన సౌఖ్యమునూని
చిరతరానంద మా ♦ సింపఁడగదె?
జాయాసుతాది సం ♦ సర్గదోషము నీఁగి
బ్రహ్మచర్యావా ప్తిఁ ♦ బడయఁదగదె?
ఇహమె స్వర్గంబని ♦ యెడి దురేచ్ఛనడంచి
పరమునకై పాటు ♦ వడుటదగదె?

ఆ. వె. ప్రకృతిబాహుయుగళ • పరిరంభణమునుండి
వెడలి హృదయమున వి • వేకగతుల
హరిని గొలుచుకన్న • నానందజీవన
విధముగలదె తల్లి ! • విశ్వమందు—?

సత్య—నాతండ్రీ ! నీవివేక బాలభానుమరీచుల యెదుట మాయజ్ఞానాంధకారము పటాపంచలగుచున్నది. కాని, బాబూ ! నీవు వివాహమాడిన వంశమునిలుచుటకు—

భీష్మ—అమ్మా ! నాదృఢవ్రతమును మీమాటలచేఁ జెదరఁగొట్టి సంసారపంకావృతమగు మహాకూపములోనికి మాత్రము నన్ను లాగవలదు. వినియుండరా మీరు నాదృఢప్రతిజ్ఞను.

( పాట 18)

ఉ. నశ్వరమై నిసర్గఫల • నాశనమౌ నిహసౌఖ్యవృత్తికై
శాశ్వతమైన సత్యమున • సంగతమౌక్రియఁ ద్రోసిపుచ్చి యీ
విశ్వమునందు హీనుఁడను • పేరు భరింపఁగఁజాల నమ్మరో !
విశ్వజన ప్రమోదకర • వృత్తి వహించెద బ్రహ్మచారినై.

అదిగాక—తల్లీ !

గీ. మూఁడువంతుల ప్రాయమ్ము • ముగిసిపోయె
జరుగుచున్నది నాల్గవ • జాము— నెందుఁ
గలదె ? సాంధ్యవేళను మేలు • కొలుపుపాట
తెల్లగడ్డంపు పెండిలి • చెల్లునమ్మ !

సత్య—నాయనా! పోనిమ్ము-వంశమునిలుచు నుపాయమైన నాలోచింపుము. ధర్మసంతానము వంశము నిలుపఁగూడదా ?

భీష్మ—వ్యాసభగవానునితో నాలోచింతును. మీరు చింతఁదక్కియుండుఁడు. (నిష్క్రమించుచున్నాఁడు.)

విచి—అంబికా ! అంబాలికా ! అయ్యో ! నాకాళ్ళు తీపులెత్తుచున్నవి. —

అంబిక — చెల్లెలా! నాకాళ్ళు తీపులెత్తుచున్నవి (కూలఁబడి) ఈబాధ నపనయించువా రెవరు ?

అంబాలి — అక్కయ్యా ! నాకాళ్ళు తీపులెత్తుచున్నవి. (కూలఁబడి) ఈబాధ నపనయించువా రెవరు ? ఓసురలారా ! నరులారా ! కిన్నరులారా ! రండు. రండు. మమ్ము రక్షింపుఁడు.

విచి — అబ్బబ్బ ! బాధ బాధ - (ఏడ్చుచున్నాఁడు.)

అంబిక — అంబాలిక — (అబ్బబ్బ ! బాధ — బాధ - (ఏడ్చుచున్నారు.)

(సత్యవతి యాశ్చర్యముతో, జూచుచుండును )

(తెర వ్రాలును.)

౨. దృశ్యము.

ప్రదేశము — సభామంటపమునకు ముందు.

ప్రవేశము — దాశరాజు.

దాశ — జయా ! సిరిసిరి రాజాదిరాజా ! ఇద్దారకు చేపలరాజా యిగమీాన కురురాజ్జెంమా రాజా! దాశరాజా ! జయా అనండిరా ! మీాగొంతులుగొయ్య ! అనండిరా !

భటుఁడు — (ప్రవేశించి) ఓయ్ ! పిచ్చాసుపత్రికి బోయేత్రోవ అది. ఇది రాజసభకు బోయేమార్గము. నడు. నడు.

దాశ — ఎవడ్రానువ్వు ? ఇసుకదొంతుకులాగ నెత్తిమీానకళ్ళా, మట్టగడసలాగ మూడుమొగము నువ్వూ, నడునడు అంటున్నావే ! మరేద సూడ్నక్కఅలేదా ?

భటు — నీమొగానికి మర్యాదా ?

దాశ — అలాగంటా వేంటిరా ? నా మొగం గరానగల్లా మొగంలాగ లేదా ? నీమొగంలాగ నిద్రొయిలేచిన తెల్లమొగంలాగ వుందా ?

భటు — ఏడ్చినావు. నడునడు. — అట్టు మాడిపోతుంది.

దాశ — నీతా త్రశంగాదురో ! నా నోరనుకుంటుండావో ? శంతను మారాజు మావని — సత్తొతి తండ్రిని — యిచిత్రియీరుకీ తాతని. ఇగమీన కురురాజ్జానికిరాజుని. దాశరాజుని.

భటు — దాశరాజువా ? అబద్ధము — దాశరాజు ఇల్లాలితో యిబ్బంది పడలేక సముద్రములోపడి చచ్చాడని నాచిన్నతనంలో మా అవ్వ చెప్పేది -

దాశ — ఇల్లాల్తో యిబ్బందిపడలేక అని యాచ్చేపిత్తుండావా ? పసి తనంలో బల్లోపంతుల్తోటి వుసకితనంలో యింట్లో యిల్లా ల్తోటి దెబ్బలుతినని మొనగా డోడంటా ! అది కొట్టినమాట నిజం - యేగలేక నేను శాపలొ ర్తకానికని వంకెట్టుకొని మం తిరితో గలిచి, ఓడెక్కి సవుద్రంమీన యితర దేశాల కెల్లింది నిజం. తుపానొచ్చి వోడ మునిగింది నిజం. —

భటు — నీవెట్లా బ్రిదికావు ? నీమంత్రీడి ?

దాశ — ఓడతో డింకగొట్టాడు. - యీతలో కొట్టుమీను శాపలాగ యీదేవాడ్ని కామట్టి యీదియీది యీవలబడ్డాను. ఆదే దోదేశం — అక్కణ్ణుంచి మనమనుసుల్లోకి వచ్చేరకే యేబై యేళ్ళుపైన అయింది. - ఆలిమీద అలగడంవల్ల యింత కొంప మునిగిందని రాణీకాళ్ళయిన బట్టుకొని రాజీపడదామని ఎదికి ఎదికి యీదేశాని కొచ్చేసరికి, రాణీ రాళ్ళల్లోగలిచింది. చేప లపల్లె చెట్లల్లో గలిచింది. — కూతురింటి కొద్దామని బయల్దే రాను. దార్లోకూతురుకొడుకు సచ్చాడని తెలిచింది . కొడుకు పోవడంచేత యేడుస్తూ రాజ్జెకారం నడుపుకోలేక నాబిడ్డమెంత కట్టపడుతుందో ఆరాజ్జెకారం నాబుజాన యేసుకొందామని

మరింత తొందరగా యీడికి పరుగెత్తుకొని వచ్చాను-కూతు రిల్లుగదా అని వచ్చిందుకు యీడ యింతమరేద జరిగింది— చెడి కూతురింటికి వచ్చేవాణ్ణి చెప్పెట్టి కొట్టాలి.

భటు—రాజ్యభారము వహించడానికి నీవెందుకు? ఆవిచిత్రవీర్య మహారాజునకు కొడుకులు మనుమలు—

దాశ—యిచిత్రయీరుడికి కొడుకులూ! ఆచయదగ్గునాయాలకు సంతెలాగలిగింది? బదికుండంగానే పుట్టారా! చచ్చినాక పుట్టారా?

భటు—(మెల్లఁగా) నీమనుమడి భార్యలు వ్యాసభగవానుని యనుగ్రమువల్ల వంశము నిల్పారు.

దాశ—హో! సస్తిని—సస్తిని. మగడు సచ్చినాక సంతుగనేకులం యేకులం మారుమనంకులం—యెక్కువోళ్ళి యెవారం యిలా గుఁటుంది-యీళ్ళతో చమందంచేసినోళ్లకు కులంలేదు అయితే ఆయిచిత్రయీరుకి కొడుకులు గూడ కొడుకుల్నిగన్నారు-

భటు—ఒకాయన నూర్గురుని-రెండోఆయన అయిదుగుర్ని-కని సచ్చాడు-

దాశ—ఆళ్ళుగూడ యిలాటివోళ్ళే అనుకుంటా!

భటు—అది యింకారహస్యం-ఉన్నదిలే. యిప్పుడు వాళ్ళు వీళ్ళు రాజ్యభాగాలకు జుట్టుజుట్టు పట్టుకోవడానికి సిద్ధపడుతున్నారు. వాళ్ళకు వీళ్ళకు రాయభారం జరుపుటకు శ్రీకృష్ణభగవానుఁడు వచ్చాడు. రాయభార రంగం జరుగబోతుంది—

దావ—ఉన్నదేదో సరిసమానంగా బంచుకోకుండా యెర్రినాయాళ్లెందుకు పోట్లాడాలి. అయితే యీళ్ళు నాకేమవుతారు. మనమడి మనమలన్నమాట—సరే; నేనెల్లి యీళ్ళచెంపలు వాయఁగొట్టి యీయవారం పరిస్కరిస్తాను.

భటు—ఆగు—ఆగు—ఏడకువెళ్తావు?

దాశ—రాచసబకు.

భటు—వీలులేదు. ఇప్పుడు రాజగు దుర్యోధనచక్రవర్తికి దమ్ముఁడగు

దుశ్శాసనులవారు "సత్యవతి బంధువులమని చాలమంది వచ్చి తేరతిండి తింటున్నారు. వాళ్లను వెళ్ళగొట్టడమే కాకుండా, యిగమీఁద ఆలాచెప్తూవచ్చేవాళ్లను కట్టివేసి పిచ్చాసుపత్రికి పంపమని ఆజ్ఞచేశారు. కాబట్టి నీవిప్పుడు పిచ్చాసుపత్రికి నడు.

దాశ — ఆరి పీడితస్సాగొయ్యా! ఏంచేత అలా ఆగ్న చేశాడు ?

భటు — తిండికి వృధావ్యయమని పైగా - చేపలవాళ్లు రాజకుటుంబానికి బంధువులమని వస్తే అవమానం అని -

దాశ — అవమానమా! సీ! సీ! కాపలోళ్ళపిల్లనిచేసుకోవడం, దానికి పిల్లల్ని గనడం, ఆళ్లకు పుట్టడం, అవమానంగాదు— ఆళ్ల బందుగులుగావడం అవమానం - సీ! సీ! యెక్కువోళ్లకు పిల్లనివ్వడంకంటె యేట్లోబడేయటం మంచిది. ఏదో జబ్బుకుందామని తలకుమించిన చమందం చేత్తే— ఆఖరుకు గలిగేలాభం అంతా యింతే! ఆ! అంతే! ఏమంటావు?

భటు — ఆ! అంతే!

దాశ — ఎక్కువోళ్ళతో చమందం చేయనేకూడదు . చేస్తే ఆళ్ళయింటివంక రానేగూడదు. అందుట్లో చెడి అచలే రాగూడదు చెడి కూతురింటికి వచ్చిందానికన్న— జోలెగట్టుకొని అడుక్కు తింటే మంచిది. ఆ! అంతే!

భటు — అంతే! (నిష్క్రమింతురు.)

--:o:--

## 3 దృశ్యము.

(ప్రదేశము — రాజసభామండపము)

(ప్రవేశము — ధృతరాష్ట్ర విదురులు, భీష్మద్రోణులు, దుష్టచతుష్టయము, మునులు, శ్రీకృష్ణుఁడు.)

శ్రీకృ — బావా! దుర్యోధనా! పాండవులు పైతృకంబగు రాజ్యభాగమును నిన్నడుగుటకు నన్నఁబుత్తెంచిరి. వారు నీపంపున

బం్రడెండేం డ్లరణ్యావాసమును, ఒకయేc డజ్ఞాతవాసమును గావించి తిరిగివచ్చి తమ యర్ధరాజ్యము నపేక్షించుచున్నారు.

దుశ్శా—అజ్ఞాతవాసము పూర్తిగాకపూర్వమే ఫల్గునుc డుత్తరగో్రగ హణంబున మాకంటcబడి, సమయభంగము గావించి తన వ్రేలితోc దనకన్నే పొడుచుకొన్నాcడు.

శకుని—కావునc దిరిగి ద్వాదశవర్షములు అరణ్యావాసమును, ఒక సంవత్సర మజ్ఞాతవాసమును గావించి బ్రిదికివచ్చినయెడల, అప్పుడు పాలొసంగుటకు రారాజు సందేహింపcడు.

భీష్మ—దుశ్శాసనా! అర్జునుc డుత్తరగో్రగహణంబున మనకంటc బడిననాటికే అజ్ఞాతవాసవత్సరము సరిగాc బూర్తియైనది.

దుశ్శా—ఔరా! పాండవపక్షపాతము!

భీష్మ—కాదు. ధర్మపక్షపాతము.

దుర్యో—సోదరా! నీవు మిన్నకుండుము— శ్రీకృష్ణా! పైతృకంబగు రాజ్యభాగమేమి? విచిత్రవీర్యాత్మజులలో నాతండ్రి ధృత రాష్ట్రుcడే పెద్దవాcడు. రాజ్యార్హుc డగ్రజుcడే! తమ్మునికి భాగమెక్కడిది? అతనికిలేని భాగ మతని సుతులకెక్కడిది? నీవెఱుcగని క్షత్రియధర్మ మేమున్నది?

భీష్మ—క్షత్రియధర్మ మాలోచించిన జాత్యంధుcడు రాజ్యార్హుcడే గాcడు -పాండురాజే—

దుర్యో—పాండురాజే యంగీకరించి నాతండ్రిని సింహాసనమెక్కించి తాను భృత్యుcడై మెలంగినాcడు— అప్పుడు కురుపితామ హులుగూడ నొప్పుకొన్నారు.

భీష్మ—సుయోధనా! అయిన రాజ్యానర్హుcడగు పుట్టుగ్రుడ్డిని నీ తండ్రిని సామ్రాజ్యంబున రాజుగావించిన, ఆపాండురాజునంద నులయెడ నీవు చూపవలసిన యాదరణయాయిది? ఇదియా క్షత్రియధర్మము?

కర్ణు—క్షత్రియధర్మము సంగరమొనర్చి రాజ్యముఁ గైకొనుటయే గాని లేనిభాగమునకు న్యాయబారము లంపుటగాదు.

దుర్యో—అవును.

శ్రీకృ—ఓదుర్యోధనా !

శా. శాంతింగోరినవారు వారగుటచే ♦ సంధింప నన్నంపినా
రంతేగాని సమిద్విహారమున కా ♦ వంతేనియుఁ జంక రా
కుంతీనందన శౌర్యసాహసములున్ ♦ గోదండపాండిత్యముల్
పంతంబుల్ వచియింప నేటి కవి వి ♦ శ్వక్షోణి విఖ్యాతముల్

దుర్యో—శ్రీకృష్ణా ! స్తోత్రపాఠములు చాలింపుము, వారు వీరులైనచో యుద్ధముచేసియే కురురాజ్యసింహాసనము నాక్రమింతురుగాక !

శా. ఏకచ్ఛత్రముగాఁగ నేలవలె వా ♦ రేగాని నేఁగాని, యంతేకానీ ! యొకరెట్లువాఁడొనినఁ గా ♦ నీ ! భాగమేనిత్తునే ?
నాకున్ భీతియె? వారిశౌర్యముల నె ♦ న్నన్, రాలునే గాలికిం
తాకుల్? మాధవ! కట్టిపెట్టుము తదీ ♦ య స్తోత్రవాక్యావళుల్ ॥

శ్రీకృ—గాంధారీనందనా ! దుర్యోధనా ! అర్ధభాగమీయ నిచ్చగింపకున్న నయిదూళ్ళయిన నిమ్మని వారడుగుచున్నారు.

దుర్యో—బిచ్చము ? కాని యిది యపాత్రదానమే ?

ఉ. ఆయతపాండితీనిలయు ♦ లంచు నొసంగనా ? వేదధర్మముల్
వాయక భూసురుల్ మెలఁగు ♦ పాత్రులటంచును నిత్తునో? జగ
ద్దేయ కవిప్రములం చిడనో ♦ దీను లనాథలటం చొసంగనో?
దాయల కేమి? యూళ్ళయిగు ♦ దానము సేయుట యేమి? కేశవా!

శ్రీకృ—సుయోధనా! నీవు దాతవుగానక్కఱలేదు దానము సేయనక్కఱలేదు- ఇప్పుడు కురురాజ్యమునకు నీవు పాలకుండవై యుంటివి గనుక న్యాయము సేయుము ఈరాజ్యమునం జాలభాగము పాండురాజ భుజబలార్జితము—వారాతనిపుత్త్రులు. అయిదూళుమాత్రమిమ్ము.

శకుని — అయిదుదూళ్ళిచ్చినను అర్ధరాజ్యమిచ్చినను పాలుపంచియి చ్చుటయే! ఇది దానమని యెవరును సంస్తుతింపరు.

శ్రీకృ — పాలుపంచియిచ్చుటయే కానిమ్ము—దాన మీకు సత్కీర్తియే గాని దుష్కీర్తిగలుగదు.

దుర్యో — తప్పక కలుగును.

శ్రీకృ — ఏమని?

దుర్యో — వారితో యుద్ధముసేయుటకు జంకి కౌరవు లీవిధముఁగ పాలు పంచియిచ్చిరని.

శ్రీకృ — అయిన నీవిందుల కంగీకరింపవా!

దుర్యో — ముమ్మాటికి

శకుని — వేయిసార్లకు

దుశ్శా — లక్షసార్లకు

భీష్మ — నాయనా! దుర్యోధనా! దుర్మానము దుర్గశామూలము. అధర్మమునకన్న ధర్మము బలీయము - అధర్మోపహతుండవై ధర్మమూర్తులగు పాండవులతో వైరము పెట్టుకొనకుము.

గీ. హితవెఱిఁగి వారిభాగమీ ♦ వేయవేని
సమరమగు, ప్రజాసౌఖ్యమ్ము ♦ సమసిపోవు
విప్లవము దేశమందు నా ♦ విర్భవించు,
ప్రబలరక్తప్రవాహముల్ ♦ పాఱునయ్య!

మహావీరులగు వారితో నీవు కలసియున్న మిమ్ము దేవనాథున కైనఁ దేఱిచూడ నశక్యము— అధికారమ్మున నుండుటంజేసి పెక్కుయోధులు నీకు సహాయులున్నను వారిది ధర్మపక్షమగు టంజేసి వారికి సాయముసేయువారుండకపోరు. యుద్ధము తప్పక జరుగును. జయాపజయమ్ములమాట యటులుండ నిరు బలగమ్ముల ననేక శూరులు మరణించుట ధ్రువము-దాన దేశము నిర్వీర్యమై పరిపాలించు సమర్థులులేమి నంతఃకలహ

ములలోఁబడి తుట్టదుదకు బరాధీనమైపోవును- ఇట్టి దుష్కీర్తికి నీవు పాలుగాక వారిపాలు వారికొసంగుము.

దుర్యో—శుష్కోపన్యాసములకు సుయోధనుఁడు బెదరఁడు.

శకుని—సత్యము.

దుశ్శా—సత్యము.

శ్రీకృ—సత్యము— దుశ్శాసనా ! సత్యము.

గీ॥ కొడవలిని గడకుంగట్టి ♦ కొట్టఁగాక
చింతకాయలు రాలునే ♦ మంత్రములకు ?
పెనుగదాహతిఁ దొడవిఱ్ఱె ♦ గిననుగాక
సంధికొప్పునె దుర్మాన ♦ చక్రవర్తి !

దుర్యో—యాదవా! అనవసరప్రసంగము గావించుచున్నాఁడవు—

శ్రీకృ—అవసరమైన ప్రసంగమునే గావించెదను. వినుము. ఓరాజ రాజా !

సీ॥ పాండుపుత్త్రుల కీవు ♦ పాలొసంగవయేని
పాలువాకొనిమెద ♦ నాలకింపు!
సురనదీసంభవ ♦ గురుపుత్త్ర సైంధవ
కర్ణాది వీరులు ♦ కట్టిపాలు
చాపగురుండు దు ♦ ష్టద్యుమ్నుపాల్ నీకు
మారవర్గం బభి ♦ మన్యుపాలు
శకుని నీమామయ్య ♦ సహదేవుపాలు, న
కులుపాలు కర్ణుని ♦ కొడుకులెల్ల

గీ॥ నీదు సోదరశతముతో ♦ నీవు భీమ
సేనుగదపాలు, కురురాజ్య ♦ సింహపీఠి
మరకలేని కీర్తియును ధ ర్మజునిపాలు
తప్పదింతయుఁ దథ్యంబు ♦ ధరణినాథ !

దుర్యో—ఈజోస్య మెవరుగుణించినది ?

శకుని—త్రికాలవేది యాదవసింహము-

దుశ్శా—ఓహో! గొల్లలు జోస్యము సెప్పుచున్నారు. కలికాల మారంభమగుచున్నది కాఁబోలు—?

శ్రీకృ—ద్వాపరయుగమున నవనీభారమడఁగిన పిమ్మటఁగాని కలి యారంభముగానేరదు.

శకుని—స్వాములవా రందులకే జన్మించినవారఁటగాదా?

భీష్మ—సత్యము— అధిక్షేపించు నధమాధములుగూడ శీఘ్రకాలములో నాసంగతి నెఱుంగుదురు.

శకు—అంతపండుగదినమా యీకన్నులకు?

భీష్మ—నీకన్నులకు పండుగదినము వచ్చుటకే కౌరవ పాండవ కలహ నాటకమునకు ద్యూతనాంది నారంభించితివి - కపట సూత్రధారి!

శకు—కపటసూత్రధారి శౌరికాఁబోలు నే!

దుర్యో—మాధవా! వేయిమాటలెందులకు? వారికి రాజ్యము గావలసియున్న యుద్ధముసేసి తీసికొనుఁడని చెప్పుము—ఇదియే నీసంధికిఁ బ్రత్యుత్తరము!

శ్రీకృ—ఓరాజరాజా! బాగుగా నాలోచించుకొనుము — తరువాతఁ జింతించిన లాభములేదు.

సీ. గాండీవి విల్లూని ♦ చండకాలుఁడువోలెఁ
జండత మిమ్మెల్లఁ ♦ జెండువేళ
భీముండు చలమూని ♦ పెనుగదం జేఁబూని
మృత్యువో యన ననిఁ ♦ బేర్చువేళ
గురువృద్ధ కులవృద్ధ ♦ పరమబాంధవకోటి
తెగి స్వర్గమున కరు ♦ దెంచువేళ
ద్విరదాశ్వరథ పదా ♦ తివ్రాతములు సంధు
లెడలి పెకాగుప్పలై ♦ పడెడువేళ
గీ. బీరముడివోవఁ, బ్రాణాశ ♦ నోరు నెత్తి
గొట్టుకొని యేరిపాదముల్ ♦ వట్టుకొన్న

సంధిసేయరారెవ, రిదె ♦ సంధికదను
బ్రదుకఁదలఁచినచో మీరు ♦ బావగారు !

ధృత—నాయనా! మాధవుని యుపదేశము మన్నింపుము.

దుర్యో—గోపాలా! నోరుమూసికొనుము. క్షత్త్రియునకు సంగర భయము, చేపకు నీటిభయము గలిగింప నీతరమా? వెడఁగు బెదరింపులుమాని వేగంబ యాపాండునందనులకడకుం జని వారితో నామాటలుగా నిట్లు వాకొనుము.

సీ. ఐదూళ్లుగాదు నే ♦ సూదిమోపినయంత
యిలనైన వారల ♦ కీయననుము
కన్నీళ్లుగార్చినఁ ♦ గాదు రక్తము గార్వ
లభ్యయగును రాజ్య ♦ లక్ష్మియనుము
క్షత్త్రియాన్వయులకు ♦ సంగరమ్మునఁ జావు
వచ్చిన లోకమ్ము ♦ మెచ్చుననుము
కవ్వడి భీముండు ♦ గావించుప్రతినలు
నెఱవేర్చుకొన నిదే ♦ తరుణమనుము
గీ. తనయసోదర మిత్త్రబాం ♦ ధవులతోడఁ
జచ్చుఁగాక దుర్యోధన ♦ చక్రవర్తి
జంకి యంగీకరింపఁడు ♦ సంధికనుము
వెట్టిరాయబారముమాని ♦ వేగఁజనుము.

శ్రీకృ—మూఢదుర్యోధనా!

దుర్యో—యాదవా! సుయోధను నెఱింగి మెలంగుము. అధికప్రసంగములు చాలింపుము.

శ్రీకృ—దుర్యోధనా! నీవును శ్రీకృష్ణు నెఱుంగుదువుగాక! నీకు వినాశకాలము సమీపించినది.

దుర్యో—దూతకనుచితములగు మాటలు మాటాడుచున్నాఁడవు. జాగ్రత! దుర్యోధనుఁడవమానమును సహింపఁడని తెలిసికొనుము.

శ్రీకృ—మూర్ఖుడా! నన్ను బెదరించుచుంటివా! శ్రీకృష్ణుఁడెవరికి భయపడువాఁడుకాఁడని నీవును దెలిసికొనుము.

దుర్యో—నిన్నిచ్చట బంధించిన నీపాండవులు నీకు దిక్కగుదురా ?

శ్రీకృ—అందఱకు దిక్కు నేనే? నాకొకరి దిక్కేల? నను బంధింతువా? ఓయీ! భక్తియను త్రాళ్లంగాక తక్కు త్రాళ్ల నీ శ్రీకృష్ణునెవ్వరును బంధింపనేరరు—అంతేకాదు! ఈశ్రీకృష్ణుని డాకాలి వ్రేలిగోరును స్పృశించుటకుఁగూడ మీకెవ్వరికిసాధ్యముగాదు.

(దుష్టచతుష్టయము సైఁగలుచేసికొని నిష్క్రమింతురు)
(అందఱు భయసంభ్రమములతోఁ జూచుచున్నారు.)

శ్రీకృ—ఎవ్వరును భయపడనక్కఱలేదు - దుష్టచతుష్టయము దురాలోచన సేయనిండు—

కురుపితామహా! గంగానందనా! అధర్మపక్షమును వీడి ధర్మపక్షమునఁ జేర నిన్ను నే నాహ్వానించుచున్నాఁడను.

భీష్మ—స్వామీ! సకలజగదంతర్యామి! నాహృదయము నెఱింగియు నన్నిట్లాహ్వానింతువా? దుర్యోధనుఁడిప్పుడు నాకు రాజు. నే నాతని సేవకుఁడను—

శ్రీకృ—దుర్యోధనుఁడు రాజా! అసత్యము—మాయసేసి యన్యాయముగ నితరుల రాజ్యభాగ మపహరించి సింహాసనమెక్కిన వాఁడు రేఁడుగాఁడు. దోపిడిగాఁడు అట్టివాని కెవ్వరుసాయము సేయనక్కఱలేదు - వానికెదురుదిరుగుట పాపముగానేరదు— మరి పురుషార్థము!

భీష్మ—మహాత్మా! నిఖిలధర్మవిదుఁడవు నీ వెఱుంగనిదేమి? కురుసింహాసనమునకీ శరీర మమ్ముడువోయినది— ఈసింహాసనము నేను బుద్ధిపూర్వకముగ జనకహితముకొఱకుఁ ద్యజించునప్పుడు దీని నెవరధిరోహింతురో వారికేను భృత్యుఁడనై యుందునని శపథము సేసియుంటిని. కావున దుర్యోధనుని విడిచి రాఁజాలను—కృష్ణస్వామీ!

గీ. ధరణిపాలన విడిచితిఁ ♦ దండ్రికొఱకు
పరిణయము విడిచితిని సో ♦ దరులకొఱకు
రక్తమును విడిచెదను రా ♦ రాజుకొఱకు
ప్రాణముల విడిచెదను ధ ♦ ర్మమ్ముకొఱకు.

శ్రీకృ—తథాస్తు. (లేచుచున్నాఁడు.)

(ప్రవేశము— దుష్టచతుష్టయము త్రాళ్ళతో)

దుర్యో—బంధింపుఁడు. కృష్ణుని బంధింపుఁడు.

శ్రీకృ—బంధింపుఁడు— ఊఁ—బంధింపుఁడు. మూఢదుర్యోధనా! వారు నిలువుగుడ్లువడి చూచుచున్నారు! సింహము మీఁదికి మేఁక పిల్లల నుసికొల్పిన నేమిలాభము? మత్తగజేంద్రమవు— నీవు రమ్ము. బంధింపుము.—బావా! బంధింపుము—

ఉ॥ కావరమూని దూతయను ♦ గారముమాని వృథాభిమానివై
కేవల మర్త్యుఁగాఁదలఁచి ♦ కృష్ణుని విష్ణునిఁ ద్రాటఁగట్టఁగా
భావమునందలంతె? మద ♦ వత్సరిఁ దామరతూఁటఁ గట్టెదే?
బావ! మహోగ్రవహ్ని వలు ♦ వ కొముడివైతువె? బుద్ధిశాలి వే?

(విశ్వరూప ప్రదర్శనము.)

తిలకింపుఁడు— నాభక్తులందఱికి దివ్యదృష్టి నొసంగితిని దిలకింపుఁడు!

(దుష్టచతుష్టయము పడిపోవును. తక్కినవారంద
ఱానందముతోఁజూతురు.)

(కొంచెముసేపు తెరవ్రాల్చి తిరిగి యెత్తవలెను)

దుర్యో—పక్షి యెగిరిపోయినది.

భీష్మ—మూఢదుర్యోధనా! నీప్రాణము లెగిరిపోకుండఁజూచుకొనుము. సంధిఁజేసికొనుట కింకను తరుణమున్నది— చూచితివిగదా శ్రీకృష్ణుని ప్రభావము.

దుర్యో—ప్రభావముగాదు, ఇంద్రజాలము.

శకుని—మహేంద్రజాలము.

దుశ్శా—నిక్కము.

శకుని—ఇందేమియు సంశయము లేదు.

దుర్యో—విజయమున నాసంశయము?

భీష్మ—ధర్మమునకా జయము సంశయము-సుయోధనా! "యతో ధర్మ స్తతః కృష్ణో యతః కృష్ణ స్తతో జయః".

దుర్యో—కురుపితామహా! మీకట్టినమ్మకమున్న పాండవులపక్షమున కలిగి జీవింపుఁడు.

భీష్మ—మూర్ఖుఁడా! నేను జీవములకు భయపడుదునా? స్వచ్ఛంద మరణుఁడనగుట నీ వెఱుఁగవా.

శకుని—కావుననే యీ యుద్ధమున సర్వసైన్యాధిపత్యమును మీకుఁ గట్ట దుర్యోధనుఁ డిచ్ఛగించుచున్నాఁడు దుర్యోధనసార్వభౌమా! అవునుగాదా?

దుర్యో—అంగీకరింతురా?

భీష్మ—అంగీకరింతును.

దుర్యో—తమ్ముఁడా! భీష్మాభిషేచనమునకుఁ బ్రయత్నము గావింపుము.

దుశ్శా—చిత్తము.　　　( తెరవ్రాలును. )

పంచమాంకము.

శ్రీ

# భీష్మబ్రహ్మచారి

## షష్ఠాంకము.

### దృశ్యము ౧.

[ప్రదేశము — పటకుటీరము.]

[ప్రవేశము — అర్ధరాత్రిగాన జపము చేయుచు భీష్ముఁడు.]

భీష్మ — (స్వగ) దీర్ఘసుమంగలి యగునట్లు దుర్యోధన పట్టమహిషి యగు భానుమతీదేవిని దీవింప సంకల్పించి, యిటకురమ్మని వార్తనంపితిని. గాని యింకను రాదయ్యెను; కారణము తెలియదు. పదిదినములనుండియు, రణముసల్పిన కారణమునఁ నాయవయవములన్నియును, విశ్రాంతిఁ గోరుచున్నవి. శ్రీకృష్ణుని యవతారమునకు సార్థకముగా భూభారమెంత చిత్రముగా వాయుచున్నదియో—

గీ॥ దేవదేవుఁడు, దేవకీ • దేవి గర్భ
జలధినుదయించె ; పాపనా • శనముకొఱకు ;
అట్లుగాదేని, తాను మా • ధ్యస్థమూని,
సదయుఁడై రాయబారము • సలుపుటేమి?
కౌరవులలోన, నొకఁడైనఁ • గాని యతని
బోధ వినకుండుటేమి ? యీ • భూమిభార
మణఁగుటకునయి ఘోరమౌ • నావహానమ్ము

జరుగు హేతువు ప్రభవిల్లు ♦ కొఱకుకాక
పాపమదిపండె; పుణ్యము ♦ బద్ధమయ్యె
కలియుగంపు చిహ్నంబులు ♦ గానవయ్యె
ధర్మసంస్థాపనముఁ జేయఁ ♦ దలఁచి, శౌరి
కాలసూత్రంబులను నెల్లఁ ♦ గలయఁగట్టి
ప్రకృతిరథమును, నడిపింపఁ ♦ బాలుపడియె
సకలజననాశ మిప్పటి ♦ సంగరమునఁ
దప్పదెటుగన్నఁ దత్త్వద ♦ ర్ధంబెతోఁచె
నడుపుచున్నాఁడు శౌరి ; పాం ♦ డవులనెల్ల
వీరులెంద రెందఱుచేరి, ♦ పెనఁగులాడి
యనియొనర్చిన ఫలము ర ♦ వంతయైనఁ
గలుగఁబోవదు; నిజము—శ్రీ ♦ కరముగాఁగ,
పాండుతనయులె యీధరా ♦ పాలనంబు
సేయఁగలవారు ; సంతత ♦ శ్రీనిధాను
లగుచు శ్రీహరి సత్కృపా ♦ హ్లాదులగుచు.

(తరువాత చేతనొక దివిటీగొని; రజక వేషమున దారిజూపు కృష్ణుఁడును, భానుమతి వేషమున ద్రౌపదియు ప్రవేశింతురు.)

కృష్ణ—మహారాణిగారికి మార్గము ఇటు—ఇటు—

ద్రౌప—పితామహా! నమస్కారము!

భీష్మ—(స్వగ) భానుమతికాఁబోలును వచ్చినది. నావలన కౌరవులకు జయలాభ మెట్లునుగలుగదు. కావున, నీమెపతికి జయముగల్గునట్లు దీవించెదఁగాక! పైన కాఁగలకార్య మెట్లుకానున్న నట్లగును. (ప్రకా) అమ్మా! నాకులాలంకారమా! వచ్చితివా! నాసమీపమున, నవనతశిరస్కవై నిలువఁబడుము. నిన్నుదీవింపఁ బిలువనంపితిని.

ద్రౌప—మహాప్రసాదము. (దగ్గఱ తలవంచి నిలువఁబడును.)

భీష్మ—(చేయి తలపై నిడి) సతీ! సౌభాగ్యవతీ!

గీ॥ సంక్షుభిత కురుపాండవ ♦ సంగరమున
హీనులై నీరిపులు నశి ♦ యింతు్రిగాత!
నీపతికి శత్రువిజయంబు ♦ నిశ్చయంబు
ఆమరణము సుమంగలి ♦ వగుదుగాక!

ద్రౌప — స్వామి! భాగ్యవతి నైతిని.

కృష్ణు — మహాత్మా! గంగానందన! నీ యాశీర్వచన మింతబలవత్తరం బైయుండ నీ భక్తులై—పౌత్రులైన పాండవులకుఁగాని వార లదారయగు నీ ద్రౌపదికిఁగాని కొఱంత యేమి?

భీష్మ — పాండవు లేమి? - ద్రౌపదియేమి? ఆశీర్వచన మేమి?

కృష్ణు — తమఃప్పుడను గ్రహించిన మహాదాశీర్వచనము ద్రౌపదికిఁగాని భానుమతికిఁగాదు.

భీష్మ — ఏమి? ఈ మేలిముసుంగుచాటునున్నది ద్రౌపదియా?

కృష్ణు — చిత్తము.

భీష్మ — భానుమతిరానేలేదా?

కృష్ణు — ఇప్పటికిరాలేదు.

భీష్మ — అట్లయిన చాకలివేషమునందున్న నీవు నల్లగొల్లండవేనా?

కృష్ణు — స్వామీ! బాలుని యపచారమును మన్నింపుము. సోదరీ! పాంచాలీ! తాతగారికి దయగలిగెను. ఇంకమనకీ వేషములేల?

(నిజాకృతింజూపును)

(ద్రౌప — మేలిముసుఁగుతీసి నమస్కరించును.)

భీష్మ — సుమంగలీభవ! అమ్మాయీ! లెమ్ము -(ఆలోచించి తల పరికించి) కాలవికృతికెవ్వరేమిచేయఁగలరు కృష్ణా! నీవంటి సర్వజ్ఞుడు తోడునీడయై పాండవులకు దారిఁజూపుచుండఁగా - నా యాశీర్వచనమునకు భానుమతియేల పాత్రురాలగును'— నీకృపచేతనే పాండవులు జయింపఁగలరని యెఱింగియు వెర్రి భ్రాంతిచే నేను భానుమతిని దీవింపతలచితిని నీవెఱుఁగనిదేమి

గలదు?—సర్వమును తారుమారైనది; పాండవులేజయింతురు. ఇంక నే నేమిపలుకఁగలను?——

కృష్ణు—పితామహా! కౌరవవిజయమున నీవెట్లును హతాశుఁడవైయుంటివిగదా! కావున నొకప్రశ్న కుత్తరమొసంగుము.

భీష్ము—కృష్ణస్వామీ! నీయాజ్ఞకన్యథాత్వముగల్గునా?

కృష్ణు—పది దినములనుండియు మిమ్ముజయించు పూనికఁ బాండవులు మిగులఁ బ్రయాసపడుచుండిరి. ఒక్కింత యుష్మన్మరణ రహస్యమెఱిఁగించితివేని కృతార్థులగుదురు.

భీష్ము—గోవింద ! ఇంక నామరణ రహస్యమును దాచినందువలన మాత్రమేమి ప్రయోజనము? నాజనకుననుగ్రహమున స్వేచ్ఛామరణమునందఁగల నేను భూపతితుఁడ నైనను నాయిచ్చవచ్చిన కాలంబునకే జీవన్ముక్తిగాంతును.

కృష్ణు—పోనిండు. తాము భూపతితులగు మార్గమైన దెలిపినఁజాలును;

భీష్ము నన్ను సాధింపఁదలఁచి చితాగ్నిం గూలిన కాశీరాజపుత్రికయగు నంబ యిప్పుడు జన్మాంతరమునంది పేఁడిరూపున శిఖండియై యున్నది. నాకు పేఁడిని కంటఁజూడనని వ్రతము—కావున నా శిఖండి నెదుటనుంచుకొని వెనుకనుండి శరప్రయోగమొనర్చిన నో నే నస్త్రసన్యాసము చేయుదును ఇదియే రహస్యము.

కృష్ణు—దేవా! పాండుసుతులు నీదయచే జయలక్ష్మి ననాయాసముగఁ జూరగొందురు

భీష్ము—జగద్రక్షకా! అఖిలాంతర్యామివగు నీవు నాకీమాట దక్కింపవలయునని నాచే ననిపించితివిగాని నీ వెఱుఁగని దేదిగలదు! అదిగాక స్వామీ!

గీ పాండుసుతరక్షణంబు నీ • పాణితలము
నందెయుండఁగ నాకృప • యిందుగలదె?
ధరణి నీరూపకపు సూత్ర • ధారివీవ
గాన నడిపింపుమయ్య నీ • కాంక్షకొలది.

కృష్ణు—మహాత్మా! ధన్యోస్మి! తిరిగి రేపు రణముఖంబున పార్థసారథినై శిఖండితోఁ గాన్పింతును.

(అందఱును నిష్క్రమింతురు.)

---

దృశ్యము.

ప్రదేశము—కురుక్షేత్ర సంగ్రామభూమి.

ప్రవేశము—ధనుర్ధరుఁడగు భీష్మ సేనాధిపతి.

(పాట. ౩.౧)

భీష్మ—ఓహో! సైనికులారా!

చ. మనపయిఁ గౌరవేశ్వరుఁడు ♦ మానము ప్రాణముఁడాచియుంచె; నీ
రణమున నెల్లవీరులుఁ బ ♦ రాక్రమ నైఖరి యొప్పఁగేల న
మ్మను ధనువుఁ వడింగొని య ♦ మోఘబలమ్మున సంగరమ్మొన
ర్చిన జయశీలుఁడౌను కురు ♦ శేఖరుఁడింతకలంచిపోరుఁడీ!

ఉ. గాజులు కేలఁదాల్చి రిపు ♦ కాండమువవ్వఁగ బారిపోకుఁడీ
మీజనయిత్రులన్ సుతస ♦ మేతలగా నొనరింపఁజూడుఁడీ
రాజితశౌర్యసంపద న ♦ రాతులు వెన్నులు జూపునట్టుల
వ్యాజధరేశభక్తియుతులై ♦ ఘటియింపుఁడు కీర్తిసంపదన్.

(తరువాత - కృష్ణార్జునులు రథస్థులై ప్రవేశము.)

అర్జు—బావా!

(అనుబంధము ౨౧.)

చ. ముదుకఁడుగాఁడితండు; రణ ♦ భూములఁగేవల గద్రమూర్తియై
సదమదమందఁజేయుఁ గలశాంబుధిఁ ♦ ద్రచ్చెడు మందరంబనన్
పదిదివసంబులయ్యె; నొక ♦ పట్టున శ్రాంతివహింపఁడీతఁడే
బ్రదికిన నేఁడు, రేపుమన ♦ వారిజయంబు నభఃప్రసూనమే.

కృష్ణు—అర్జునా! ఈదినంబున వెనుకటియట్లు మనకాందోళనంబుతోఁ బనిలేదుగదా! మనము భీష్మునెదుర్కొందమురమ్ము.

(ఇరువురును పరిక్రమింతురు.)

కృష్ణు—మహాత్మా! గంగానందన! అంతయుఁ దమయాశీర్వచన బలమే! పాండునందనుల నెట్లుగెలిపింతువో.

భీష్ము—కేశవా! బంధువాత్సల్యములు భండనానంతరమునఁగాని భండనమధ్యమునఁగాదు ఇప్పుడు మనము మనబలాబలంబులను ప్రదర్శించుకొనుటకే తగిన సమయముసుమా!

కృష్ణు—తమ యాలోచనము సమంజసంబైనది. పార్థా! పితామహుని యాజ్ఞానుసారము రణారంభము చేయుము.

అర్జు—తాతా! దేవవ్రతా!

గీ. బాలుఁడే సంగరమొనర్చె; ప్రథమమంచు
పౌత్రుడే చూపె తొలుదొల్త నాత్రమంచు
మాకు దుష్కీర్తిరానీక ప్రాకటముగ
ప్రథమమున మీరె శరపంక్తి వదలవలయు.

భీష్ము—ఫల్గునా! సంగ్రామధర్మమున కీశశభిష లక్కరలేదు. ఐనను నీవు కోరితివిగావున, నేనే తొలుత బాణములను విడిచెదను.

(శరములు వదలును.)

అర్జు—ఆర్య! ధన్యోస్మి! ఇంక నేనును రణారంభము చేయుదును.

(ఇద్దఱును యుద్ధము చేయుదురు.)

(అనుబంధము ౨౨.)

కృష్ణు—అర్జునా! అర్జునా! ఈభీష్ముని మహాసంగ్రామకౌశలము నాకు భరింపనశక్యమై యున్నది. అశ్వశరీరంబులందం గుప్త ప్రదేశమైన గాయముగాకుండ నుండలేదు. ఈడుమీరినివాఁడయ్యును నీతఁడు మధ్యందినమార్తాండ బింబంబుకైవడి వెలుఁగుచున్నవాఁడు, నీవింక నీతని నుపేక్షించిన మహాప్రమాదము కలుగఁగలదు నీవుపేక్షింతువేని నాసమయము భంగము

నకైన నోర్చి చక్రాయుధంబున నీ భీష్ముమస్తకంబును విధ్వస్తముగావింతును. (చక్రముధరించును.)

( పాట. 22. )

అర్జు—(అడ్డమువచ్చి) బావా! యదునందన!

శా. బావా! పావనభంగిసల్పఁదగు; శం ♦ భత్రోద్ధసంహారముల్
నీవారింపుము; పాండునందనసుతా ♦ నీకంబుఁగాపాడి మా
ప్రావీణ్యంబు యశంబు ధాత్రివికసిం ♦ పంజేయుదే నాఁగుమా
యీవేచక్రముఁదాల్ప నిల్వఁగలవే ♦ యీరేడులోకంబులున్.

బావా! యదునందనా! శాంతముఁదాల్పుము—పిన్నవాఁడనగు నాప్రార్థనంబాలకించి మన్నింపుము సర్వక్రియాశక్తిస్వరూపుఁడవగు నీవే లోకసంహారమొనరింప సముద్యోగించిన నీరణమేల ? ఈ మారణమేల ? మాకీ ప్రేక్షణమేల ? కన్నుమూసినంతమాత్రమున లోకవిలయంబాపాదింపఁజాలవే! శ్రీకృష్ణా! నీబావమఱఁదులు వీరులను మహాశయంబును నిలుపుట నీకవశ్యాచరణీయ కార్యంబుగాదే ! జనార్దనా! రమ్ము—రథావరోహణంబుగావింపుము; నీకివే పునఃపునఃప్రణామంబులు.

కృష్ణ—ధనంజయా! ఇప్పుడు నన్నువారింపకుము; ఈవృద్ధవీరుని నిశితశరప్రకాండంబులచే నాశరీరము శతధాసంక్షతంబయ్యె— ఇంకనీతని రణప్రాగల్భ్యంబు నాకు దుస్సహము; రక్తప్రవాహసంకులంబై కాయమెల్ల గాయములపాలయ్యె; మెంతని యోర్తును! రణమధ్యంబునఁ జక్రంబుదాల్చితినను దుర్యశంబునకు నేను పాలైనను సమ్మతమే-దారివిడువుము.

అర్జు—బావా! శాంతింపవా! నామాటవినవా?

భీష్మ—అర్జునా! ఏలవారించెదవు! జగన్నాథునకిఁ నాపైననుగ్రహంబుగలిగెను; రానిమ్ము...... తచ్చక్రాగ్నిలజ్వాలలచే నాకంఠమును లుంఠనము గావింపనిమ్ము...... శ్రీకృష్ణా ! ఆర్త

శ్రీకృష్ణుఁడు చక్రముఁదాల్చి భీష్మునిపై కురుకబోవుచుండ నర్జునుఁడు వారించుట.



"శ్రీకృష్ణా, ఆర్తశరణ్యా నన్ను వధింపరమ్మ."

శరణ్యా! మహానుభావా! సకలలోకారాధ్యుండవగు నీచె యిట్టి యుపక్రమంబులన సాహసింపఁజాలువాఁ డెవ్వఁడు?

(అనుబంధము ౨౩.)

జగతీరంగము నీనాట్యరంగము. సకలప్రాణిసముదాయంబును భవల్లీలారూపకంబు నందలి పాత్రంబులు. హేకృష్ణా! నన్ను వధింపరమ్మా. యుష్మచ్చక్రాయుధానలజ్వాలలం దాహుతిగా నున్న మత్కంధరంపు భాగ్యమే భాగ్యము —

సీ॥ అంభోధరశ్యామ ♦ గంభీరకాంతి, ది
శాంతరంబులకు తే ♦ జంబునీయ
వనమాలలిరువంక ♦ ఘనవక్షదేశమం
దతిలోక మోహనా ♦ కృతి నొసంగ
పదునాల్గు జగముల ♦ భరియించు చిఱుబొజ్జ,
యుదరుపాటున ♦ నుంతకదలియాడ
అనిల సంచలితమై ♦ యంసప్రదేశంబు
పైనున్న పచ్చని ♦ పటముజాఱ
గీ॥ డినదలించి చక్రంబు ♦ కేలఁదాల్చి
నేఁడు గాంగేయువధియింతు; ♦ నిక్కఁగాతు
ననుచు, నభిముఖమైవచ్చు ♦ నప్రమేయ,
దివ్యతేజఃప్రపుంజంబు దిక్కునాకు॥

(నమస్కరించును.)

(పాట. 23.)

కృష్ణు—(శాంతినంది) శాంతనవ! భక్తవిధేయుండనగు నాహృదయతత్త్వంబు నెఱింగిన నీవు - బలవత్తరంబులగు భక్తిపాశంబులచే నన్నుఁ గట్టివేసితివి ఇంక నేను భక్తపరాధీనుండనైతిని. నిన్ను సంహరింపఁజాల. నీవచించిన తెఱంగుననే పాండవులకు విజయంబగుఁగాక!

భీష్మ—మహాత్మా! నీయభీష్టంబెట్లో యట్లుగావింపుఁడు.

(తెరలో)

ఓహోరి గాంగేయా! ఇప్పుడెందుఁబోయెదవు? నిలువుము. భార్గవరాముని జయించి నాఁడుదక్కితివిగాక— నాటి యంబ యే నేఁడు శిఖండియయ్యె. త్వత్ప్రాణహరణంబునకు సంసిద్ధనై యుంటిని.

భీష్మ—శ్రీకృష్ణ!—ఇదియెల్ల నేనెఱింగినవిషయమే! మరల నిప్పుడీ పేఁడి కీపిరత్వమేల? మరణింప నేనే స్వచ్ఛందముగ సంసిద్ధుఁడనై యుంటినిగదా!

కృష్ణు—ఔ నిది నిజమే! శిఖండీ! తొందరపడకు; భీష్మ మరణమునకు నీవే హేతువౌదువుగాక!

(తెరలో) మహాభాగ్యము.

భీష్మ—పార్థా! నీతో నింకొకమాట చెప్పవలసియున్నది.

అర్జు—పితామహా! సావధానమనస్కుఁడనైయున్నాను.

భీష్మ— గీ. నాదుజనకుని వరముచే ♦ నామనంబు
సమ్మతించినయపుడు పం ♦ చత్వమంద
తెరవునాకుగలిగె; నంత ♦ వఱకు బ్రదుక
నంపశయ్యనునాకుఁ గ ♦ ల్పింపుమయ్య॥

అర్జు—స్వామీ! అట్లేయొనర్చెదను.

(శిఖండి ప్రవేశము.)

భీష్మ—(శస్త్రసన్యాసముచేసి కన్నులుమూసి) గోపాలకృష్ణా! ఈ పేఁడిని చూడనోప! శీఘ్రముగ మాకార్యముదీర్చుకొని యీ శిఖండి నావలకంపివేయుఁడు.

శిఖం—శ్రీకృష్ణదేవా! నాకానతియేమి?

కృష్ణు—శిఖండీ! అధర్మయుద్ధంబని లోకంబువాకొనకుండ నర్జునున కెదుటిభాగంబునఁ గూర్చుండుము; నీవెనుకనుండి యర్జునుఁడు బాణములు వదలును.



భీష్ముని అంపశయ్య.

శిఖం—(అడ్డుచేయును.)

అర్జు—(బాణములువిడుచును. భీష్ముడు నేలపైబడును అర్జునుడు అంప శయ్యకల్పించును.)

భీష్మ—అర్జునా! దాహము దాహము.

అర్జు—తల్లీ! పాతాళ గంగాభవానీ

ఉ. ఆలములోనఁదాత భువ ♦ నైకధనుర్ధరుత్యాగి నీసుతుఁ
జాలిఁబొఱంగి శాతశర ♦ జాలము పాలొనరించినట్టి దు
శ్శీలుఁడనేమొగాన నినుఁ ♦ జేరఁగబిల్తు సహించి తల్లీ! పా
తాళసురాపగా! తనయు ♦ దప్పినిదీర్ప సముద్భవింపవే.

(బాణము వేయును.)

పాతాళగంగ ఊర్ధ్వధారయై భీష్ముని నోటియందుపడును.

కృష్ణ—మహాత్మా! కురుక్షేత్రసంగ్రామమునం దర్ధాంశము గడచి పోయినది మిగతకొంతయు మీదయచే సక్రమంబుగఁబూర్తి కాఁగలదు; తమకిప్పుడేమికావలయును?

భీష్మ—వృద్ధుండనగు నాకిప్పుడు లోకమంగళమునకన్నఁ గావలసిన దేమి? అట్లగుటకనుగ్రహింపుము.

కృష్ణ—తథాస్తు. (పాట. 24.)

(తెర వ్రాలును.)

షష్ఠాంకము సర్వమును

సంపూర్ణము.

శ్రీరస్తు.

# అనుబంధములు.

( ము. వెం. చె. కే. )

## ౧—గంగాశంతనులు డైలాగ్.

శం-తలిరుఁబోఁడి యీపసినిసువునుదయఁ, దలఁచి విడువు నినుఁ బ్రార్థింతున్|చలముమాని మనవినిగైకొమ్మా. చంపవలదుసుతు ముద్దులగుమ్మా! | తలనుదాల్పఁ దగినపూవుఁ, దగునె యగ్గివేయఁగా కలికి మానుమదిఁ జండితనంబున్, గసికరమున్ దలఁపనగున్ మనమున నీతనయుపయిన్ ॥తలి॥

గంగ-ఓమనోహరా! చాలున్ మీ, కుల్లమునన్ జింతల్ దవునే|నామనమ్మెఱిఁగి నన్నిటులాడన్ అ, న్యాయంబయ్యెడుఁగాదే, నేమాత్రము వాకొనవలెనే! మీ, రెఱుఁగరేమి భూమిపాల! సమయము॥త॥

## ౨—గంగ.

నానియమంబిదిగాదుసుమా, నన్నునిటులదూరకుమా' నరవర॥ నా॥ ఏనెదిసేసిన దానికి నోడఁబడె, దీవని నమ్మితి నమ్మితి నామెద మానసముననది మఱపునుగొనినను, మానకదూఱుట మాన్యంబెటు, ప్రియ ॥నా॥

విడుతుసమయమని యెడఁదఁదలఁపకుమ, నుడివెద నాప్రతిన్ వినుమా, | బుడుతను నినువిడిచెద నాసమయము, విడువలోకములు దలక్రిందైనను ॥నా॥

## 3 - శంతనుఁడు.

కలికీ. కరుణింపు మన్నింపు, కసిగందునునీ, కన్నకుమారున్॥క॥ ధర "నపుత్రస్య గతిర్నాస్తి" యనుచున్, వరశాస్త్రంబుల్ కొనవా

వినమే । తరమే పుత్రహీనులకుఁ దాఁటఁ గురుతర భవసాగరముఁ దలఁపఁ ॥కలికీ॥

౪—శంతనుఁడు.

చాలుచాలు చాలుమదవతీ, జడమతీ, చటులఘోరగతి నిటు సలిపెదె ॥చాలు॥ నాతిగా నిఁక సృజించిన యా, ధాతకుఁ లజ్జలేదే నిజముగ ॥చాల్॥

ఇట్టులోనరింప నీయెద మెట్టులొప్పెనే, హీనురాలా! దుర్మార్గురాలా! ఛీ! । కట్టిఁడితనమునఁ దనయులజంపెదు, కాంతలు ధరఁ గలరే కుమతీ ॥చాలు॥

౫—వ్యాసుఁడు.

హర! హర! హర! శర్వా మమ, హరకాల! గౌరీవర! ॥హర॥ కరటిచర్మచేల! నిర్భరకృపాలవాలా! యో, పరమభక్తపాలా! వాగ్వరనుత భవహర! భవహర ॥హర॥

లీలాహతదుష్టదనుజ. జాల. ప్రళయఖేలా, శివ । హాలాహల కాలకంఠ యభవ! త్రిపురహర! భవహర! ॥హర॥

౬—వ్యాసుఁడు.

స్వార్థమోహ దా, హముననుబడి చెడిపోకుమా, లోకార్థము మనుమా ॥స్వా॥ వ్యర్థమగునుజుమ్మా సకలము పరమార్థమొక్కటే సిరంబుసుమ్మా ॥స్వా॥

౭—శంతనుఁడు.

ఇన్నాతిసోయగము, యీపాటిపరువము, ఎన్ననెవ్వరితరము సఖుఁడా అలల ॥ఇ॥ అయ్యారె! నారీ, ఔరా! యొయ్యారీ, ఇయ్యతి వనుబోలిన మదగజగామిను లిలఁగానరేరీ సఖుఁడా అలల ॥ఇ॥

౮—పాటలసంఖ్యలో ౫ దాశరాజు—నాకెంతోకోపం.

౯—భీష్ముఁడు.

హరి! రాధానాధా! ప్రభూ! కృష్ణా ॥హరి॥

హరి! రాధానాధా! వేణుగానలోలా ॥హ॥

జనకాజ్ఞఁదీర్చఁ,
ఘనజ్ఞానంబీరా ప్రభూ! కృష్ణా ॥హరి॥

౧౦—భీష్ముఁడు.

సత్యవతీ పితృపాదా! రాజా! సత్కరుణాలయా! కృపఁగనుమా సత్కరుణాలయా ॥స॥ సత్యవతిఁ భవదీయసుతనా, జనకునకిడు నీ మనమేతీర్తుఁ, జనకపదముసాక్షి, కృపగనుమా, జనకపదముసాక్షి॥స॥

౧౧—సత్యవతి.

ప్రాణనాథ! నన్నునిటులు వాసిపోయెదే ॥ప్రాణ॥
శ్రీనిధాన! నీదుచరణసేవ నాకిఁకెట్లబ్బెడు ॥ప్రాణ॥
నీదాసిని ననువీడియు, నీదిక్కునకీవేఁగెదె?
నీదిక్కునకీవేఁగిన, నేదిక్కిఁక నాకుఁగలదు ॥ప్రాణ॥

౧౨—దాశరాజు.

నా, కేసిసూశినా, నావాసిసూశినా,
నా,యేసాన్నిసూశినా, యేయింతి పైమడదూ ॥నా॥
మీసాన్నిసవరిచ్చి, రోసాన్నిసూయిచ్చి
కూసింతకనుగీటి, గుమ్మైపోవాలె ॥నా॥
ఇందరిలోపాల సందూరుడోలెను (అరెమంతిరీ)
ఎండిమొలతాడెట్టి, దండిపాగాసుట్టి
అందంసందంగలిగినేను, జౌసుమీర నిలుసుండీ
డాబుసరి శానాసేత్తే డంగైపోవాలి ॥నా॥

౧౩—మాధవి.

కనుసకియ, నృపసమితి, చనువుమీఱ ॥కన॥
వనరుహనేత్రుల, వారిజాక్షి ॥కన॥
ఈతఁడె మాగధుఁ, డీతఁడె సాళ్వుఁడు
ఈతఁడె వంగ మ, హీతలేశ్వరుఁడు ॥సకి॥

౧౪—దాశరాజురాణి డైలాగ్.

రాణి—పెల్లాడ మెల్లా(వురా, నీముఃండ మొయ్యి! ॥పెల్లా॥
పెల్లాడ మెల్లా(వ, పెల్లాన్ని దెచ్చావ?
రండీ! మీాయిద్దరికి పిండొంటలెడ్తాను ॥పెల్లా॥

దాశ—ఛీ! లేదె! పెల్లాడిన నాయెంటరాదె? మనమంతిరి నడుగరాదె,
నేనాడకనలు పోలేదే,

రాణి ఔ!లేరా! నేనంతవెఱుగుదుపోరా! నీ
వైనచెప్ప వేమీారా! మీాయిద్దరి తిత్తోలుస్తారా !
పెద్దపీటమీాన యిద్దర్నీ గూసుండమెడ్తా, మంచివాటమైన పోర
కట్టు చేతనుబట్టా, పెద్దబొబ్బట్లు, మంచిలడ్డూలు, నేతిగారెలు,
పందారబూరెలు,
అన్నింటిమెడ్తా, ఆనందమెడ్తా,
ఇద్దరిజుట్టుముడేట్టి యీాడ్సీడ్సికొడ్తా ॥పెల్లాడ॥

౧౫—అంబ.

హా! సాళ్వరాజా! యీావిధమున న, న్నాడుటన్యాయమే ॥హా॥
నీసమేనీ, దోసమెఱుఁగని నీచరణదాసిని నీవయయో ॥సా॥
మదీయమానస మెఱుఁగగలిగి తా, మసంపడ పాడియే, హృ
దీశ, నాయెడ, నింకనైన నెంచవేకృప, యేల వేసను ॥సాళ్వ॥

౧౬—అంబ.

సదయా! వరింపరాదా, వాదా ॥సద॥
(వర) మదనసదృశతేజా! రాజా మదనసదృశతేజా! రాజా!
మదనసదృశతేజా, మదనసదృశతేజా ॥సదయా॥
గతిలేని సతికయో,
ధృతిశరణమిడుట తగదే, యాహా॥ శర॥ శర॥ సద॥
మతిలోన కరుణలేదో, సతిప్రోవధర్మమానో, కాదో!
ప్రోవధర్మమానో, కాదో, ప్రో, కాదో, ప్రోవధర్మమానను, ప్రో॥
ధర! నిన్నుఁ వేఁడెదఁ గాంతా! హా

ధర్మరతా! ధీరోదారా! ధర్మరతా! ధీరోదార!
ధర్మరతా! ధీరోదారా! ధర్మరతా, ధీరా, ధ॥ ధీరా॥ సదయా

౧౭—అంబ

చెడుగతినేఁబడితినే, స్త్రీత్వము గోల్పడితినే ॥చె॥
ఈపరిభవం బేగతిదీరుఁ, ఈజన్మంబిఁక నెటు గడతేరు ॥చెడు॥
ఓగుణభవనా! ఓజగదవనా!
నాగతి, కానక నవయుటయేనా ॥చెడు॥

౧౮—భీష్ముఁడు.

నమస్కృతులయ్య దేవా! సద్గురూ ।నమ।
శమదమ గుణములు, శస్త్రాస్త్రవిద్యలు॥
తమకడనేర్చిన త్వత్పదదాసు ।నమ।

౧౯—అంబ

సుజన గణావనా శౌరీ!
సుమనోహారీ! యరిజన భీషణ ॥సుజన॥
ఉరుకృపావసతి స్మరనిభాకృతీ
విశ్వలోకపతి శాశ్వత సుకృతీ
విదళితాఘతతి, వినుతామరపతీ ॥సు॥

౨౦ సత్యవతి

ఎంతటి దోషముసంఘటిల్లె తుద కెంతటి దుష్ప్రాప్తముగలిగె నకట ॥ యెం ॥ ఇంతటి పాపంబెటులువోవునో; యెటుల మద్వంశమున కెసఁగునో శుభం ॥ బెం ॥ హా! యీశ్వరా! నాదుసంతతి, కధోగతి నీగతిగూర్చితే ప్రభూ! న్యాయమనక యయ్యో యీ బాలునిసయితము గడురోగమునఁద్రోతే। సంశ్రితాళిబంధూ, గుణ సింధూ! శాశ్వతకీర్తి సదమలమూర్తి ॥ ఎంత ॥

౨౧ శ్రీ కృష్ణుఁడు.

సురేంద్రనందన! నను విడుమిదెయా, దురాత్ముభీష్మునిశిరమునఁద్రుంచెద భరింపశక్యముగాదన్నడిగా, స్ఫురచ్ఛాంతనవ ఘోరశరంబుల్

తరంబె నీను బోంట్లకుఁ గెలువ నాపరాక్రమాఢ్యుని దురంబునందుఁ సు ||
గాంగేయుఁ దొలుతఁ జంపి పిదపఁ ఖండించెదఁ గురురాట్సైన్యంబుఁ
కరగత మొనరుతుఁ గురుకుల రాజ్యము గైకొను ధర్మజునకు నునిక్కముగ
||సు||

౨౨ అర్జునుఁడు

మనవి వినుమ నీవే చక్రముఁగొన, మాధవ! యేసరులాజిని నిల్చెదగు,
ఏగతిని గెల్చెదరు ||మ||
నీతులు సెప్పితి, గీతలు పల్కితి, నీవె కలనికి నను బురిగొల్పితి
ఏతటి ధర్మంబెల్ల బోవిడి, యిటుకడుకనలునఁ జక్రము పట్టెదెసు||

౨౩ — భీష్ముఁడు

నీనిరుపమాన చక్రాహతిఁ నాశిరమ్ము ద్రుంచరా
నిర్మలా, నిశ్చలా, నిర్వికల్పా ||నీ||
కన్నుదోయి యానందబాష్పములు, గార్చుచుండఁగా
జిహ్వ కృష్ణకృష్ణాయనఁ నా,శిరమ్ము నీదు పాదముల బడవలెఁ
వైరిభీషణా, సాధుపోషణా! మంజుభాషణా! నీ

౨౪ భీష్ముఁడు

నీమాయఁగన నెవరివశము రా, నిఖిలసృష్టిస్థితివిలయ కారణా నీ
మాయామేయము ప్రపంచము, మాయ నీ మలీలా వికారము
మాయఁ జిక్కి మాదృశుల మాధ్యమును మాయ సేయుమటు
మాయల కాఁడా; నీమా.

# పాటలు

(గ్రంథకర్తగారివి.)

## 1. శంతనుఁడు.

సురట—త్రితాల్.

ఓపుత్రప్రాణహారిణీ! ఓ! హా! ఖలకార్య ప్రచారిణీ ॥ఓపు॥—
భువన కంటకీ నీమూలమున, పుత్రసప్తకము గోలుపోయితిని
యవనీతిని నిన్నుగౌరవించెద నటవే కుటిలాత్మక దురాశయా ॥ఓ॥
అవనిని పశుపక్ష్యాది జంతువుల కైనను సంతతిపై బ్రీతిగల్గు,
బ్రకృతి విపరీతగుణంబు గల్గిన పాపినీ నిన్నుఁ కేమందునోక్రో ॥ఓ॥

## 2. గంగ & శంతనుఁడు.

డైలాగు. మోహన—దాద్రా

శంత—దురితమే, దురితమే, పరమ కఠినమానసయిది ॥దురి॥—
నరులకిటుల సలుపదగదు నరాశనగుణంబుమాను...............
గంగ.........పలుకవలదు - మమతచనదు కులము నిలువబోలదూ
శంత॥ (ఆది) హరిహరి యిది సుకృతంబా,
గంగ॥.......................నాకదియే ఘనసుకృతంబా॥
శంత॥....................విడనుసుతుని,
గంగ॥........................విడిచెదనినూ,
శంత॥..........................ఇంత పంతమేటికి ॥దురి॥

## 3. గంగ—

హిందోల్—ఆది.

దురాశన్ మదిని విడువుము శంతనూ ॥దు॥
నిరాశన్ గొనుము విమలచింతనా ॥దు॥
తనయులపై గాంక్షాత్ముఁడవైనను మనముననాపై

మమతవిడువుమా చని మెద నానందమున సు
రపురికి మనందగును నీవని సుతున్ తో ॥దు॥

4. శంతనుడు

సురట —(దా|దా)

వారేమొయ్యారి యామదవతి ॥వారే॥
నీరే జంబులగేరెడు నిర్మల నయనముల సొబగు కారు
ణ్యము దోపఁజేయు కమల నిభంబగు వదనము ॥వా॥
భువికిది గుతటితాడ్రంతియొ తనువుగనిన సౌందర్యమొ
మరల జననమునుగాంచిన సురాపగయొ సురాంగనయొ॥వా॥

6. దాశరాజు—బ్యాగ్ — త్రితాల్.

నాకెంతో కోపముచ్చిందీ నాయింటిదాన్ని నేను కొట్టవలసొచ్చిందీ॥నా
ఒకల్లైన నామాట । కొప్పకొనకున్నారు । కాకపోతే రాణి
నన్ను గడ్డిపరకనుకుంది ॥నా॥
భూమి । మీద అందరికీ । పొయ్యేకాలముట్టింది । సావిరంగ
నేనింక । పచ్చిమోతానియ్యాల॥మెం॥

5 దాశరాజు—రాణి.

బ్యాగ్ —తిశ్రగతి.

ఎందుకీ పితాపము నీవేడుత్తున్నావొకాని। తొందరేల పొరక
పూజ చాలురా । నీకు చాలురా । మంచివేళరా । పాడు
గోలరా । యింక నేలరా ।।మెం॥
ఉండుండు నీకియ్యాల । ఉండరాము లుండాయ । మొండైన
పొరకకట్ట । రెండై పోతాదోలె । చెండేను వీపుమీద చిర్రి
బుర్రి మనకుండ పండంటి కాపురాన్ని పాడుసెయ్యాదలిశావ॥

7 సత్యవతి—ముఖారి—త్రితాల్.

జీవితేశ నాజీవనమిక నే త్రోవసలిపి పొమెదరోసదయా॥జీ॥
హావిధి యికమీయనంతరంబున నీపురినాకు శ్మశానమేకాదా॥

## 8. భీష్ముఁడు.

(మధ్యమావతి—త్రితాళ)

జనకా తమ వరదానము శిరమున ధరియించెదగా । పరమా
దరణముసకు బ్రహ్మానందము గనుగొంటిని ॥జన॥

ఈవరదానము భారత । భావి మహాసంగరమున దేవా నా
నాకనుకూలం । బగును శుభంబగు వేళల !॥జన॥

## 9. దాశరాజు - చాపుతాళం.

ఇయ్యాల నేపాడు మొగము సూశానో । నాకెయ్యారు పాడు
శకునాలూ ॥ఇ॥

విద్యానికొచ్చేతే । దయ్యాలు వెంటబడీ । కయ్యాని కొత్తేను
కంగారు పడ్డాను ॥ఇ॥

కాశీకపల రాజు కన్నబిడ్డలను పె । ళ్ళింపను నేబోయినాను
నాచక్కదనము దానికి నచ్చలేదేమొ । నామీఁద కన్నెయ్య
లే దొక్కపాలైనా ॥ఇ॥

## 10 దాశరాజు రాణి. (ఆదితాళం)

అప్పుడుదప్పిన పోరకపూజ నీ । కిప్పుడు తెప్పదు రారా ॥అల్ల॥
గొప్ప రాజువలె। సొయంవరానికి । గోటుమీఁద నీవెల్లితివా ।
చెప్పుదెబ్బలిక చాలవు గారా। చీపురుదెబ్బలు తిందువు గాని॥అ

## 11 భీష్ముఁడు ముఖారి—త్రిశ్రగతి.

అమ్మా నీవార్తి గొనకుమమ్మా । యిష్టేచ్ఛనరుగుమమ్మా పో
రపడితిని మాయమ్మా ॥అ॥

నీదుహృదయమిపు డన్యా । ధీనమగుట నెఱుగమి నిను సోదరీ
యుగంబుతోడ । సుఖముగ జేర్చిచితినిందు ॥అ॥

సాళ్వభూమిపతిని నీవు । సమ్మతి వలచితివేనియు । నాతనిదరి
కిపుడు జేర్తునమ్మా । ధృతిబూనుమమ్మ ॥అ॥

## 12 సాళ్వుఁడు.

ఛీ ఛీ ఛీ । జారిణి। కలుషప్రచారిణీ ॥ఛీ॥

స్వచ్ఛందసంచారిణీ । ప్రళయాహంకారిణీ ॥ఛీ॥
నిరుపమాన కాశీరాజాన్వయ సిరధికిని దీరని కళంకమును । దరిఁగొలిపి భీష్ము దరిఁజేరితివే । పగము నిర్భాగ్యవతి । దుర్గతి ఛీ ఛీ ఛీ ॥

ఏమని తలచితివి సాళ్వుని మది । కామవశుండై నినుబోలిన దు। ష్కర్మురాలి గవసెదననుకొంటివే కలుషనిచయ । కామినీ భూతమా ॥ఛీ ఛీ ఛీ॥

## 12 భీష్ముఁడు

అఘరహితా । సుకృతాత్మవు జనన్ని । విఘటనమయ్యె నీ । విధమున తల్లిరో ॥అ॥

ఏమి సలుపగల । నేటు దయగనగల । నీమహినే బ్రహ్మచారి నంచెఱుఁగవె ॥అ॥

నీమదిగోరిన భూమీశ్వరుతో । నోమానవతి సు । ఖింపువరింపుము ॥అ॥

## 14 అంబ — ఆదితాళం.

ఎంతని యిఁకను । శాంతినిగనెద । స్వాంతను ననో మృత్యుదేవతా ॥యెం॥

పంతమున న । న్నింతేఁటు సలుప । వెంతటి కఠినహృదయురాలవో ॥యెం॥

ఈతాపము స । హింపగగలనె చేతంబు నిరసించె జగంబును ॥

## 15 అంబ — బీసపలాస — రూపకం.

ఆహాహా । యెటుల్ సైతునో ॥ఆ॥
మహాభీల దుఃఖంబులన్ ॥ఆ॥

దహింపగనయ్యెగా । దేహంబు నాద్యంతముగా । అఆఅఆఅఅ
య్యెటుఘోరపాతకంబు । లేనోనర్చియుంటినో । ఉభయ భ్రష్ట
త్వము మరి । యుపరిసన్యాస మనుట । యిదియేయని యిప్ప
టి । కనుభవముచేత దెలిసికొంటి ॥అ॥

16. పరశురాముఁడు—మ్యాకొజ్, తిశ్ర.

నాపాణిక దాల్చి పరశు । వేపడగించెద నీభువి । భూపాలక
కోటినెల్ల । బొలియుగన్ । సలిపెదన్ భుజబలోద్ధతులచే॥నా
చింతిలకమ్మా । కమ్మీ । వంతదొలగ జేయువాడ । నంతము
నొందించెదనీ । యరుల । పరశుధారచేత ॥నా॥

17, (పరశురాముఁడు, భీష్ముఁడు డైలాగు)

పర— బాలుఁడ వెఱుఁగవు నాబలముగా । దూలించెదనీ దోర్బల
మెల్లను ॥బా॥

భీష్మ— జయమీభువి నీ । స్వారాధీనమగు । చలమేటికి భూసుర
వీరవరా ॥జయ॥

పర— ............ బహువర్షంబులు గడచెను । మద్భుజబల
ముగా ప్రకటింపగలేనైతిని ॥బా॥

భీష్మ— సమరమునకు తడవేలా ?—

పర— ................పర । శువుదాల్చితి వేరారా

భీష్మ— శస్త్రములు చాలునో ధీరా

పర— ఇకరారా । తడవేరా ॥బా॥

18, అంబ—చక్రవాకం—ఆది

అంబా । సద్గుణనికురంబా । అఖిలపాపసంహార । మహిమా
న్వితాంబా ।అంబ॥

నిరంతరమునీ । పదములు గొలిచెద । సురాసురాఖిల సన్నుత
వరదా । పరాత్పరీహరి పతితపావనీ । కరధృత నిరుపమ గం
భీరాయుధ ॥అంబా.॥

ఈజన్మను సలిసిన నాదోషము । లెల్లను దయతో మన్నింపగ దవే । పూజితాఖిల నిలింప స్వయంభూ మరుజన్మను భీష్ముని సమయింపవె ॥అం॥

19 సత్యవతి—నాదనామక్రియ - రూపకం.

ఏమిసేతు దైవమానే । నెటుల బ్రదుకుదాననింక । శ్రీమహితంబగు వంశము । క్షితిని కూలిపోవునుగద ॥యేమి॥
పతిగతించె నేకసుతుఁడు। బహుతరరోగాన్వితుఁడై । ధృతిజెడి మరణింపనుండె । దురదృష్టమేమోయిది ॥ఏ॥

20 భీష్ముఁడు — సింహేంద్రమధ్య.

హేయా । న్విత మీజగంబు మాయా । పటుభీషణ దుచ్ఛాయా । దీనికోఁ ఱకు మమతహోయా ॥హే॥
సారరహితమైన సంసారబంధము మానవులకు । తీరని ఘనపాశమగుచు । బంధించును దృఢతరముగ ॥హే॥

(సాకీ) దారాపుత్రధనాది సంబంధబంధంబే
మానవపూర్వ పునర్జన్మములకు హేతుభూతంబూ
(మిశ్ర) ఈసకలజగతిలోన వీని । సంఛేదించిన జనులకు । జన్మదుఃఖ జరాదుఃఖసంక్షోభము గలుగదమ్మ ॥హేయ॥

21 భీష్ముఁడు (ఈతీరుగా బల్కిన మీనాలుకలువలె)

సంగ్రామమున్ సల్పెదు మీవైరులను ద్రుంపందగునురణమున్ సలుపంగాజనుఁడూ । మీబాణాసనంబుల గొనుఁడిక । మీమహాబాణాసనములం గొనుఁడిక । రిపులను బరిమార్పఁదగు ఘోరముగ ॥సం॥

పటుతరమగు పాండవసైన్యములన్ । భరంబయిన మీపౌరుషంబుల । పరాక్రమంబున దున్ద్రించివేయుడీ కదున్ రయంబున కదున్ రయంబున ॥సం॥

## 22 అర్జునుఁడు (సాపలుకులు వినదగు మట్టు)

ఈరణమును గనుగొన భరముగ దోచెను, మనమున నెది యును దోఁపదు హరియీ ||రణ||

ఆభీష్ముఁ గనుగొనఁగ కాలరుద్రునిగతి వెలిగెడు। నేపగిదిని యీసమరము సేయదగునో తెలియదు ||ఈ||

పదిదినములు గతియించెనుగా। మదమొకయింతయు సణగ దుగా - ముదుసలి యీతడనుచు దలచిన యీ - గతియు సా ధ్యుఁడై కాన్పించె ||ఈ||

## 23 కృష్ణుఁడు, అర్జునుఁడు, భీష్ముఁడు

బ్యాగ్ — చాపుతాళం.

(ఈశరముచేత నాశనము జేసి యాపోశనము మట్టు)

భీ — ఈరణమునందు మిము మారణము జేసిదా - భూరమణులకు
భీతిసలిపెదను గనుడీ ||ఈ

కృ, అ — బాహుశూరులకు వృథా వివా - దమేల మానుడే

భీ — వీరమానులయిన మదిని భీతిగొనక నిలువుడి. అదరు బెద
రులికనేలా -

కృ, అ — అటులయిన శరముగొన వేలా—

భీ — శస్త్రమునగూల్తురా బాలా - ఛీ బాలా ఛీ బాలా ||ఈ||

## 23 కృష్ణుఁడు - బ్యాగ్ - ఆది.

అక్రమమో, సక్రమమో, చక్రంబున ద్రుంపకవిడువను గను। పదిదినములనుండియు నొకవిధమున - పరాక్రమము జూపెడు బ్రహ్మచారి - పదునుశరంబుల బడలెశరీరము - వదలకఁ భీష్ము వధించివై చెద ||అ||

## 25. భీష్ముఁడు పూరికల్యాణి-ఆది.

పాహింపాహిమాంపాహి దయానిధి బహుళభవహారణ పావన
చరణా ॥పా॥ అమలసురత విదితచరిత - విగతదురిత విమల
నిరత - సలిల భవపాదాంబుజాత - సకలభువన స్వయంభూత
సోమసూర్యవిలోచన సుమనోవిధాన సూరిసన్మాన ॥పా॥

### మంగళం.

మందరధర - మంగళకర మంగళంబురా ॥మం॥
మారసుందరా - శ్రీరమేశ బ్రోవరా దాసభరణా దోషహార
ణా దానవేశనాశా రాజరాజేశ్వరా - పరాత్పరా - శ్రీని
వాస జగదీశా శ్రీరమా నాయకా జగన్నాయకా ॥మంద॥

సంపూర్ణము.

బెజవాడ మైలవరం బాలభారతీ నాటకసమాజమువారిచే

ప్రదర్శింపబడు నాటకరత్నములు.

| | | |
|---|---|---|
| సావిత్రి శ్రీ॥ స॥ | | 1-0-0 |
| ద్రౌపదీవస్త్రాపహరణము మ॥ అ॥ | | 1-0-0 |
| పత్నీప్రతాప్ అనసూయ సో॥ రా॥ | | 1-0-0 |
| శ్రీకృష్ణతులాభారము ము॥ సు॥ | | 1-0-0 |
| భీష్మబ్రహ్మచారి (సంపూర్ణ భీష్మచరిత్ర) సో॥ రా॥ | | 1-0-0 |
| గంగావతరణము | ,, | 1-0-0 |
| ధరణికోట (రెడ్లప్రతాపము) | ,, | 1-0-0 |
| రంగూన్‌రౌడీ (పతిభక్తి) | ,, | 1-0-0 |
| బొబ్బిలియుద్ధము | శ్రీ॥ కృ॥ | 1-0-0 |
| పాదుకాపట్టాభిషేకము | పా॥ ల॥ | 1-4-0 |
| రాధాకృష్ణ | ,, | 0-12-0 |
| రామదాసు | బళ్ళారి డి॥ రా॥ | 1-0-0 |
| కృష్ణలీల | బళ్ళారి పండిత, కె॥ సు॥ | 1-4-0 |
| లవకుశ | ,, ,, | 1-4-0 |
| సత్యహరిశ్చంద్రీయము | బ॥ ల॥ | 1-0-0 |
| అనార్కలి (క్రొత్తనాటకము) | ము॥ వేం॥ | 1-0-0 |
| చండిక (అత్యద్భుతమైన నాటకము) | ,, | 1-0-0 |
| సావిత్రి సాంగ్సు స్వరసహితం | పా॥ కాం॥ | 0-12-0 |
| ద్రౌపదీవస్త్రాపహరణము సాంగ్సు | ,, | 0-12-0 |
| రాధాకృష్ణ సాంగ్సు | ,, | 0-12-0 |
| శ్రీకృష్ణతులాభారము సాంగ్సు | ,, | 0-12-0 |

వలయువారు— సరస్వతీ బుక్ డిపో, బెజవాడ.